www.andhrajyothy.com
పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం

ఆంధ్రజ్యోతి

విజయవాడ సిటీ**

వెల (Price) : Rs. 8.00

సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 68

ANDHRAJYOTHI

ఆదివారం | 23-6-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: విదియ తె. 3.26 తదుపరి తదియ; నక్షత్రం: పూర్వాషాఢ సా. 5.04 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా. 12.40-2.12; దుర్ముహూర్తం: సా. 5.04-5.56; అమృతఘడియలు: మ. 12.26-1.58; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.46; సూర్యాస్తమయం: 6.48

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కత్తి మీద సామే!



..ప్రజాస్వామ్యంలో పాలకులు ఎలా ఉండకూడదో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అండ్ కో రుజువు చేసినందున తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు బాధ్యతతో మెలగాలి. జగన్‌కు వ్యతిరేకంగా ప్రజలు కసిగా తీర్పు ఇచ్చినందున ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రుల వ్యవహార శైలిని ప్రజలు నిశితంగా గమనిస్తుంటారు. అధికారం బాధ్యత మాత్రమే అని తెలుసుకుంటే మంచిది.

..తమకు 11 సీట్లు మాత్రమే ఎందుకు వచ్చాయో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి అధికారంలో ఉన్నప్పుడు ఉన్మాదంగా వ్యవహరించిన జగన్ అండ్ కో సిద్ధపడడం లేదు. కనుక వారి విషయం ప్రజలే తేల్చుకుంటారు.

..ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విర్రవీగకుండా శాసనసభ్యుల ప్రమాణస్వీకారం సందర్భంగా జగన్మోహన్ రెడ్డికి సముచిత గౌరవం కల్పించారు. కానీ జగన్ రోత మీడియా మాత్రం ఆయనను అవమానించారంటూ వార్తలు వండి వార్చి తన బుద్ధి పోనిచ్చుకోలేదు. తనకు తగిన గౌరవం ఇచ్చినా జగన్ హుందాగా వ్యవహరించలేకపోయారు.

..మొత్తమ్మీద జగన్మోహన్ రెడ్డితో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి విపరీత మనస్తత్వాల వల్ల అధికార యంత్రాంగం కుళ్లిపోయింది. బటన్లు నొక్కుతున్నందున జగన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారని నమ్మి అడ్డగోలు పనులు చేశారు. ఈ నేపథ్యంలో కుళ్లిపోయిన అధికార యంత్రాంగంతోనే పని చేయించుకోవాల్సి రావడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కత్తి మీద సాము వంటిదే.

..అయితే చంద్రబాబుకు ఆప్షన్లు తక్కువ. గతంలో సమర్థులుగా పేరు తెచ్చుకున్న అధికారులు కూడా ఈ ఐదేళ్లలో చెడిపోయారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు, చేసిన ఎంపికలపై తెలుగు తమ్ముళ్లు నిరసన వ్యక్తంచేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి సృష్టించిన సంప్రదాయం ఆమోదయోగ్యం కాకపోయినా చంద్రబాబు కూడా అలాగే వ్యవహరించాలని తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నారు.

..జగన్ రెడ్డి వలె కక్షపూరిత పాలన చేయాలనుకోవడం సమర్థనీయం కాదు. అదే జరిగితే రాష్ట్రం మొత్తం ఫ్యాక్షన్ జోన్‌గా మారిపోతుంది. అదే సమయంలో మితిమీరిన ఔదార్యం కూడా ప్రదర్శించకూడదు. తప్పు చేసిన అధికారులను, నాయకులను చట్టప్రకారం శిక్షించడానికి చర్యలు తీసుకోవలసిందే.

..ప్రస్తుతానికి చంద్రబాబు హుందాగానే వ్యవహరిస్తున్నారు. ఆయన ప్రభుత్వం మున్ముందు ఎలా వ్యవహరించబోతోందన్నదాన్ని బట్టి జగన్ రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వ వ్యతిరేకత ఆధారంగానే ఇటీవల ప్రజలు తీర్పిస్తున్నారు.

కొత్త పలుకు

-ఆర్కే విశ్లేషణ 4లో..



బోటుయార్డు భూముల్లో అక్రమంగా భవన నిర్మాణం చేపట్టడంపై మంగళగిరి-తాడేపల్లి కమిషనర్ గత నెల 20న జారీచేసిన నోటీసు

విశాఖ, అనకాపల్లి వైసీపీ ఆఫీసులకూ నోటీసులు



తాడేపల్లిలో వైసీపీ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

వైసీపీ అక్రమాలపై బుల్డోజర్!

తాడేపల్లిలో అనుమతుల్లేకుండా కడుతున్న వైసీపీ ఆఫీస్ కూల్చివేత

17 ఎకరాల బోటుయార్డు భూముల స్వాహాకు కుట్ర

పార్టీ ఆఫీసు కోసం రెండెకరాలు కేటాయిస్తూ జీవో

ఆ భూమిని స్వాధీనం చేయని జలవనరుల శాఖ

అయినా ఎన్నికల ముంగిట అడ్డగోలు నిర్మాణాలు

కార్పొరేషన్ అనుమతి, సీఆర్‌డీఏ పర్మిషన్లూ లేవు

దీంతో నిబంధనల మేరకు పలు నోటీసులు జారీ

హైకోర్టులో వైసీపీ పిటిషన్.. లభించని ఊరట

చట్టబద్ధంగా వ్యవహరించాలని కోర్టు ఆదేశం

చివరికి శనివారం తెల్లవారుజామున కూల్చివేత

మంగళగిరి, జూన్ 22: రాష్ట్ర జలవనరుల శాఖ భూముల స్వాహాకు వైసీపీ నాయకత్వం చేసిన ప్రయత్నాలను అధికారులు అడ్డుకున్నారు. అనుమతుల్లేకుండా భూమిని స్వాధీనం చేసుకుని.. అందులో అడ్డగోలుగా ఆ పార్టీ నిర్మిస్తున్న భవనాన్ని కూల్చివేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లిలో శనివారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటుచేసుకుంది. తాడేపల్లి పాత, కొత్త హైవేల నడుమ జలవనరుల శాఖకు సర్వే నంబరు 202-ఏలో అత్యంత ఖరీదైన 17.03 ఎకరాల భూమి (తాడేపల్లి బోటు యార్డు స్థలం) ఉంది. ఇక్కడ ఎకరా విలువ రూ.25 కోట్ల వరకు ఉంది. దీనిని హస్తగతం చేసుకునేందుకు వైసీపీ నాయకత్వం పెద్ద పథకమే వేసింది. 17.03 ఎకరాల్లో రెండెకరాల స్థలాన్ని వైసీపీ కార్యాలయ భవనం కోసమంటూ నిరుడు ఫిబ్రవరి 16న జీవో 52 విడుదల

జగన్ హయాంలోనే అక్రమ నిర్మాణంపై నోటీసులు

అయినా ఇవ్వలేదంటూ మాజీ సీఎం అబద్ధాలు

రాజధానికి రోడ్డు లేకుండా చేసేందుకే ఆ భూములపై కన్ను

జలవనరులు, కుంటల్లో నిర్మాణాలు కూడదని, ఆ భూమి ఇవ్వొద్దని నాడు ఈఎన్‌సీ నివేదిక.. అయినా కేటాయింపు

ఇప్పుడు నోటీసులకు స్పందించనందుకే కూల్చివేత

దీనిని చంద్రబాబుకు ఆపాదిస్తూ జగన్ రాజకీయం

మిగతా 11వ పేజీలో...



పులివెందుల నివాసంలో నేతలు, కార్యకర్తల మధ్య జగన్

సొంతూరిలో జగన్‌కు షాక్

బిల్లులు అందలేదని క్యాడర్ గగ్గోలు.. నేతలు, కార్యకర్తల అసంతృప్తి

జగన్ సర్దిచెప్పినా వినని వైనం.. తోపులాటలో కిటికీ అద్దాలు ధ్వంసం

మాజీ సీఎంగా తొలిసారి పులివెందులకు.. కనిపించని శ్రేణుల హడావుడి

12



సభాపతిగా అయ్యన్న

సీనియర్ బీసీ నేతకు పట్టం

ప్రతిపక్ష వైసీపీ ఎమ్మెల్యేలు డుమ్మా

సంప్రదాయాన్ని గౌరవించని జగన్

అందరికీ అవకాశం కల్పిస్తా: అయ్యన్న

అసెంబ్లీలో చానళ్లపై నిషేధం ఎత్తివేత

తొలి సంతకం చేసిన స్పీకర్ అయ్యన్న

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర 16వ శాసనసభ సభాపతిగా బీసీ నాయకుడు, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఉదయం ఆయన ఎన్నికను ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి సభలో

మిగతా 11వ పేజీలో...



అయ్యన్నను పోడియం వద్దకు తోడ్కొని వెళుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు అచ్చెన్న, సత్యకుమార్

టీడీపీపీ నేతగా లావు శ్రీకృష్ణదేవరాయలు

ఉప నేతలుగా ప్రసాదరావు, శబరి

రాష్ట్ర ప్రయోజనాలే ఎంపీల కర్తవ్యం

పోలవరం, అమరావతిని ప్రాధాన్యాలుగా ఎంచుకోండి: చంద్రబాబు

11

గౌరవసభలో అడుగుపెట్టా!

నా బాధను ప్రజలు అర్థం చేసుకున్నారు.. అయ్యన్న పసుపు పోరాట యోధుడు.. బీసీ నేతకు పట్టం సంతోషం

వైసీపీకి 11 స్థానాలు దేవుడిచ్చిన స్క్రిప్టు.. స్పీకర్ ఎన్నికకు రాకుండా వైసీపీ సభా విలువలు మంటగలిపింది

ప్రజలిచ్చింది అధికారం కాదు.. బాధ్యత.. రాజధాని కట్టాలి, పోలవరం పూర్తి చేయాలి: సీఎం చంద్రబాబు

ఓటమిని స్వీకరించలేని పిరికివారు.. వైసీపీపై పవన్ ధ్వజం.. ఇక తిట్టడానికి నో చాన్స్.. అయ్యన్నతో చలోక్తి

11

ఏపీని ఆదుకోండి

రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్లు ఇవ్వండి

పోలవరం పూర్తికి సహకారం అందించండి

హేండ్లూమ్స్, పాదరక్షలపై జీఎస్టీ తగ్గించండి

కేంద్రానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల విజ్ఞప్తి

12



అభివృద్ధిలో బాబుతో పోటీ!

ఆయన 18 గంటలు కష్టపడతారు

ఇక నేనూ అంతసేపు పనిచేయాల్సిందే: టీ-సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఆటలో రాణించాలంటే నైపుణ్యం ఉన్న నాయకుడితో పోటీపడడం అవసరమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ఆంధ్ర సీఎం చంద్రబాబుతో పోటీపడి పనిచేసే అవకాశం ఇప్పుడు తనకు వచ్చిందని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా రోజుకు 12 గంటలు కష్టపడేందుకు సిద్ధమయ్యానని.. అయితే చంద్రబాబు 18 గంటలు కష్టపడతారని.. ఇక తాను కూడా 18 గంటలు పని చేయాల్సిందేనని వ్యాఖ్యానించారు. తెలంగాణలో మంత్రులు, అధికారులు కూడా అంతసేపూ పని చేయాల్సిందేనన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు పోటీ పడి ప్రపంచానికే ఆదర్శంగా తయారు కావాలన్నదే తమ ఆశయమని

మిగతా 12వ పేజీలో...

ఏడుగురు కలెక్టర్లపై వేటు

జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ఆదేశం

వీరిలో విశాఖ, తూర్పు, గుంటూరు కలెక్టర్లు

11 జిల్లాలకు కొత్తవారి నియామకం

గుంటూరుకు నాగలక్ష్మి, ఎన్టీఆర్‌కు సృజన

పశ్చిమకు సీనియర్ ఐఏఎస్ నాగరాణి

మొత్తం 6 జిల్లాలకు మహిళా కలెక్టర్లు


సీఎస్ నీరబ్‌కుమార్ ఉత్తర్వులు

ఆర్థిక ముఖ్య కార్యదర్శిగా పీయూష్!

కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్రానికి




మాధవీలత



మల్లికార్జున్



వేణుగోపాల్‌రెడ్డి



ఢిల్లీరావు

అమరావతి, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం భారీఎత్తున కలెక్టర్లను బదిలీ చేసింది. జగన్ ప్రభుత్వంతో అంటకాగిన విశాఖపట్నం కలెక్టర్ మల్లికార్జున్, గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సహా ఏడుగురు కలెక్టర్లపై వేటుపడింది. వారికి పోస్టింగులు ఇవ్వకుండా జీఏడీలో రిపోర్టుచేయాలని ఆదేశిస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. మొత్తంగా 11 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. వీరిలో ఆరుగురు మహిళలే కావడం విశేషం. గుంటూరు కలెక్టర్‌గా ఎస్.నాగలక్ష్మి, ఏలూరు-కె.వెట్రిసెల్వి, తూర్పుగోదావరి-పి.ప్రశాంతి, పశ్చిమగోదావరి-సి.నాగరాణి, ఎన్టీఆర్ జిల్లా-సృజన, ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఎ.తమీమ్ అన్సారియాకు అవకాశం లభించింది. వీరిలో నాగరాణి సీనియర్ ఐఏఎస్

మిగతా 2వ పేజీలో...



నీట్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు!

పరీక్ష నిర్వహణ సంస్థ ఎన్‌టీఏ డీజీపై వేటు

ఎన్‌టీఏ సంస్కరణలకు కమిటీ ఏర్పాటు

నేడు జరగాల్సిన నీట్-పీజీ వాయిదా

ఎల్లుండి నుంచి పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో కేంద్రం నష్ట నివారణ చర్యలు

ఫలించిన విద్యార్థులు, విపక్షాల ఒత్తిడి

పరీక్షల పవిత్రత కాపాడతాం: కేంద్రం

లీక్ రాకెట్ ముందు మోదీ నిస్సహాయంగా మారారు

అసమర్థ నాయకత్వంతో పిల్లల భవిష్యత్తుకు ప్రమాదం: రాహుల్

నీట్ లీకేజీ సూత్రధారి అరెస్టు

న్యూఢిల్లీ, జూన్ 22: రెండు వారాలకు పైగా దేశవ్యాప్తంగా విద్యార్థులు జరుపుతున్న పోరాటం, జాతీయ స్థాయిలో బలపడిన విపక్షాల ఒత్తిడి ఫలించాయి. జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన నీట్-యూజీ, యూజీసీ-నెట్ ప్రవేశ పరీక్షల లీక్ వ్యవహారాలపై విమర్శలు వెల్లువెత్తి, ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతినడం, సోమవారం నుంచి జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో అదే ప్రధానాంశం అయ్యే పరిస్థితి కనిపించడంతో కేంద్ర ప్రభుత్వం నష్ట నివారణ చర్యలను ప్రారంభించింది. శనివారం మధ్యాహ్నం నుంచి చకచకా పలు నిర్ణయాలు తీసుకుంది. మొదట నీట్ పరీక్షను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రక్షాళనకు ఉన్నత స్థాయి కమిటీని వేసింది. తర్వాత ఎన్‌టీఏ అధిపతిని పదవి నుంచి తప్పించింది. అసలు ఎన్‌టీఏకు లోపాల్లేకుండా పరీక్షలు నిర్వహించే సామర్థ్యం ఉందో లేదో తేల్చుకొనే వరకు పరీక్షల నిర్వహణకు విరామం ప్రకటించే

మిగతా 2వ పేజీలో...

ప్రైవేట్ హాస్టళ్లకు జీఎస్టీ వినహాయింపు

రైల్వేలో పలు సేవలపైనా జీఎస్టీ రద్దు.. పలు ఉత్పత్తులపై 12 శాతానికి తగ్గింపు

పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్రాలదే నిర్ణయం.. జూన్ 30 దాకా రిటర్న్స్ దాఖలుకు చాన్స్

53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మల వెల్లడి

2

నీట్ లీకేజీ సూత్రధారి
రవి అత్రి అరెస్టు



పట్నా, జూన్ 22: నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో కీలకంగా వ్యవహరించిన రవి అత్రిని ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) పోలీసులు శనివారం అరెస్టు చేశారు. లీకేజీ కుట్రదారు సంజీవ్ ముఖియాకు అత్రి సన్నిహితుడు. నోయిడాకు చెందిన అత్రి తాజా కేసులో మధ్యవర్తిగా వ్యవహరించాడని, గతంలోనూ పేపర్ లీకేజీలో అరెస్టయ్యాడని పోలీసులు వివరించారు. 2007లో వైద్య విద్యలో ప్రవేశాలకు కోచింగ్ తీసుకునేందుకు అత్రి రాజస్థాన్‌లోని కోటాకు వెళ్లాడని, 2012లో పరీక్ష పాసై.. ఎంబీబీఎస్ సీటు సంపాదించాడని చెప్పారు. అయితే.. ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం పరీక్షలు రాయకుండా.. నోయిడా చేరుకుని, పేపర్ లీకేజీ మాఫియాతో చేతులు కలిపాడని వెల్లడించారు. "సాల్వర్ గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి.. విద్యార్థుల స్థానంలో నకిలీ వ్యక్తులను పంపించేవాడు" అని వివరించారు. అత్రి పట్టివేతతో ఈ కేసులో బిహార్ పోలీసుల అరెస్టుల సంఖ్య 14కు పెరిగింది. నిందితులను విచారించగా.. సంజీవ్ ముఖియా పేరు ప్రముఖంగా వెలుగులోకి వచ్చిందని, ఈ లీకేజీ రాకెట్ వెనక ప్రధాన కుట్రదారు అతడేనని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు ఈ కేసును దర్యాప్తు చేస్తోన్న బిహార్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోయూ) అధికారులు శనివారం ఝార్ఖండ్‌లో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు నీట్ పరీక్షకు ముందు పట్నాలో అద్దెకు దిగిన ఫ్లాట్ నుంచి ప్రశ్నపత్రాన్ని సీజ్ చేశామని, ఎన్‌టీఏ అధికారులు పంపిన రిఫరెన్స్ ప్రశ్నపత్రంతో దాన్ని పరిశీలిస్తున్నామని ఈవోయూ అధికారులు తెలిపారు. "ఈ కేసులో బిహార్‌లోని మరికొన్ని కాలేజీలపై నిఘా పెట్టాం. నీట్ పరీక్ష జరిగిన రోజు ఏయే కాలేజీల్లో పరీక్ష కేంద్రాలున్నాయి? వాటిల్లోకి విద్యార్థుల బదులు సాల్వర్ గ్యాంగ్ వ్యక్తులు లోనికి ఎలా వెళ్లగలిగారు? ఆయా విద్యాసంస్థల్లో వారికి సహకరించిన వారెవరు? ఈ గ్యాంగ్ పంపిన విద్యార్థుల సీటింగ్ అరేంజ్‌మెంట్ ఒకేచోట వచ్చేలా చేయడానికి సహకరించిందెవరు? అనే కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నాం. కాలేజీల సిబ్బంది, సాల్వర్లకు భారీగా నగదు అందినట్లు గుర్తించాం. మనీలాండరింగ్ కోణంలో ఈడీ కూడా రంగంలోకి దిగనుంది" అని వివరించారు. నిందితుల నుంచి నిజాలను రాబట్టేందుకు నార్కో అనాలిసిస్, బ్రెయిన్ మ్యాపింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఎవరీ ముఖియా?

సంజీవ్ ముఖియా బిహార్‌లోని నలంద జిల్లా నాగర్‌సోనా ప్రాంతానికి చెందినవాడు. తొలుత సాబూర్ వ్యవసాయ కళాశాలలో పనిచేశాడు. అక్కడ ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలతో 2016లో అరెస్టయ్యి, జైలుకు వెళ్లాడు. ఆ తర్వాత నలంద కాలేజీలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. గతంలో ప్రభుత్వ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల్లో ఇతని పేరు బయటకు వచ్చింది. ఇతని కుమారుడు, వైద్యుడు శివకుమార్ బిహార్ టీచర్ల నియామక పరీక్ష పేపర్ లీకేజీలో ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. సంజీవ్ ముఖియా, శివకుమార్ కలిసి 'ముఖియా సాల్వర్ గ్యాంగ్'ను ఏర్పాటు చేశారు. ఈ కేసులో లీకైన ప్రశ్నపత్రం తొలుత ముఖియాకే అందిందని బిహార్ ఈవోయూ పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న ముఖియా అరెస్టుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నీట్‌ను ఎందుకు రద్దుచేయలేదంటే

ప్రశ్నపత్రం లీక్ అయినట్లు ఆధారాలున్నా.. అరెస్టులు జరుగుతున్నా.. నీట్-యూజీ పరీక్షను రద్దు చేయకపోవడంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం వివరణ ఇచ్చారు. లీకేజీ ఓ ప్రాంతానికి మాత్రమే.. అదికూడా కొందరు వ్యక్తులకు మాత్రమే పరిమితమైందన్నారు. "కౌన్సెలింగ్ ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. 24 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షను రాశారు. నీట్‌ను రద్దు చేస్తే.. నిజాయితీగా పరీక్ష రాసినవారికి ఇబ్బందులు కలుగుతాయి. ఈ వ్యవహారం ఇప్పటికే సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. కోర్టు నిర్ణయమే ఫైనల్" అని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రైవేట్ హాస్టళ్లకు
జీఎస్టీ మినహాయింపు



న్యూఢిల్లీ, జూన్ 22: ప్రైవేటు హాస్టళ్లలో ఉండే విద్యార్థులు.. రైల్వే ప్రయాణికులకు శుభవార్త..! కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ అధ్యక్షతన శనివారం జరిగిన 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో.. పలు సేవలకు పన్ను మినహాయింపునిస్తూ నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులు విద్యాసంస్థల హాస్టళ్లలో కాకుండా.. ప్రైవేటు వసతి గృహాల్లో ఉంటే.. నెలవారీ అద్దెపై జీఎస్టీని మినహాయించాలని కౌన్సిల్ నిర్ణయించింది. అయితే.. విద్యార్థుల నుంచి వసూలు చేసే నెలవారీ అద్దె రూ.20 వేలలోపు ఉండాలి. హాస్టళ్ల నిర్వాహకులు మోసాలకు పాల్పడకుండా ఉండేందుకు.. సంబంధిత విద్యార్థి కనీసం 90 రోజులుగా ఆ వసతి గృహంలో ఉండాలనే నిబంధనను పెట్టారు. అంతే కాదు.. రైల్వే స్టేషన్లలో ప్లాట్‌ఫారం టికెట్లు, వెయిటింగ్ రూమ్, క్లోక్‌రూమ్ చార్జీలు, ప్లాట్‌ఫారాలపై బ్యాటరీ కారు సేవలను కూడా జీఎస్టీ నుంచి మినహాయించారు. ఇక ఇప్పటి వరకు రెండు స్లాబులుగా ఉన్న సోలార్ కుక్కర్ల జీఎస్టీని 12శాతంగా సవరించారు. ఫైర్ సహా.. అన్నిరకాల స్ప్రింక్లర్లు, పౌల్ట్రీ యంత్రాలు, అన్ని రకాల కార్టన్లు(అట్టపెట్టెలు), ఇనుము, ఉక్కు, అల్యూమినియంతో తయారు చేసిన పాలక్యాన్లపై జీఎస్టీలను ఏకీకృతం చేస్తూ.. 12శాతానికి తగ్గించారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో చిరు వ్యాపారులకు మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకున్నట్లు నిర్మలాసీతారామన్ వెల్లడించారు.

పెట్రోల్, డీజిల్‌పై నిర్ణయం రాష్ట్రాలదే

పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలన్నదే ఎన్డీయే సర్కారు లక్ష్యమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ స్పష్టం చేశారు. 2017లో అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ కూడా ఈ విషయంపై విస్పష్టమైన వివరణ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అయితే.. దీనిపై రాష్ట్రాలు తేల్చుకోవాల్సి ఉందని జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్మల వ్యాఖ్యానించారు. "పెట్రోల్, డీజిల్‌పై జీఎస్టీ రేటు ఎంత ఉండాలి? అన్నదాన్ని రాష్ట్రాలు నిర్ణయించుకోవాల్సి ఉంది. ఒక్కసారి రాష్ట్రాలు ఒక రేటును చెబితే.. కేంద్రం అందుకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తుంది" అని ఆమె వ్యాఖ్యానించారు.

జీఎస్టీ కౌన్సిల్ మరికొన్ని నిర్ణయాలివి..

రక్షణ దళాలకు నిర్దిష్ట వస్తువుల దిగుమతిపై 2030 వరకు ఐజీఎస్టీ నుంచి మినహాయింపు ఉంటుంది. రిసెర్చ్ మూర్డ్ అరే ఫర్ ఆఫ్రికన్-ఆసియన్-ఆస్ట్రేలియన్ మాన్సూన్ అనాలిసిస్ అండ్ ప్రిడిక్షన్(రామా) ప్రోగ్రామ్ కింద దిగుమతి చేసుకునే పరికరాల దిగుమతిపై ఐజీఎస్టీ మినహాయింపునిస్తారు. సెజ్‌లలో అధీకృత కార్యకలాపాల కోసం జరిపే దిగుమతులకు 2017 నుంచి అమలయ్యేలా సెస్ మినహాయింపు ఉంటుంది. రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ(రెరా) 2017 జూన్ 28 వరకు జరిపిన చట్టబద్ధమైన వసూళ్లు జీటీఆర్ ఎంట్రీ-4 పరిధిలోకి వస్తాయనే కారణంతో.. ఆ వసూళ్లను జీఎస్టీ నుంచి మినహాయించారు

వాణిజ్యానికి బాసట

● 2017-18 నుంచి 2019-20 వరకు జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 73 కింద వర్తకులు, వ్యాపారులకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి.. వడ్డీ లేదా జరిమానా లేదా రెండింటినీ షరతులతో మినహాయించేలా సవరణలు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. జీఎస్టీ అప్పీళ్లకు రూ.20లక్షల దాకా ఉండే మొత్తానికి సంబంధించి జీఎస్టీ ట్రైబ్యునళ్లు, రూ.20లక్షల నుంచి రూ.కోటి మధ్య ఉండే మొత్తానికి హైకోర్టు, ఆపైన మొత్తానికి సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని కౌన్సిల్ సిఫారసు చేసింది. అప్పీల్ దాఖలు సమయాన్ని మూడు నెలల వ్యవధిని ఇవ్వాలని సూచించింది. చిన్న వ్యాపారులకు పన్ను చెల్లింపునకు జీఎస్టీఆర్-4 రిటర్న్ దాఖలు గడువును ఏప్రిల్ 30 నుంచి జూన్ 30కి మార్చారు.

నీట్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు

(మొదటటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను వాయిదా వేసింది. చివరగా శనివారం రాత్రి నీట్ లీక్ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. లీక్ మూలాలను తేల్చేందుకు సమగ్ర దర్యాప్తు కోసమే సీబీఐకి అప్పగిస్తున్నట్లు కేంద్ర విద్యాశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. సీబీఐ దర్యాప్తు నిర్ణయానికి కొద్ది గంటల ముందు కేంద్రం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్‌సింగ్‌పై వేటేసింది. ఆయన స్థానంలో ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ అయిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రదీప్‌సింగ్ కరోలాకు ఎన్‌టీఏను అదనపు బాధ్యతగా అప్పగించారు. సుబోధ్ కుమార్ సింగ్‌ను కంపల్సరీ వెయిట్‌లో ఉంచారు. సుబోధ్ కుమార్ సింగ్ ఎన్‌టీఏ డీజీ హోదాలో దాదాపు 1500 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చి నీట్-యూజీ పరీక్షపై వివాదానికి తెర తీశారు. సుబోధ్‌పై వేటు సమయంలోనే ఆదివారం (జూన్ 23న) జరగాల్సిన నీట్-పీజీ ప్రవేశ పరీక్షను వాయిదా వేశారు. వరుసగా రెండు పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయిన నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ముందు ఎన్‌టీఏ పరీక్షల నిర్వహణ సామర్థ్యాన్ని అంచనా వేయాలని నిర్ణయించారు. ఈ పరీక్ష మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారనేది తర్వాత ప్రకటించనున్నారు. నీట్ తదితర పోటీ పరీక్షలను నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ను సంస్కరిస్తున్నట్లు శనివారం మధ్యాహ్నం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ రెండు నెలల్లో నివేదిక సమర్పిస్తుందని తెలిపింది. ఎన్‌టీఏ పరీక్షలను సజావుగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం కోసం, ఎన్‌టీఏ డేటాను భద్రపరిచే పద్ధతులను, ఎన్‌టీఏ నిర్మాణం, పనితీరును, పరీక్షలు నిర్వహించే తీరును మెరుగుపరచడానికి సలహాలు ఇస్తుందని చెప్పింది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వీసీ బి.జె.రావు, ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణదీప్ గులేరియా, ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్ రమణమూర్తి, పంకజ్ బన్సల్, ఢిల్లీ ఐఐటీకి చెందిన ప్రొఫెసర్ ఆదిత్య మిట్టల్, విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి గోవింద్ జైశ్వాల్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని ప్రకటించింది. పరీక్షల వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు తొలి అడుగని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. అన్ని రకాల అక్రమాలకు అవకాశాలను మూసేస్తామని చెప్పారు. మొత్తం ఎన్‌టీఏ వ్యవస్థనే ప్రక్షాళిస్తామని ప్రకటించారు. పేపర్ కూర్పు మొదలు ఫలితాల విడుదల వరకు అన్ని దశల్లో ఇప్పటికే ఉన్న విధానాలను ఈ కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. ఇప్పటికే ఎన్‌టీఏ ఆధ్వర్యంలో జరిగిన నీట్, యూజీసీ-నెట్ పరీక్షలు లీక్ అయినట్లు తేలింది. నీట్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, యూజీసీ-నెట్‌ను రద్దు చేశారు.




విపక్షం ఒత్తిడి పని చేసింది

ఎన్‌టీఏ పరీక్షలకు సంబంధించి పదేపదే లీకుల ఆరోపణలు రావడం, విద్యార్థులకు కలిగిన ఇబ్బందులు, వారిలో వ్యక్తమైన ఆగ్రహావేశాలు, బలం పుంజుకున్న విపక్షం ఒత్తిడి.. వెరసి అన్నీ కలిసి సుబోధ్ కుమార్ సింగ్‌పై వేటు వేయక తప్పని పరిస్థితిని కల్పించాయి. సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు కూడా ప్రభుత్వంపై పని చేశాయి. ఎన్‌టీఏను ప్రక్షాళిస్తామని విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వయంగా చెప్పిన నేపథ్యంలో ప్రక్షాళనలో సుబోధ్ కుమార్ సింగ్‌ను వెళ్లగొట్టడాన్ని భాగంగా చూడవచ్చని అంటున్నారు. శనివారమే ఆయన లీకుల ఆరోపణల నేపథ్యంలో ఎన్‌టీఏ అగ్ర నాయకత్వం మొత్తం మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కేంద్ర కేబినెట్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ధర్మేంద్ర ప్రధాన్‌ను చర్యలు కనిపించాలని ఆదేశించారు. ఫలితంగానే వేటు పడిందని భావిస్తున్నారు. పేపర్ లీక్ ఆరోపణను మూలాల వరకు దర్యాప్తు చేసి, అసలు దోషులను పట్టుకోవడం తమ ముందు ఉన్న ప్రధాన కర్తవ్యమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సుప్రీంకోర్టులో నీట్ లీకేజీ కేసు జూలై 8న విచారణకు రానుంది. కోర్టు కూడా నీట్ రద్దు చేయలేమని, ఆరోపణల నిజానిజాలు తేల్చమని చెప్పింది. ఈ నేపథ్యంలో దర్యాప్తులో పురోగతి సాధించడం మీద ప్రభుత్వం దృష్టి సారించింది. పరీక్షల పవిత్రతను, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటానికి తాము కట్టుబడి ఉన్నామని శనివారం రాత్రి కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

నీట్-పీజీ తేదీలు మళ్లీ ప్రకటిస్తారు

ఆదివారం (జూన్ 23న) జరగాల్సిన నీట్-పీజీ ప్రవేశ పరీక్షను వాయిదా వేశారు. వరుసగా రెండు పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయిన నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ముందు ఎన్‌టీఏ పరీక్షల నిర్వహణ సామర్థ్యాన్ని అంచనా వేయాలని నిర్ణయించారు. ఈ పరీక్ష మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారనేది తర్వాత ప్రకటించనున్నారు. ఈ పరీక్షలు కూడా ఎన్‌టీఏ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. జూన్ 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు జరగాల్సిన సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ పరీక్షలను శుక్రవారం రాత్రి వాయిదా వేశారు. లాజిస్టికల్ సమస్యల కారణంగా వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. నీట్-పీజీ వాయిదా వార్త వెలువడగానే కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ స్పందించారు. ఏదో ఒక పరీక్ష రద్దు/వాయిదా లేకుండా రాత్రి తెల్లారడం లేదని ఎద్దేవా చేశారు. మోదీ నాయకత్వంలో విద్యావ్యవస్థ కుళ్లిపోయిందని చెప్పడానికి నీట్-పీజీ వాయిదా మరో దురదృష్టకర ఉదాహరణ అని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. పేపర్ లీక్ రాకెట్ ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఏమీ చేయలేని నిస్సహాయుడిగా మారారని అన్నారు. ఆయన అసమర్థ ప్రభుత్వం పిల్లల భవిష్యత్తుకు పెద్ద ప్రతిబంధకం కానుందని చెప్పారు.

లోకం తీరు



పరీక్షల అక్రమాల చట్టం కంటి తుడుపు చర్య: ఖర్గే



న్యూఢిల్లీ, జూన్ 22: కేంద్ర ప్రభుత్వం పేపర్ లీక్ చట్టాన్ని అమల్లోకి తేవడం కంటితుడుపు చర్య అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం గత ఫిబ్రవరిలోనే లభిస్తే ఇప్పటిదాకా ఎందుకు అమల్లోకి తేలేదని ప్రశ్నించారు. విద్యారంగంలో మాఫియాను, అవినీతిని ప్రోత్సహిస్తున్నందుకు బీజేపీ బాధ్యత నుంచి తప్పించుకోలేదని వ్యాఖ్యానించారు. పరీక్షల అక్రమాలకు పాల్పడిన వారికి పదేళ్ల జైలు శిక్ష, కోటి రూపాయల జరిమానా నిబంధనలతో శుక్రవారం రాత్రి కేంద్ర ప్రభుత్వం పరీక్షల అక్రమాల నిరోధక చట్టం-2024ను అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు స్పందించారు. గత ఏడేళ్ల బీజేపీ పాలనలో మొత్తం 70 పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని ఆరోపించారు. వీటిపై ఇప్పటిదాకా బీజేపీ సర్కారు ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. కాగా, నీట్ లీకేజీ అంశంపై శనివారం తాజాగా పది మంది విద్యార్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతను సీబీఐ, ఈడీకి అప్పగించేలా ఆదేశాలివ్వాలని వారు కోర్టును కోరారు.

అడ్డుకట్టే పెద్ద 'ప్రశ్న'!

గత ఏడేళ్లలో 70 పైగా పరీక్ష పేపర్ల లీక్.. మొత్తం 1.70 కోట్ల మందిపైన ప్రభావం



అటు నియామక పరీక్ష కానీ.. ఇటు బోర్డు పరీక్ష కానీ..! నెట్ వంటి ప్రామాణిక పరీక్ష కానీ..! నీట్ వంటి కీలకమైన పరీక్ష కానీ..! రాజస్థాన్ నుంచి తమిళనాడు వరకు.. గుజరాత్ నుంచి బెంగాల్ దాక.. దేశంలో ప్రశ్నపత్రాల లీకేజీ అనేది ఇటీవల సర్వసాధారణమైపోయింది. ఔత్సాహిక అభ్యర్థులు, ప్రతిభావంతులైన విద్యార్థుల పాలిట పెనుశాపంగా మారింది. ఇలాంటివారిలో కొందరు.. తాము పడిన కష్టం వృథా అయిందనే వేదనతో బలవన్మరణాలకూ పాల్పడ్డారు. పరీక్షల వ్యవస్థను భూతంలా పట్టి పీడిస్తున్న లీకేజీ విష సంస్కృతి తాజాగా నీట్, నెట్ ఉదంతాల నేపథ్యంలో మళ్లీ పెను దుమారం రేపుతోంది.

లీక్ మాఫియా.. ఏటా పదిపైనే..

నీట్, నెట్‌లో అవకతవలు ఒకేసారి బయటపడడంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా రగడ జరుగుతోంది. కానీ, ఏడేళ్లుగా కనీసం ఏదో ఒక రాష్ట్రంలో పేపర్ లీకేజీ అనేది సర్వసాధారణమైంది. 2017 నుంచి చూస్తే 15 రాష్ట్రాల్లో 70 పైగా లీకేజీ ఘటనలు జరిగాయి. 1.70 కోట్లమంది అభ్యర్థులు ప్రభావితం అయ్యారు. ఇవన్నీ దేశంలో పరీక్షల నిర్వహణ సామర్థ్యాన్ని ప్రశ్నార్థకం చేశాయి. పోలీసులు, దర్యాప్తు సంస్థల విచారణలో తేలిన విస్మయకర విషయం ఏమంటే.. పేపర్ లీకేజీలో ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయుల పాత్ర ఉండడం. 24 లక్షల మంది పైగా హాజరైన ఇటీవలి నీట్ ప్రశ్నపత్రం బయటకు రావడాన్ని బట్టి చూస్తే దేశంలో 'పేపర్ లీక్ మాఫియా' ఎలా వేళ్లూనుకుందో స్పష్టమతోందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. లీకేజీలను ఎన్నికల సందర్భంగా గట్టిగా లేవనెత్తే రాజకీయ పార్టీలు తర్వాత నోరు మెదపడం లేదు. ఇది నాయకులు, లీకేజీ మాఫియా కలిసిపోయాయా? అనే అనుమానాలను రేకెత్తిస్తోందని అంటున్నారు. ప్రశ్నపత్రం సత్వరమే వేలాది చేతులు మారడంలో సోషల్ మీడియా ప్రధాన వాహకంగా మారుతోంది. పేపర్ లీక్ అయిన సందర్భాల్లో మళ్లీ పరీక్ష రాయాల్సి రావడం, సమయమంతా వృథా కావడంతో విద్యార్థుల నైతిక స్థైర్యం దెబ్బతింటోంది. కాగా, చాలా సందర్భాల్లో పేపర్ లీకేజీ చాన్నాళ్ల తర్వాత బయట పడుతోంది. ఈలోగా అనుచిత లబ్ధి పొందిన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరిపోతున్నారు. బిహార్, యూపీల్లో 'ఉద్యోగానికి భూమి' కుంభకోణం ఇదే తరహాలోనిదే. కాగా, బిహార్ తాజాగా కేంద్రం తీసుకొచ్చిన చట్టం నుంచి తప్పుకోవడం గమనార్హం. - సెంట్రల్ డెస్క్

ఈ రాష్ట్రాల్లోనే అధికం

తెలంగాణ, రాజస్థాన్, యూపీ, మధ్యప్రదేశ్, గుజరాత్, బిహార్.. దేశంలో పేపర్ లీకులు అత్యధికంగా జరిగిన రాష్ట్రాలు. వీటిలో ముఖ్యమైన ఉద్యోగ నియామక పరీక్షలే కాదు.. ఉన్నత విద్య, పాఠశాల పరీక్షల ప్రశ్నపత్రాలు ముందే బయటకు రావడం గమనార్హం. బిహార్‌లో పదో తరగతి పేపర్ ఆరుసార్లు, బెంగాల్ రాష్ట్ర బోర్డు ఎగ్జామ్ పేపర్ పదిసార్లు లీకయ్యాయి. రెండేళ్ల కిందట తమిళనాడులో 10, 12 తరగతుల పేపర్లు రెండూ పరీక్షకు ముందే విద్యార్థుల చేతుల్లో ఉన్నాయి. ఇక రాజస్థాన్‌ది మరో రికార్డు. యూజీసీ నెట్ సహా 2015-23 మధ్య 14 పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయి. గుజరాత్‌లోనూ ఏడేళ్లలో 14 లీకేజీ ఉదంతాలు జరిగాయి. యూపీలో టెట్, నీట్ యూజీ (2021), ఇంటర్ సహా 9 ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిలో పరాకాష్ఠ.. ఈ ఏడాది 48 లక్షల మంది అభ్యర్థులు హాజరైన కానిస్టేబుల్ నియామక పరీక్ష పేపర్ లీకేజీ. కాగా, కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లోనూ పేపర్ లీకేజీ ఆరోపణలు వచ్చాయి.

పదేళ్ల జైలు.. కోటి జరిమానా

పేపర్ లీకేజీ కారకులపై చర్యలు తీసుకునేందుకు కఠినమైన "ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం-2024"ను కేంద్రం అమల్లోకి తెచ్చింది. గత ఫిబ్రవరిలోనే ఈ చట్టాన్ని రూపొందించినా.. ఎన్నికల నేపథ్యంలో ప్రకటించలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్'ను శుక్రవారం (జూన్ 21) నుంచే అమల్లోకి తెస్తూ కేంద్రం గెజిట్ ఇచ్చింది. దీన్నిప్రకారం.. వ్యక్తులు కానీ, పరీక్షల నిర్వహణ సంస్థ కానీ వ్యవస్థీకృత నేరానికి పాల్పడితే ఐదేళ్ల జైలు (పదేళ్ల వరకు పొడిగించొచ్చు), కనీసం రూ.కోటి జరిమానా విధిస్తారు. అక్రమాలకు పాల్పడుతూ దొరికినవారికి కనీసం మూడేళ్లు, గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఏదైనా పరీక్ష నిర్వహణ సంస్థ గనుక అవకతవకలు చేస్తే రూ.కోటి దాకా జరిమానా వేసి, పరీక్షల ఖర్చులనూ వారి నుంచే వసూలు చేస్తారు.

కేంద్ర పరిధిలోని పరీక్షలకేనా?

కొత్త చట్టం లీకేజీకి అడ్డుకట్ట వేసేలా లేదనే అభిప్రాయం వినిపిస్తోంది. పారదర్శకంగా పరీక్షల నిర్వహణ ఎలాగనేది ఇందులో లేదని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. రాష్ట్రాల భాగస్వామ్యం పెంచుతూ, కృత్రిమ మేధ వంటి సాంకేతికతను వాడుకుంటూ లీకేజీలను నిరోధించాలని సూచిస్తున్నారు. కాగా, ఈ చట్టాన్ని కేంద్ర సంస్థలు నిర్వహించే పరీక్షలకే పరిమితం చేయడంపైనా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఏడుగురు కలెక్టర్లపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

అధికారిణి. తొలిసారి కలెక్టర్ అయ్యారు. కాగా.. టీడీపీ కూటమి గెలిచిన వెంటనే పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో పాటు గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కూడా చంద్రబాబును కలిసేందుకు ప్రయత్నం చేశారు. కానీ చంద్రబాబు ఆయనతో భేటీకి ఆసక్తి చూపలేదు.

బదిలీలు ఇలా..

ఐఏఎస్ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఎస్.నాగలక్ష్మి	విజయనగరం కలెక్టర్	గుంటూరు
ఎం.వేణుగోపాలరెడ్డి	గుంటూరు	జీఏడీలో రిపోర్ట్
ఎ.మల్లికార్జున్	విశాఖపట్నం	జీఏడీలో రిపోర్ట్
ఎం.విజయసునీత	అల్లూరి జిల్లా	జీఏడీలో రిపోర్ట్
జె.నివాస్	కాకినాడ	జీఏడీలో రిపోర్ట్
వి.ప్రసన్న వెంకటేశ్	ఏలూరు	జీఏడీలో రిపోర్ట్
కె.మాధవీ లత	తూర్పుగోదావరి	జీఏడీలో రిపోర్ట్
ఎస్.ఢిల్లీరావు	ఎన్టీఆర్ జిల్లా	జీఏడీలో రిపోర్ట్
ఎస్.షన్మోహన్	చిత్తూరు	కాకినాడ
ఎ.ఎస్.దినేశ్‌కుమార్	ప్రకాశం	అల్లూరి జిల్లా
సుమిత్ కుమార్	పశ్చిమగోదావరి	చిత్తూరు
గుమ్మాల సృజన	కర్నూలు	ఎన్టీఆర్ జిల్లా
పి.రంజిత్ బాషా	బాపట్ల	కర్నూలు
కె.వెట్రిసెల్వి	మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్	ఏలూరు కలెక్టర్
పి.ప్రశాంతి	అగ్రికల్చర్ డైరెక్టర్	తూర్పుగోదావరి కలెక్టర్
డా.బీఆర్ అంబేడ్కర్	మిడ్‌డే మీల్స్ డైరెక్టర్	విజయనగరం కలెక్టర్
సి.నాగరాణి	సాంకేతిక విద్య డైరెక్టర్	పశ్చిమగోదావరి కలెక్టర్
ఎ.తమీమ్ అన్సారియా	శ్రీకాకుళం కమిషనర్	ప్రకాశం కలెక్టర్

రాష్ట్రానికి సీనియర్ ఐఏఎస్ పీయూష్‌కుమార్

అమరావతి, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఏపీ కేడర్ సీనియర్ ఐఏఎస్ అధికారి పీయూష్‌కుమార్ రాష్ట్రానికి వస్తున్నారు. ఆయన్ను ఏపీకి పంపించాలన్న రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తిని కేంద్రం ఆమోదించింది. ప్రస్తుతం ఆయన కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య విభాగంలోని అదనపు కార్యదర్శిగా ఉన్నారు. ఆయనకు రాష్ట్రానికి తిరిగి పంపించేందుకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ శనివారం ఉదయం ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించేందుకు సిద్ధమైంది. గత ప్రభుత్వంలో ఆర్థిక శాఖను అతలాకుతలం చేసేశారు. దానిని సంస్కరించి గాడిలో పెట్టే పనిలో భాగంగా ఆర్థిక శాఖ బాధ్యతలు మొత్తం ఆయనకే అప్పగించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

వడదెబ్బ మృతులపై తలో లెక్క

న్యూఢిల్లీ, జూన్ 22: వేసవిలో వడదెబ్బ కారణంగా ఎంతమంది చనిపోయారనే విషయంలో వేర్వేరు లెక్కలు వెలుగులోకి వస్తున్నాయి. దేశవ్యాప్తంగా 143 మంది మరణించారని కేంద్ర ఆరోగ్య శాఖ ఇటీవల వెల్లడించింది. రాష్ట్రాల వారీగా తెప్పించుకున్న డేటా ప్రకారం ఈ మేరకు నిర్ధారించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం వడదెబ్బ కారణంగా 209 మంది మరణించారని ఓ జాతీయ పత్రిక వెల్లడించింది. అంతేగాక మరో 239 మంది కూడా వడదెబ్బతో మరణించి ఉండవచ్చని పేర్కొంది.

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ చేసిన
ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ కన్నుమూత



అయోధ్య, జూన్ 22: అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠలో ప్రధాన పూజారిగా వ్యవహరించిన ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ శనివారం తుదిశ్వాస విడిచారు. 86 ఏళ్ల లక్ష్మీకాంత్ దీక్షిత్ కొన్ని రోజులుగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారని ఈ క్రమంలోనే శనివారం ఉదయం కన్నుమూశారని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన అంత్యక్రియలను వారాణసిలోని మణికర్ణిక ఘాట్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జనవరి 22న అయోధ్యలో జరిగిన బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు లక్ష్మీకాంత్ దీక్షిత్ ప్రధాన అర్చకుడిగా వ్యవహరించారు. లక్ష్మీకాంత్ దీక్షితులు మృతిపై ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "కాశీలోని పండితుల్లో లక్ష్మీకాంత్ దీక్షిత్ గొప్పవారు. ఆయన మృతి ఆధ్యాత్మిక, సాహితీ ప్రపంచానికి తీరని లోటు" అని యోగి ఆదిత్యనాథ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

అభిమానపాత్రుడు అయ్యన్న

- శాసన సభలో రోల్ మోడల్
- ఆయనది సుదీర్ఘ అనుభవం
- సభాపతికి మంత్రుల అభినందన
- అసెంబ్లీ నిరవధిక వాయిదా



అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడిని మంత్రులు, ఎమ్మెల్యేలు అభినందనలతో ముంచెత్తారు. ఆయన సుదీర్ఘ అనుభవం సభకు హుందాతనం తీసుకువస్తుందని కొనియాడారు. అందరికీ అభిమాన పాత్రుడని మంత్రి నారా లోకేశ్ అన్నారు. గత ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధించినా ఆయన భయపడలేదన్నారు. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. స్పీకర్ అయ్యన్న నాయకత్వంలో సభలో చర్చలు దేశానికి ఒక రోల్‌మోడల్‌గా నిలుస్తాయన్నారు. బీసీ నాయకుడు స్పీకర్ కావడం బీసీలందరికీ గర్వంగా ఉందన్నారు. ప్రజాసేవలో సుదీర్ఘకాలం పనిచేసిన అయ్యన్న పాత్రుడును స్పీకర్‌గా ఎంపిక చేయడం, దాన్ని ప్రతిపాదించడంలో తన పాత్ర ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని బీజేపీ నేత, మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. తాము తాతాజీ అని పిలుచుకునే అయ్యన్నపాత్రుడు స్పీకర్ కావడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మరో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. అయ్యన్నతో సాహచర్యాన్ని గుర్తు తెచ్చుకున్నారు. ఎమ్మెల్యే కళా వెంకట్రావ్ మాట్లాడుతూ అయ్యన్న నిక్కచ్చిగా నిజాయితీగా రాజకీయాలు చేశారని తెలిపారు. మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రఘురామకృష్ణరాజు, జీవీ ఆంజనేయులు, నక్కా ఆనంద్‌బాబు తదితరులు అభినందించారు. శుక్రవారం సభకు హాజరు కాని ముగ్గురు సభ్యులు శనివారం ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు. జీవీ ఆంజనేయులు, పితాని సత్యనారాయణ, వనమాడి వెంకటేశ్వరరావుతో ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి ప్రమాణం చేయించారు. మధ్యాహ్నం 1.35 గంటల వరకు సభ్యుల ప్రసంగాలు సాగాయి. అనంతరం, సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.

అసెంబ్లీకి వచ్చి.. సభకు రాకుండా!

ప్రతిపక్ష నేత, ఎమ్మెల్యే జగన్‌తో సహా వైసీపీకి చెందిన 11 మంది సభ్యులు శుక్రవారం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేసినప్పటికీ శనివారం డుమ్మా కొట్టారు. అరకు, పాడేరు ఎమ్మెల్యేలు వచ్చినా వైసీపీ కార్యాలయం వద్దే కూర్చున్నారు. అనంతరం సభలోకి రాకుండానే వెళ్లిపోయారు. పార్టీ నుంచి స్పష్టమైన సమాచారం లేనందునే వారు అసెంబ్లీకి వచ్చినట్టు తెలిసింది.

శ్రీవారి లడ్డూ ధరల్లో మార్పు లేదు: టీటీడీ

తిరుమల, జూన్22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, లడ్డూప్రసాదం ధరల్లో ఎలాంటి మార్పు లేదని టీటీడీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. 'తిరుమలలో గతంలో రూ.300గా ఉన్న స్పెషల్ దర్శనాన్ని రూ.200కు, రూ.50 లడ్డూలను రూ.25కు తగ్గించారు' అంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని టీటీడీ స్పష్టం చేసింది. అలాగే శ్రీవారి దర్శనానికి సంబంధించి అధిక ధరలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు పొందవచ్చని కొంతమంది ఫోన్ నంబర్లతో సర్క్యులేట్ అవుతున్న సమాచారంపై కూడా టీటీడీ స్పందించింది. 'వాస్తవానికి శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సంబంధించి టీటీడీ వెబ్‌సైట్ ద్వారానే కాకుండా వివిధ రాష్ట్రాలకు సంబంధించిన టూరిజం విభాగాలకు కొన్ని టికెట్లు కేటాయిస్తోంది. టూరిజం ద్వారా రావాలనుకొనే భక్తులు దళారీల ద్వారా కాకుండా, నేరుగా రాష్ట్ర టూరిజం వెబ్‌సైట్ ద్వారా కూడా దర్శనం ప్యాకేజీ పొందే అవకాశం ఉంది. అయితే కొంతమంది దళారీలు టూరిజం వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసి ఇస్తామని పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. అలా భక్తులను మోసగిస్తున్న దళారులపై టీటీడీ విజిలెన్స్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుంది. దళారీల మాట నమ్మి మోసపోవద్దని భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నాం' అని టీటీడీ వివరించింది.

కోచ్‌లో సాంకేతిక లోపం...
వందేభారత్ రైలు 4 గంటలు ఆలస్యం

విశాఖపట్నం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833) శనివారం నాలుగు గంట లు ఆలస్యంగా బయలుదేరింది. ఈ రైలు రోజూ ఉదయం 5.45 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరాలి. అయితే ప్లాట్‌ఫారం పైకి తీసుకువచ్చాక సీ-9 కోచ్‌లో సాంకేతిక లోపం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దానిని సరిచేసి పంపించేసరికి ఉదయం పది గంటలైంది. ఇటీవల కాలంలో వందే భారత్ రైలులో తరచూ సమస్యలు వస్తుండడం గమనార్హం.

జగ్గయ్యపేటలో డయేరియా కలకలం
మూడురోజుల్లో ఆరుగురు మృతి

జగ్గయ్యపేట, జూన్ 22 : ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, పరిసర గ్రామాల్లో డయేరియా కలకలం రేపుతోంది. మూడురోజులలో ఈ లక్షణాలతో ఆరుగురు మృతిచెందారు. జగ్గయ్యపేట పట్టణానికి చెందిన శివన్నారాయణ (38), చిల్లకల్లుకు చెందిన టి.వెంకటేశ్వరరావు (75) వాంతులు, విరేచనాలతో గురువారం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. కాగా, జగ్గయ్యపేట సామాజిక ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం శుక్రవారం విజయవాడ జీజీహెచ్‌కు తరలించిన వారిలో నలుగురు మృతి చెందారు. జగ్గయ్యపేట పట్టణం డాంగేనగర్‌కు చెందిన ఉమ్మినేని రంగయ్య(65), జగ్గయ్యపేట మండలం వేదాద్రికి చెందిన పసుమర్తి సత్యవతి (70), గండ్రాయి గ్రామానికి చెందిన తురకా మంగతాయారమ్మ (50), బూదవాడ గ్రామానికి చెందిన గుగ్లోత్ జమ్మ (70) మృతిచెందిన వారిలో ఉన్నారు. వీరంతా రెండు రోజులుగా వాంతులు, విరేచనాలు కావటంతో చికిత్స నిమిత్తం జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్యకేంద్రానికి రాగా, వారిని శుక్రవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. జగ్గయ్యపేటలో పరిస్థితి విషమిస్తుండటంతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు హెల్త్ డైరెక్టర్ పద్మావతి, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, జిల్లా ఆసుపత్రి సేవల కోఆర్డినేటర్ బీసీకే నాయక్ పలువురు జిల్లా అధికారులు జగ్గయ్యపేట పరిసర గ్రామాల్లో సందర్శించారు.

నాన్నే చంపేశాడు!

భయమేస్తోంది నాన్నా.. బావిలో దూకను!.. అరగంట ఏడ్చిన చిన్నారి

- బావిలోకి ఎత్తి పడేసి హత్య చేసిన తండ్రి
- తనకు పుట్టలేదన్న అనుమానంతో దారుణం
- బడి మధ్యలో తీసుకెళ్లి మరీ ఘాతుకం
- ఆపై ఎవరో కిడ్నాప్ చేశారంటూ డ్రామా
- అనంతపురం జిల్లా నార్పలలో ఘటన



తండ్రి గణేష్‌తో పావని (ఫైల్)



పావనిని పడేసిన పాడుబడిన బావి ఇదే..



గుండెలవిసేలా రోదిస్తున్న పావని తల్లి అమల

నార్పల, జూన్ 22: బడిలో చదువుకుంటున్న ఆరేళ్ల కూతురి వద్దకు ఆ తండ్రి వెళ్లాడు. 'ఇంటికి వెళదాం రామ్మా..' అని పిలిచాడు. సాయంత్రం రావాల్సిన నాన్న మధ్యాహ్నమే వచ్చి ఇంటికి తీసుకెళతానంటే ఆ చిన్నారి ఎగిరి గంతేసింది. బడి సంచి చేతబట్టుకుని నాన్న ఆటోలో కూర్చుంది. కానీ ఆటో ఇంటి వైపు కాకుండా.. పొలాల వైపు వెళ్లింది. నిర్జన ప్రదేశంలోని ఓ పాడుబడిన నేల బావి వద్ద ఆగింది. 'ఇక్కడికి ఎందుకు నాన్నా..?' అని అడిగితే.. 'ఈత నేర్పిస్తా నమ్మా.. బావిలో దూకు..' అన్నాడు. 'వద్దు నాన్నా.. భయమేస్తోంది..' అని ఆ పాప మొరాయించింది. ఎంత చెప్పినా నాన్న వినలేదు. దాదాపు అరగంట పాటు ఏడుస్తూ.. భయపడుతూ అక్కడే కూర్చుంది. కానీ అనుమానపు పొరలు, మద్యం మత్తు కమ్ముకున్న అతడి కళ్లకు కన్నకూతురి భయం కనిపించలేదు. ఆ పాపపై కనీస జాలి చూపలేదు. పాపను ఎత్తి బావిలో పడేశాడు. ఆ తరువాత ఏమీ ఎరుగనట్లు ఇంటికి వెళ్లాడు. తన కూతురిని ఎవరో కిడ్నాప్ చేశారని డ్రామా మొదలు పెట్టాడు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానం వచ్చి తమదైన శైలిలో విచారిస్తే.. తానే బావిలో తోసేశానని అంగీకరించాడు. ఈ అమానవీయ ఘటన అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలో చోటు చేసుకుంది.

తనకు పుట్టలేదని అనుమానం

నార్పల కొత్త బస్టాండ్ కాలనీకి చెందిన గణేష్‌కు ఎనిమిదేళ్ల క్రితం అమల అనే మహిళలో వివాహం జరిగింది. వీరికి కూతురు పావని(6), ఓ కుమారుడు ఉన్నారు. రెండేళ్ల నుంచి గణేష్ భార్యపై అనుమానం పెంచుకున్నాడు. వ్యసనాలకు బానిసై.. దొంగతనాలు చేసేవాడు. భారీగా అప్పులు చేశాడు. డబ్బుల కోసం భార్యను వేధించేవాడు. ఆమెకు వివాహేతర సంబంధం ఉందని, పావని తనకు పుట్టలేదని అనుమానించేవాడు. అందుకే కూతుర్ని చంపేయాలని అనుకున్నాడు. మసీదు కట్ట సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పావని ఒకటో తరగతి చదువుతోంది. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం మద్యం సేవించి, బడి వద్దకు వెళ్లి పావనిని తన ఆటోలో ఎక్కించుకుని పొలాల వైపు తీసుకెళ్లి బావిలో పడేశాడు. అదే రోజు సాయంత్రం తన కూతురు కనిపించడం లేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు గణేష్‌పైనే అనుమానపడ్డారు. అదుపులోకి తీసుకుని విచారించగా జరిగిన ఘోరాన్ని బయటపెట్టాడు. సీఐ భాస్కర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో వెళ్లి బావిలో ఉన్న చిన్నారి పావని మృతదేహాన్ని శనివారం బయటకు తీయించారు. నార్పల మండల ప్రజలు పెద్ద ఎత్తున బావి వద్దకుచేరుకున్నారు. గణేష్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్న కూతురిని దారుణంగా చంపేసిన హంతకుడిని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. శిక్ష పడేలా చేస్తామని పోలీసులు నచ్చజెప్పడంతో శాంతించారు. తల్లి అమల, ఇతర కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పావని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేరమయ జీవితం..

నార్పలలో ఆటో తోలుకుంటూ జీవిస్తున్నట్లు కనిపిస్తున్న గణేష్ జీవితమంతా నేరమయమే. ఏటీఎంల వద్ద నిలబడి అమాయకులను మోసగించేవాడు. డబ్బులు డ్రా చేయడం రానివారికి సాయం చేస్తున్నట్లు నటించి, వారి డబ్బులను కాజేసేవాడు. సుమా రు వందకు పైగా దొంగతనాలు చేసి ఉంటాడని స్థానికులు అంటున్నారు. కానీ నార్పల పోలీస్ స్టేషన్‌లో ఇతనిపై కేవలం ఒక్క దొంగతనం కేసు మాత్రమే నమోదైంది.

భారతి పీఏ దందా!

రూ.5 కోట్ల భూమి కాజేసేందుకు కుట్ర

- ఉత్తుత్తి రిజిస్ట్రేషన్‌తో పాస్‌బుక్‌కు యత్నం
- కోర్టు తీర్పు రీత్యా సహకరించని అధికారులు
- నాటి కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డిపైనా ఒత్తిడి
- నో చెప్పడంతో ఆయనపై అసభ్యకర పోస్టులు
- ఎత్తుగడ పారకపోవడంతో రిజిస్ట్రేషన్ రద్దు
- వర్రా రవీంద్రారెడ్డి బాగోతం ఆలస్యంగా బయటకు

కదిరి, జూన్ 22: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతి పీఏ వర్రా రవీంద్రారెడ్డి అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తన మిత్రుడితో కలిసి రూ.5 కోట్ల విలువైన భూమిని అప్పనంగా కాజేసేందుకు విఫలయత్నం చేశారు. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీసత్యసాయి జిల్లా కదిరి రెవెన్యూ డివిజన్‌లోని నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామ పరిధిలో ఉన్న పొలాన్ని డబుల్ రిజిస్ట్రేషన్ చేయించి కాజేయాలని చూశారు. కానీ ఎత్తుగడ పారకపోవడంతో తమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకున్నారు. అల్లుగుండు గ్రామ సర్వే నంబర్ 183/2లో వెన్నపూస అంజనమ్మ అనే మహిళకు 0.92 ఎకరాల పొలం ఉండేది. దీన్ని 2006 మార్చి 16న ఊటూరి వెంటరమణారెడ్డి అనే వ్యక్తికి ఆమె విక్రయించారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ అయ్యింది. కాగా వెన్నపూస అంజనమ్మ కూతురు కదిరి సులోచన.. తన అమ్మమ్మ గంగులమ్మ ద్వారా దాన విక్రయం కింద 2008 జనవరి 4న రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఊటూరి వెంకటరమణారెడ్డి కోర్టును ఆశ్రయించారు. కోర్టులో 15 సంవత్సరాల పాటు కేసు నడిచింది. ఆ భూమి ఊటూరి వెంకటరమణారెడ్డికి చెందుతుందని కోర్టు తీర్పు చెప్పింది. దీంతో రెవెన్యూ అధికారులు ఆయనకు పాసు పుస్తకాలను కూడా ఇచ్చారు. వ్యవహారం కోర్టు పరిధిలో ఉండగానే ఆ భూమిని కదిరి సులోచన సైదాపురం సొసైటీలో రెండుమార్లు తనఖా పెట్టింది. ఊటూరి వెంకటరమణారెడ్డికి అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో తన బంధువైన వర్రా రవీంద్రారెడ్డి, ఆయన మిత్రుడు వినోద్‌కుమార్‌ను రంగంలోకి దింపింది. వారి పేరిట 2023 మార్చి 4న రిజిస్ట్రేషన్ చేయించింది. ఆ తరువాత తనకు పాస్ పుస్తకం ఇవ్వాలని వర్రా రవీంద్రారెడ్డి నల్లచెరువు రెవెన్యూ అధికారులను కోరారు. కోర్టు తీర్పు గురించి అవగాహన ఉన్న రెవెన్యూ అధికారులు అందుకు ఒప్పుకోలేదు. పాస్ పుస్తకం ఇప్పించాలని అప్పటి కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డిపై ఒత్తిడి తెచ్చారు. అంగీకరించకపోవడంతో బెదిరించారని, సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టినట్లు తెలుస్తోంది. విలువైన భూమిని అప్పనంగా కాజేయాలని వేసిన ఎత్తుగడ ఫలించకపోవడంతో వర్రా రవీంద్రారెడ్డి తన రిజిస్ట్రేషన్‌ను గత ఏడాది ఆగస్టు 7న రద్దు చేసుకున్నారు.





చంద్రబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న వీఐటీ చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్, చంద్రబాబుతో వీఐటీ ఉపాధ్యక్షులు డాక్టర్ జీవీ సెల్వం

చంద్రబాబుతో వీఐటీ అధినేతల భేటీ

చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతో ప్రపంచ ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీల్లో ఒకటైన వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) వ్యవస్థాపకులు, చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్, ఉపాధ్యక్షులు డాక్టర్ జీవీ సెల్వం భేటీ అయ్యారు. ఏపీ సచివాలయంలో చంద్రబాబును కలుసుకుని నాలుగవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆధునిక అమరావతి నగర సృష్టికర్త అయిన చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

ఏటా రామోజీ స్మారక అవార్డులు..

- టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

పంజాగుట్ట, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఉత్తమ పాత్రికేయులకు రామోజీ గ్రూప్ సంస్థ ల వ్యవస్థాపకుడు దివంగత రామోజీరావు పేరిట ఏటా స్మారక అవార్డులను ప్రదానం చేయనున్నట్లు టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నిఖిల కలిశెట్టి విద్య, వైద్య, చారిటబుల్ ట్రస్టు తరఫున ఈ అవార్డులను అందజేస్తామన్నారు. త్వరలోనే సీనియర్ పాత్రికేయులతో కమిటీ ఏర్పాటు చేసి, ఆంగ్ల, హిందీ భాషలతో పాటు దేశవ్యాప్తంగా ప్రాంతీయ భాషల్లో పనిచేస్తున్న ఉత్తమ పాత్రికేయులను గుర్తించి అవార్డులను అందజేస్తామని తెలిపారు. ఒక్కో ఏడాది ఒక్కో రాష్ట్రంలో ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. రామోజీ స్మారక అవార్డుకు ఎంపికైన వారికి రూ.20 వేల నగదుతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందజేస్తామన్నారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా బీజేపీ నేత సిరిపురపు తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

కత్తి మీద సామే!

ఇల్లు అలకగానే పండగ వచ్చినట్లు కాదని అంటారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ప్రజాస్వామ్యంలో పాలకులు ఎలా ఉండకూడదో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అండ్ కో రుజువు చేసినందున తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారు బాధ్యతతో మెలగాలి. జగన్‌కు వ్యతిరేకంగా ప్రజలు కసిగా తీర్పు ఇచ్చినందున ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రుల వ్యవహార శైలిని ప్రజలు నిశితంగా గమనిస్తుంటారు. అధికారం బాధ్యత మాత్రమే అని తెలుసుకుంటే మంచిది. తమకు 11 సీట్లు మాత్రమే ఎందుకు వచ్చాయో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి అధికారంలో ఉన్నప్పుడు ఉన్మాదంగా వ్యవహరించిన జగన్ అండ్ కో సిద్ధపడడం లేదు. కనుక వారి విషయం ప్రజలే తేల్చుకుంటారు. శాసనసభలో దారుణంగా అవమానంపాలైన చంద్రబాబు.. శాసనసభను బహిష్కరించి ముఖ్యమంత్రిగానే మళ్లీ సభలో అడుగుపెడతానన్న తన శపథాన్ని నెరవేర్చుకున్నారు. నాటి

> ప్రస్తుతానికి చంద్రబాబు హుందాగానే వ్యవహరిస్తున్నారు. నాడు నిండు సభలో నన్ను అవమానించారు కనుక ఇప్పుడు నేను నిన్ను అవమానిస్తానని చంద్రబాబు భావిస్తే ఆయనకు, జగన్మోహన్‌రెడ్డికీ తేడా ఏముంటుంది? ప్రభుత్వ యంత్రాంగంలో లోపించిన జవాబుదారీతనాన్ని తిరిగి తీసుకురావాలి. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలులో ఉందన్న భావన ప్రజలలో కల్పించాలి. రాజధాని అమరావతిని రెండు మూడేళ్లలో కట్టేస్తామని గొప్పలు చెప్పుకోవడం తగదు. చేయాలనుకున్నది చేసి చూపించండి. వాటి ఫలితాలు ప్రజలకు అందితే ఆటోమేటిక్‌గా ప్రజల మద్దతు లభిస్తుంది. రాష్ట్ర ఖజానాపై ఆర్థిక భారం మోపే పథకాల వల్ల ప్రయోజనం ఉండదు. ప్రభుత్వంపై ప్రజాభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఈ దిశగానే చంద్రబాబు పాలన సాగుతుందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అందుకు సహకరిస్తారని ఆశిద్దాం.

ఆయన దర్పాగ్రహాన్ని ప్రజలు అర్థం చేసుకుని దీవించారు. 1989 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత నన్నపనేని రాజకుమారి తనను మాటలతో కించపరిచారన్న కారణంగా ఎన్టీరామారావు కూడా అప్పట్లో శాసనసభను బహిష్కరించారు. ఆ తర్వాత 1994లో భారీ మెజారిటీతో మళ్లీ అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్.. ముఖ్యమంత్రిగానే సభలో అడుగిడారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా లభించలేదు. ఇప్పుడు మళ్లీ ఇంతకాలానికి జగన్‌రెడ్డికి కూడా ప్రతిపక్ష నాయకుడి హోదా లభించలేదు. అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విర్రవీగకుండా శాసనసభ్యుల ప్రమాణస్వీకారం సందర్భంగా జగన్మోహన్‌రెడ్డికి సముచిత గౌరవం కల్పించారు. కానీ జగన్ రోత మీడియా మాత్రం ఆయనను అవమానించారంటూ వార్తలు వండి వార్చి తన బుద్ధి పోనిచ్చుకోలేదు. తనకు తగిన గౌరవం ఇచ్చినా జగన్ మాత్రం హుందాగా వ్యవహరించలేకపోయారు. శాసనసభ సభ్యుడిగా ప్రమాణం చేసిన వెంటనే సభలో కూర్చోకుండా వెళ్లిపోయారు. ఎన్నికల్లో తన ఓటమిని ఊహించని జగన్మోహన్‌రెడ్డి, ఇప్పటికీ ఆ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు. మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని ఆయన తన మనుషులకు చెప్పుకొంటూ మానసిక ఆనందం పొందుతున్నారు. 2019 ఎన్నికల్లో 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన జగన్.. 2024 ఎన్నికల్లో 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన కూటమిని ఓడించడం రాజకీయంగా అసాధ్యం కాదు గానీ తన ఈ ఘోర పరాభవానికి కారణం ఏమిటో ఆయన తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడమే ఆశ్చర్యంగా ఉంది.

జగన్ విపరీత మనస్తత్వం!

రాజకీయాలలో ఆత్మవిమర్శ చేసుకుని ముందుకుసాగినవాడే కింద పడినా పైకి లేవగలడు. జగన్మోహన్‌రెడ్డిది విపరీత మనస్తత్వం అని గతంలో అనేక పర్యాయాలు చెప్పుకొన్నాం. ఆయనలో సాధారణ లక్షణాలు ఉండివుంటే తన నివాసం కోసం రుషికొండపై 550 కోట్లు ప్రజాధనం ఖర్చు చేసి మాయామహల్ నిర్మించుకొని ఉండేవారు కాదు. ఆ భవనాన్ని సొంత డబ్బుతో నిర్మించుకొని ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు. జనం సొమ్ముతో విలాసంగా బతకడానికి మనం రాచరిక వ్యవస్థలో లేం కదా? తాడేపల్లి ప్యాలెస్ వద్ద నాలుగు వైపులా కాంపౌండ్ వాల్‌పై 30 అడుగుల ఎత్తులో గ్రిల్ నిర్మించుకోవడాన్ని ఎవరైనా ఎలా జీర్ణించుకోగలరు? ఒక ముఖ్యమంత్రి రక్షణకు 30 అడుగుల ఎత్తులో గ్రిల్ నిర్మించుకోవడం విపరీత మనస్తత్వానికి నిదర్శనం కాదా? ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వ్యక్తికి ఇలాంటి ఆలోచనలు ఎందుకొస్తాయో తెలియదు! జగన్ మానసిక పరిస్థితిపై మానసిక వైద్యులు పరిశోధనలు చేయవలసిన అవసరం ఉంది. తాను నివసించినా నివసించకపోయినా ఊరికో ప్యాలెస్ నిర్మించుకోవడం జగన్‌రెడ్డి నైజం. పూర్వం రాజులు మాత్రమే ఇలా వేసవి, శీతాకాల విడిది కోసం ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచిందన్నట్టుగా రుషికొండపై ముచ్చటపడి కట్టించుకున్న ప్యాలెస్‌లోకి అడుగుపెట్టకుండానే జగన్ అధికారం కోల్పోయారు. హైదరాబాద్, బెంగళూరుల్లో సొంత డబ్బుతో ప్యాలెస్‌లు నిర్మించుకున్నందున అప్పుడు ప్రజలు పట్టించుకోలేదు. ప్రజల సొమ్ముతో రుషికొండపై ప్యాలెస్ నిర్మించినందునే ఆయన బాధ్యత తీసుకోవాలి. తాడేపల్లిలో 30 అడుగుల ఎత్తులో గ్రిల్‌ను నిర్మించుకున్నారంటే ఆయన ఏదో ఒక మానసిక సమస్యతో బాధపడుతున్నారని భావించాల్సి ఉంటుందని అంటున్నారు. కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వెచ్చించి అంతెత్తున గ్రిల్ నిర్మించడానికి అధికారులు ఏ నిబంధన కింద అనుమతించారో తెలియదు. మిలటరీ పాలకులు కూడా ఇలాంటి శత్రు దుర్భేద్యాలను నిర్మించుకోరు. కొంత మందిలో విపరీత పోకడలు ఉంటాయి. బంగారంపై మోజుతో కొంత మంది పది నుంచి పదిహేను కిలోల బంగారు నగలను ఒంటిపై వేసుకొని తిరగడం చూశాం. అది ప్రైవేటు వ్యవహారం కనుక మనం వారి గురించి కాసేపు మాట్లాడుకొని మరచిపోతాం. జగన్మోహన్‌రెడ్డికి బంగారంపై మోజు లేదు. తనతో పాటు తన భార్య కూడా ఆడంబరంగా కనపడకూడదని కోరుకునేవారు. అయితే రాచరిక నియంతృత్వ పోకడలను మాత్రం అణచుకోలేకపోయారు. ఫలితంగా ప్రజల తిరస్కారానికి గురయ్యారు.

వ్యవస్థ సర్వభ్రష్టత్వం!

రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవో అధికారులు నోరు విప్పి చెప్పడం మొదలుపెట్టారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అయివుండి కూడా ఇంతగా ఎందుకు దిగజారిపోయారని ప్రశ్నించగా, "జగన్ పాలనలో ఒక రకమైన భయానక వాతావరణం ఉండింది. మనసులో మాట చెప్పుకోవడానికి కూడా సాహసించలేకపోయాం. భయం గుప్పిట్లో బతికాం. అందుకే మనసు చంపుకొని పనిచేశాం" అని కొంత మంది అధికారులు చెబుతున్నారు. మొత్తమ్మీద జగన్మోహన్‌రెడ్డితో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి విపరీత మనస్తత్వాల వల్ల అధికార యంత్రాంగం కుళ్లిపోయింది. తెలంగాణలో కూడా అధికార వ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. ప్రగతిభవన్ పేరిట ప్యాలెస్‌ను పోలిన భవనాన్ని నిర్మింపజేసి అందులో నుంచి కాలు బయటపెట్టకుండా కనుసైగలతో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. ఇది జరిగిన తర్వాత కూడా జగన్ అండ్ కో జాగ్రత్తపడలేదు. అధికారులు కూడా తమ ధోరణి మార్చుకోలేదు. బటన్లు నొక్కుతున్నందున జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారని నమ్మి అడ్డగోలు పనులు చేశారు. ఈ నేపథ్యంలో కుళ్లిపోయిన అధికార యంత్రాంగంతోనే పని చేయించుకోవల్సి రావడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కత్తి మీద సాము వంటిదే. ఏ అధికారి ఎంతగా చెడిపోయిందీ తెలుసుకోవడానికి స్కానర్లు లేవు కదా! అందుకే అధికారుల ఎంపికలో కొన్ని తప్పులు జరిగాయి. అయితే చంద్రబాబుకు



> జగన్మోహన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో కూడా 40 శాతం వరకు ఓట్లు వచ్చాయని, ఆ విషయం మరచిపోకూడదనీ కొంత మంది అపర మేధావులు చెబుతున్నారు. నిజమే, గత ఎన్నికల్లో కూడా 23 సీట్లు మాత్రమే వచ్చిన చంద్రబాబుకు కూడా 40 శాతం ఓట్లు వచ్చాయి. ఇప్పుడున్న సమాజంలో కళ్లెదురుగా హత్యలు చేసిన, చేయించిన వారికి కూడా కుల, మత ప్రాతిపదికన ఎన్నో కొన్ని ఓట్లు వేసేవారు ఉన్నారు. అలాగని జగన్‌రెడ్డిని తీసిపారేయడం కూడా సరికాదు. చంద్రబాబు ప్రభుత్వం మునుముందు ఎలా వ్యవహరించబోతున్నది అన్నదాన్ని బట్టి జగన్ రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వ వ్యతిరేకత ఆధారంగానే ఇటీవలి కాలంలో ప్రజలు తీర్పు ఇస్తున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చిన తీర్పు జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఇచ్చింది మాత్రమే. తెలుగుదేశం–జనసేన–బీజేపీ మధ్య పొత్తు కుదిరినందున మెజారిటీలు పెరిగాయి. గత ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు తగు విధంగా అడుగులు వేస్తారని ఆశిద్దాం.

ఆప్షన్లు తక్కువ. గతంలో సమర్థులుగా పేరు తెచ్చుకున్న అధికారులు కూడా ఈ ఐదేళ్లలో చెడిపోయారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు, చేసిన ఎంపికలపై తెలుగు తమ్ముళ్లు నిరసన వ్యక్తంచేస్తున్నారు. జగన్మోహన్‌రెడ్డి సృష్టించిన సంప్రదాయం ఆమోదయోగ్యం కాకపోయినా చంద్రబాబు కూడా అలాగే వ్యవహరించాలని తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నారు. జగన్ తరహాలోనే పాలించే పక్షంలో ప్రభుత్వం మారడం ఎందుకు? జగన్‌ను జనం కసిగా ఎందుకు ఓడించారో తెలుసుకోవడానికి కూడా తెలుగు తమ్ముళ్లు అంగీకరించడం లేదు. రాజకీయాల్లో ఈ ఐదేళ్లు ప్రత్యేక అధ్యాయం అని చెప్పవచ్చు. గ్రామ స్థాయి కార్యకర్త నుంచి చంద్రబాబు వరకు అందరూ ప్రభుత్వ వేధింపులకు గురయ్యారు. అయితే కొంత మంది నాయకుల వలె తలవొంచి రాజీ పడకుండా జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ప్రతి కార్యకర్తా తాజా విజయంలో తమ వాటా ఉందని భావిస్తున్నారు. తమకు ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పగ తీర్చుకోవాలని రగిలిపోతున్నారు. దీనికితోడు గుడివాడలో ఇంతవరకు ఓటమి తెలియని కొడాలి నాని వంటి వారు ఇప్పుడు ఘోర పరాజయం పాలయ్యాక కూడా గుణపాఠం నేర్చుకోకుండా నోటికి పని చెబుతున్నారు. దీంతో తెలుగు తమ్ముళ్లు చంద్రబాబును టార్గెట్‌గా చేసుకొని సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నారు. లోకేశ్ చెబుతూ వచ్చిన రెడ్‌బుక్‌ను మడచి పెట్టుకొమ్మని పరుషంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. జగన్‌రెడ్డి వలె కక్షపూరిత పాలన చేయాలనుకోవడం సమర్థనీయం కాదు. అదే జరిగితే రాష్ట్రం మొత్తం ఫ్యాక్షన్ జోన్‌గా మారిపోతుంది. అదే సమయంలో మితిమీరిన ఉదారత్వం కూడా ప్రదర్శించకూడదు. తప్పు చేసిన అధికారులను, నాయకులను చట్టప్రకారం శిక్షించడానికి చర్యలు తీసుకోవలసిందే. కంటికి కన్నూ పంటికి పన్నూ ప్రజాస్వామ్యంలో చెల్లదు.

> జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చివేయించిన ప్రజావేదికను అలాగే ఉంచాలి. అప్పుడే విధ్వంసకర పాలనను ప్రజలు ఆమోదించరని భావితరాల నాయకులకు హెచ్చరికగా ఉంటుంది.

..అలా చేస్తే తేడా ఏముంది?

వివేకానంద రెడ్డిని హత్య చేయించిన వారిని ముఖ్యమంత్రిగా జగన్ రక్షించారని ప్రజలు నమ్మారు. అందుకే ఆయన సొంత జిల్లా కడపలో కూడా మూడే స్థానాలు వచ్చాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వారు కూడా చావు తప్పి కన్ను లొట్టబోయిన చందంగా ఆరేడు వేల స్వల్ప మెజారిటీతో గెలిచారు. కూటమి నేతలు అభ్యర్థుల ఎంపికతో పాటు మరికొన్ని జాగ్రత్తలు తీసుకొని ఉంటే జగన్మోహన్‌రెడ్డికి పదకొండు అసెంబ్లీ సీట్లు, నాలుగు లోక్‌సభ సీట్లు కూడా వచ్చివుండేవి కావు. అసెంబ్లీలో ఐదారు సీట్లే వచ్చి వుండేవి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం లేకపోవడం శ్రేయస్కరం కాదు. అయితే జగన్ అండ్ కో పోకడల కారణంగానే ప్రజలు ఇటువంటి తీర్పు ఇచ్చారు. ఇంత జరిగినా జగన్ అండ్ కో వైఖరిలో కించిత్ మార్పు కూడా రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది. తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌రెడ్డి వాడుతున్న ఫర్నిచర్ విలువ ఎంతో చెబితే డబ్బులు ముఖాన పడేస్తామని కొడాలి నాని వంటి వారు నోరు పారేసుకోవడం ఏమిటి? ఇవ్వడానికి మీరెవరు? తీసుకోవడానికి చంద్రబాబు ఎవరు? అది ప్రభుత్వ ఆస్తి. గతంలో ఓడిపోయిన మంత్రులు తమ ఇళ్లలోని ఫర్నిచర్‌ను ప్రభుత్వానికి అప్పగించేవారు. ప్రభుత్వ వాహనాలను ఇంట్లో పిల్లలు స్కూలుకు వెళ్లడానికి లేదా సొంత అవసరాలకు వాడుకోవడాన్ని నైతికంగా నేరంగా ఒకప్పుడు పరిగణించేవారు. ఇప్పుడు ఇంత సున్నితంగా ఆలోచించేవారు ఎక్కడ? కొడాలి నాని వంటి వారు గతంలో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ రావును ఇదే ఫర్నిచర్ పేరిట వేధించినప్పుడు నోరు ఎందుకు విప్పలేదు? అప్పుడు ఆయన కూడా ఫర్నిచర్ విలువ చెల్లిస్తానని చెప్పినా కూడా వినకుండా వేధించారు. విలువ కట్టడం ఎందుకు? వాడుకున్న ఫర్నిచర్‌ను స్వాధీనం చేయవచ్చు కదా? ప్రస్తుతానికి చంద్రబాబు హుందాగానే వ్యవహరిస్తున్నారు. నాడు నిండు సభలో నన్ను అవమానించారు కనుక ఇప్పుడు నేను నిన్ను అవమానిస్తానని చంద్రబాబు భావిస్తే ఆయనకు, జగన్మోహన్‌రెడ్డికీ తేడా ఏముంటుంది? శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన జగన్ సభా కార్యక్రమాల్లో పాల్గొనకుండా పులివెందుల వెళ్లిపోయారు. సభకు హాజరయ్యే విషయంలో ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియదు. గత శాసనసభలో స్పీకర్ తమ్మినేని సీతారాం కూడా ప్రతిపక్షంపై తరచుగా నోరు పారేసుకున్నారు. ఇప్పుడు స్పీకర్‌గా ఎన్నికైన చింతకాయల అయ్యన్నపాత్రుడికి కూడా నోటి దురుసు ఎక్కువే. సభాపతిగా ఆయన ఎలా వ్యవహరిస్తారో చూడాలి. సభను ఆయన అదుపు చేస్తారో? ఆయనను సభ అదుపు చేస్తుందో? చూడాలి. జగన్ అండ్ కో పోకడలతో పాటు వారి నోళ్లకు అదుపు లేకపోవడం వల్లనే ఈ ఘోర పరాజయం వారికి ఎదురైంది. మేం శాశ్వతంగా అధికారంలో ఉంటాం— చంద్రబాబు పనైపోయిందని భావించి విర్రవీగారు. ఇప్పుడు అవమాన భారాన్ని తట్టుకోలేకపోతున్నారు. జగన్మోహన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో కూడా 40 శాతం వరకు ఓట్లు వచ్చాయని, ఆ విషయం మరచిపోకూడదనీ కొంత మంది అపర మేధావులు చెబుతున్నారు. నిజమే, గత ఎన్నికల్లో కూడా 23 సీట్లు మాత్రమే వచ్చిన చంద్రబాబుకు కూడా 40 శాతం ఓట్లు వచ్చాయి. ఇప్పుడున్న సమాజంలో కళ్లెదురుగా హత్యలు చేసిన, చేయించిన వారికి కూడా కుల, మత ప్రాతిపదికన ఎన్నో కొన్ని ఓట్లు వేసేవారు ఉన్నారు. అలాగని జగన్‌రెడ్డిని తీసిపారేయడం కూడా సరికాదు. చంద్రబాబు ప్రభుత్వం మునుముందు ఎలా వ్యవహరించబోతున్నది అన్నదాన్ని బట్టి జగన్ రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వ వ్యతిరేకత ఆధారంగానే ఇటీవలి కాలంలో ప్రజలు తీర్పు ఇస్తున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చిన తీర్పు జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఇచ్చింది మాత్రమే. తెలుగుదేశం–జనసేన–బీజేపీ మధ్య పొత్తు కుదిరినందున మెజారిటీలు పెరిగాయి. గత ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు తగు విధంగా అడుగులు వేస్తారని ఆశిద్దాం. ఈ ఐదేళ్లలో ఆయనకు అనేక మంది అనేక రూపాలలో సహాయ సహకారాలు అందించారు. వారంతా తమకు తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని కోరుకుంటారు. అందులో తప్పు లేదుగానీ ప్రభుత్వాన్ని నడిపించడంలో సారథికి స్వేచ్ఛ ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరినందున కూటమిలోని భాగస్వామ్య పక్షాలు కూడా తమ మాటకు విలువ ఉండాలని, పదవుల పంపకంతో పాటు అధికారంలో వాటా ఉండాలని కోరుకుంటారు. చంద్రబాబుకు ఇదొక విషమ పరీక్ష. అయితే అనేక దక్కామొక్కీలు తిన్న అనుభవం ఉన్నందున, జనసేనాని పవన్ మనసు నొప్పించకుండా చాకచక్యంగా వ్యవహరిస్తారని భావించవచ్చు. తెలుగు తమ్ముళ్లు కూడా తమ నాయకుడు చంద్రబాబును జగన్‌తో పోల్చుకోకూడదు. జగన్ మనస్తత్వం బాబుకు కూడా అలవడి ఉంటే ఇంతకాలంగా ఆయన రాజకీయాల్లో కొనసాగి ఉండేవారు కారు. ప్రస్తుత దేశ రాజకీయాల్లో నాలుగున్నర దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్న నాయకుడు మరొకరు లేరు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చివేయించిన ప్రజావేదికను అలాగే ఉంచాలి. అప్పుడే విధ్వంసకర పాలనను ప్రజలు ఆమోదించరని భావితరాల నాయకులకు హెచ్చరికగా ఉంటుంది. సోషల్ ఇంజనీరింగ్ పేరిట ఎన్నికల్లో కులాలవారీగా సీట్లు కేటాయించినా ఫలితం ఉండదు. గుడ్ గవర్నెన్స్‌కు మాత్రమే ప్రజల మద్దతు ఉంటుంది. ఈ ప్రభుత్వం మాది— ఈ ప్రభుత్వంలో మేమంతా హాయిగా జీవిస్తున్నాం. ఏ ఒక్క వర్గానికీ అన్యాయం జరగలేదు.. ప్రతి వర్గానికీ మేలు చేస్తున్నారన్న భావన ప్రజల్లో ఏర్పడాలి. అప్పుడే ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఫీల్ గుడ్ భావన ఏర్పడుతుంది. సంక్షేమం పేరిట ప్రజలకు ఇంత పడేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామంటే కుదరదని జగన్ విషయంలో రుజువైంది. ప్రభుత్వ యంత్రాంగంలో లోపించిన జవాబుదారీతనాన్ని తిరిగి తీసుకురావాలి. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలులో ఉందన్న భావన ప్రజలలో కల్పించాలి. రాజధాని

> తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌రెడ్డి వాడుతున్న ఫర్నిచర్ విలువ ఎంతో చెబితే డబ్బులు ముఖాన పడేస్తామని కొడాలి నాని వంటి వారు నోరు పారేసుకోవడం ఏమిటి? ఇవ్వడానికి మీరెవరు? తీసుకోవడానికి చంద్రబాబు ఎవరు? అది ప్రభుత్వ ఆస్తి. గతంలో ఓడిపోయిన మంత్రులు తమ ఇళ్లలోని ఫర్నిచర్‌ను ప్రభుత్వానికి అప్పగించేవారు. ప్రభుత్వ వాహనాలను ఇంట్లో పిల్లలు స్కూలుకు వెళ్లడానికి లేదా సొంత అవసరాలకు వాడుకోవడాన్ని నైతికంగా నేరంగా ఒకప్పుడు పరిగణించేవారు. ఇప్పుడు ఇంత సున్నితంగా ఆలోచించేవారు ఎక్కడ? కొడాలి నాని వంటి వారు గతంలో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ రావును ఇదే ఫర్నిచర్ పేరిట వేధించినప్పుడు నోరు ఎందుకు విప్పలేదు? అప్పుడు ఆయన కూడా ఫర్నిచర్ విలువ చెల్లిస్తానని చెప్పినా కూడా వినకుండా వేధించారు. విలువ కట్టడం ఎందుకు? వాడుకున్న ఫర్నిచర్‌ను స్వాధీనం చేయవచ్చు కదా?

అమరావతిని రెండు మూడేళ్లలో కట్టేస్తామని గొప్పలు చెప్పుకోవడం తగదు. చేయాలనుకున్నది చేసి చూపించండి. వాటి ఫలితాలు ప్రజలకు అందితే ఆటోమేటిక్‌గా ప్రజల మద్దతు లభిస్తుంది. రాష్ట్ర ఖజానాపై ఆర్థిక భారం మోపే పథకాల వల్ల ప్రయోజనం ఉండదు. ప్రభుత్వంపై ప్రజాభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఈ దిశగానే చంద్రబాబు పాలన సాగుతుందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అందుకు సహకరిస్తారని ఆశిద్దాం. తెలివైన వాళ్లు మూర్ఖుల తప్పిదాలను గమనించి నేర్చుకుంటారు. అందుకే వారి నిర్ణయాలు ఇతరులకు కూడా ఆమోదయోగ్యంగా ఉంటాయి!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

దుమ్ములేపిన దుమ్ముగూడెం ఆనకట్ట

అది 1970వ సంవత్సరం. తెలంగాణ ఉద్యమంతో పాటు ఆంధ్రా ఉద్యమం కూడా ఆరంభమైంది. ముఖ్యమంత్రిగా బ్రహ్మానందరెడ్డి దిగిపోయి పీవీ నరసింహారావు నియమించబడ్డారు. నేను ఒక రోజు సాయంత్రం శిల్పినగర్‌లో శిల్పులతో మాట్లాడుతుండగా, భద్రాచలం దేవాలయ బంట్రోతు వచ్చి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేవస్థానం ఆఫీసుకు అర్జెంటుగా రమ్మన్నారు అని చెప్పాడు. అప్పుడు నాగిరెడ్డి గారు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. నేను ఆయన రూములోకి ప్రవేశించగానే "ప్రకాశం గారు! హైదరాబాద్ నుంచి ఫోన్ ఇద్దరు ముఖ్య అతిథులు దైవదర్శనానికి భద్రాచలం వస్తున్నారు. అందులో ఒకరు ఎమ్మెల్యే వావిలాల గోపాలకృష్ణయ్య, రెండవవారు ఆంధ్రపత్రిక చీఫ్ రిపోర్టర్ ముక్కుశర్మ. ఇద్దరూ ఫైర్‌బ్రాండ్‌లే. జాగ్రత్తగా వారికి దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేసి దైవదర్శనం చేయించండి. వారిద్దరూ ఉదయం 7 గంటలకల్లా దేవాలయానికి వచ్చి అభిషేక సేవలో పాల్గొంటారు. వారికి కావలసిన అన్ని ఏర్పాట్లు మీరు చూసుకోవాలి. వావిలాల ప్రభుత్వానికి సింహస్వప్నం. నిస్వార్థపరుడు. ముక్కుశర్మ వార్తలను కళ్లతోనే కాకుండా ముక్కుతో కూడా వాసన చూడగలడు. అందుకే ఆయనను ముక్కుశర్మ అని అంటారు. వీరు ఎప్పుడూ కలిసే ఉంటారు. బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆయన డైనింగ్‌రూమ్‌లో భోజనం చేస్తున్నా శర్మకి లోపలికి వెళ్లడానికి అనుమతి ఉండేది. అందుకని వారిని జాగ్రత్తగా చూడాల్సిన బాధ్యత మీ మీద పెడుతున్నాను" అని చెప్పారు.

మరునాడు ఉదయం ఆరు గంటలలోపే వారిని రిసీవ్ చేసుకోవడానికి చిత్రకూట మంటపంలోనే నేను, నాగిరెడ్డిగారు ఎదురుచూస్తున్నాం. వావిలాల, ముక్కుశర్మ ఏడు గంటలకల్లా దేవాలయ ప్రాంగణంలో ప్రవేశించారు. సాధారణ పరిచయాలయ్యాక వారిని రాజగోపురం నుంచి మెయిన్ దేవాలయంలోకి తీసుకువెళ్లి అర్థమంటపంలో కూర్చోబెట్టాను. దేవాలయ అర్చకులు శఠగోపాలాచారి, అప్పలాచార్యులిద్దరూ వారికి తీర్థమిచ్చి, సీతాలక్ష్మణ సమేత రామచంద్రుల వారి అభిషేకంలో కూర్చోబెట్టారు. పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత, దేవాలయం అర్చకులు వారిని ఆశీర్వదించి, ప్రసాదాలు అందజేశారు. వారు ప్రతి విషయం విశదంగా అడిగి తెలుసుకున్నారు. అంతా సవ్యంగా జరిగింది అనుకున్నాం. ఇంతలో మేము పర్ణశాల చూడాలనుకుంటున్నాం అని ముక్కుశర్మ రిక్వెస్టు చేశారు. భద్రాచలానికి 24 మైళ్ల దూరంలో ఉంది పర్ణశాల. వారిని తీసుకుని దేవాలయ బస్సులో పర్ణశాలకు వెళ్లాం.

1969లో వచ్చిన భూకంపానికి పర్ణశాల గుడి పడిపోయింది. దేవుని విగ్రహాలు మాత్రం సురక్షితంగా ఉన్నాయి. దేవాలయం గోదావరి ఒడ్డున ఉంది. హైదరాబాద్ నుంచి శాస్త్రజ్ఞులు, గణపతి స్థపతి, ఎండోమెంటు ఇంజనీర్లు అంతా వచ్చి చూశారు. పర్ణశాల చుట్టూ ఉన్నవి నల్లరేగడి నేలలు. భూకంపానికి సెంటరు గోదావరి అవతల ఉన్న లక్ష్మణగుట్ట అని నిర్ధారించారు. గోదావరి అవతల అన్నీ బొగ్గు గనులు. మళ్లీ దేవాలయం కట్టాలి కదా! హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణులు ఏం నిర్ణయించారంటే.. దేవాలయ ఫౌండేషన్ 36 అడుగుల లోతు ఉండాలి. అక్కడ ఆ విధంగా తవ్విన ఫౌండేషన్‌లో 24 అడుగులు రాతిబండలు, ఇసుకతో నింపాలి. దానిమీద ఆర్‌సీసీ (కాంక్రీటు) రాఫ్ట్ వేయాలి. అందులో 16 పిల్లర్లు కుదించి, గ్రౌండ్ లెవల్‌కు వచ్చిన తర్వాత, అక్కడ మళ్లీ పిల్లర్ల మీద కాంక్రీటుతో రాఫ్టు వేసి దాని మీద దేవాలయం కట్టాలి. ఈ పని ప్రారంభించే ముందు దేవుడి విగ్రహాలు తొలగించి, వేరేచోట ఉంచి వాటికి రోజూ పూజా కైంకర్యాలు జరపాలి. శాస్త్రబద్ధంగా విగ్రహాలను పీఠం నుంచి తొలగించి పక్కన ఉన్న సత్రంలోని ఒక గదిలో పర్యవేక్షింపజేశాం. ఎనిమిది నెలల తర్వాత దేవాలయం పూర్తయింది. ఆలయంలో విగ్రహాల పునః ప్రతిష్ఠ, సంప్రోక్షణ జరిగింది.

సరే ఇప్పటి విషయానికి వద్దాం. మేమందరం పర్ణశాలకు చేరుకున్నాక నేను వారికి భూకంపానికి దేవాలయం కూలిపోవడం, తిరిగి నిపుణుల సలహా మేరకు ఏ విధంగా నిర్మించింది వివరించాను. దేవాలయంలో పూజలు చేయించి, తిరిగి అందరం భద్రాచలం బయలుదేరాం. ఇంతలో శర్మగారు భద్రాచలం పోయే లోపల మనం దుమ్ముగూడెం ప్రాజెక్టు చూసి వెడదామన్నారు. దుమ్ముగూడెం మెయిన్ రోడ్డుకు ఆరు మైళ్ల లోపలగా ఉంటుంది. కాటన్ దొర ధవళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి ముందు రాజమండ్రి నుంచి గోదావరి నది ప్రవాహాన్ని గమనిస్తూ భద్రాచలం దాటి దుమ్ముగూడెం వరకు ప్రయాణించి అక్కడ ఒక బేరేజీ కట్టడానికి నిర్ణయించారు. ఇది ధవళేశ్వరానికి కొట్టుకువచ్చే బురద (సిల్టు) ఆపడానికి పనికొస్తుంది. అదికాక గోదావరి మధ్య ఇక్కడ చిన్న ద్వీపకల్పం కూడా ఉంది. పూర్వం ప్రాజెక్టులు నిర్మించే ముందు ప్రతి అంశాన్ని అధ్యయనం చేసి ప్రవాహవేగాన్ని, నీటి లభ్యతను, అది కట్టే చోట భూమి పటిష్ఠతను కూలంకషంగా పరిశీలించి ప్రాజెక్టులు కట్టేవారు. ధవళేశ్వరం, నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరామ్‌సాగర్ వంటివి దృఢంగా నిలబడి వేల ఎకరాలకు సాగు, తాగు నీరు అందిస్తున్నాయంటే అప్పటి పాలకులు, ఇంజనీర్లు, కంట్రాక్టర్ల దూరదృష్టి కారణం. ఆదరాబాదరాగా కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఏ విధంగా నిరర్థకమైందో మన కళ్లముందు కనబడుతోంది కదా.

మేమందరం దుమ్ముగూడెం వెళ్లి ఆనకట్ట పైకి ఎక్కాం. హైదరాబాద్ నుంచి వచ్చిన పెద్దలు ప్రాజెక్టు చూసి సంతోషపడతారని అనుకున్నాను. కాని అక్కడ జరిగింది మరొకటి. దుమ్ముగూడెం ఆనకట్ట లాకులు పూర్తిగా మూసివేసి, గోదావరిలో ఎగువనీరును ఆపి నిల్వచేసి ఉంచారు. ముక్కుశర్మ నా వైపు తిరిగి ఇక్కడ ప్రాజెక్టుకు సంబంధించిన స్టాఫును ఎవరినైనా పిలిపించమన్నారు. అక్కడే ఉన్న ఇరిగేషన్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మా వద్దకు వచ్చాడు. ఇదేదో కొంపముంచేలా ఉందని నాకు అనుమానం వచ్చింది.

గోదావరి నీళ్లను కిందికి వదలకుండా ఎందుకు లాకులు బంధు చేశారు అని శర్మగారు వర్క్స్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగారు. అందుకాయన— ఆ ఏముందిలెండి, ఇప్పుడు గోదావరిలో ప్రవాహం తక్కువగా ఉంది కదా! ఎండాకాలం కదా! రాజమండ్రి పేపరు మిల్లుకు బొంగులు పంట్లు లాగా కట్టి, ఈ ప్రవాహంలో రాజమండ్రి దాకా తీసుకువెడతారు. ఆ బొంగు పంటులు ముందుకు కదలాలంటే నీళ్లు ఉండాలి కదా! అందుకనే అన్ని బొంగు పంట్లు, పై నుంచి ఇక్కడకు వచ్చేదాకా నీరు ఆపివేసి, తర్వాత కిందికి వదుల్తాం— అని చెప్పాడు.

ఈ బొంగులు ఎవరివి? దీనికి, డిపార్టుమెంటుకి ఏమి సంబంధం అని శర్మ అడిగారు. అందుకు ఇన్‌స్పెక్టర్— ఇవి ఒక ప్రైవేటు కాంట్రాక్టరువి. ఆయన పైన ఆదిలాబాద్ అడవుల నుంచి వీటిని నరికించి, పంటులుగా కట్టి, రాజమండ్రి పేపరు మిల్లుకు పంపుతాడు అని చెప్పాడు. అప్పుడు శర్మ ఎందుకు గోదావరి మీదుగా పంపుతున్నాడు. లారీలకు లోడ్ చేసి రాజమండ్రి పంపవచ్చు కదా అన్నారు. అందుకు ఇన్‌స్పెక్టర్— అది చాలా ఖర్చుతో కూడిన పని. ఇదైతే పంటు మీద ఇద్దరు మనుషులను బత్తెం, కూలి ఇచ్చి పంపిస్తే మూడవ రోజుకల్లా రాజమండ్రికి చేరతాయి. అక్కడ కాంట్రాక్టరు పేపరు మిల్లుకు అప్పజెప్పి పని పూర్తి చేసుకుంటాడు. మా డిపార్టుమెంటులో పైవాళ్లనందరినీ మేనేజ్ చేసుకున్నాడని ముసిముసి నవ్వులు నవ్వుతూ చెప్పాడు.

వాళ్లు ఎవరనుకుని ఈ అర్భకుడు డిపార్టుమెంటు గుట్టంతా బయటపెడుతున్నాడు అనుకుని నేను వెంటనే— ఏమయ్యా! చాలా ఎక్కువగా మాట్లాడుతున్నావు. వారెవరనుకుంటున్నావు. నోరు మూసుకుంటే మంచిదని వార్నింగ్ ఇచ్చాను. కాని అతను లెక్కచేయలేదు.



> ధవళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లులేక ఉభయ గోదావరి జిల్లాల్లో భూములు ఎండిపోతున్నాయి. మీ గవర్నమెంటు ఎవరో కాంట్రాక్టరుకు లబ్ధి చేయడానికి తెలంగాణలోని దుమ్ముగూడెం ప్రాజెక్టు గేట్లు మూసివేసి, గోదావరి నీరు కిందికి పారకుండా ఆంధ్ర రైతులను ఇబ్బంది పెడుతున్నది. ఇది అన్యాయం కదా! దీనిపై మీ వివరణ కావాలి అని ముక్కుశర్మ ముఖ్యమంత్రితో అన్నారు. ముఖ్యమంత్రికి తల తిరిగింది. ఎక్కడ గోదావరి, ఎక్కడ దుమ్ముగూడెం, ఎక్కడ ధవళేశ్వరం ప్రాజెక్టు, ప్రభుత్వానికి తెలియకుండా గేట్లు మూసివేయడమేంటి?


ధవళేశ్వరం ఆయకట్టుకు నీళ్లు వదలటానికి ప్రాజెక్టులో తగినంత నీటి నిల్వ లేదు. తూర్పు, పశ్చిమగోదావరి రైతులు నీళ్లకోసం గగ్గోలు పెడుతున్నారు. తెలంగాణ, ఆంధ్ర ఉద్యమాలు జోరుగా సాగుతున్నాయి. బ్రహ్మానందరెడ్డి దిగిపోయి పీవీ నరసింహారావు ముఖ్యమంత్రి అయ్యారు. ఇక్కడ దుమ్ముగూడెం ఆనకట్ట మీద ఇద్దరు ప్రముఖ వ్యక్తులు ఏదో డిస్కస్ చేస్తున్నారు. గోదావరి తల్లి దుమ్ముగూడెం ఎగువన నిండుగా ఉంది. దిగువన చిన్నపాయగా కనబడుతోంది. ప్రముఖులిద్దరూ నా వంక తిరిగి బయల్దేరదామన్నారు. సాయంత్రానికి భద్రాచలం చేరుకున్నాం. రాత్రికి వారు హైదరాబాద్ బయల్దేరి వెళ్లిపోయారు. నేను, మా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఊపిరి పీల్చుకున్నాం. కానీ జరిగింది మరొకటి.

మరుసటి ఉదయం తొమ్మిదింటికి వావిలాల గోపాలకృష్ణయ్య, ముక్కు శర్మ ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్నారు. ధవళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లలేక ఉభయ గోదావరి జిల్లాల్లో భూములు ఎండిపోతున్నాయి. మీ గవర్నమెంటు ఎవరో కాంట్రాక్టరుకు లబ్ధి చేయడానికి తెలంగాణలోని దుమ్ముగూడెం ప్రాజెక్టు గేట్లు మూసివేసి, గోదావరి నీరు కిందికి పారకుండా ఆంధ్ర రైతులను ఇబ్బంది పెడుతున్నది. ఇది అన్యాయం కదా! దీనిపై మీ వివరణ కావాలి అని ముక్కుశర్మ ముఖ్యమంత్రితో అన్నారు. ముఖ్యమంత్రి నిర్ఘాంతపోయారు. ఎక్కడ గోదావరి, ఎక్కడ దుమ్ముగూడెం, ఎక్కడ ధవళేశ్వరం ప్రాజెక్టు, ప్రభుత్వానికి తెలియకుండా గేట్లు మూసివేయడమేంటి?

అప్పటికే ఆంధ్ర ఉద్యమం ఊపందుకుంటున్నది. వెంటనే ముఖ్య కార్యదర్శిని పిలిచి ఆ పెద్దలకు వివరణ ఇప్పించారు. చకచకా ఫోన్లు కదిలి అప్పటి నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరును, ఆయన కింది దుమ్ముగూడెం ప్రాజెక్టులో ఉన్న సబార్డినేట్ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. అర్జెంటుగా గేట్లు తెరచి కిందికి నీళ్లు వదిలారు.

అదీ! ఒక శక్తిమంతుడైన పత్రికా విలేఖరి, నిస్వార్థపరుడైన శాసనసభ్యుడి పరిశోధన! ఇప్పుడు అటువంటి వ్యక్తులు గాని, వ్యవస్థ గాని కరువయింది.

■ కొప్పుల ప్రకాశం
రిటైర్డ్ ఇంజనీరు, భద్రాచలం



సీ ఫ్యాన్స్ దొంగ

సముద్రగర్భంలో వన్యప్రాణుల స్మగ్లింగ్

- ఫొటోఫ్రేముల్లో అమర్చి రూ.లక్షలకు అమ్మకాలు
- సీ ఫ్యాన్స్ ఇంట్లో ఉంటే కుబేరులవుతారని ప్రచారం
- వీడియోల ఆధారంగా ట్రాప్ చేసిన డబ్ల్యూజేసీ
- రూ.91.25 లక్షల వన్యప్రాణి సంపద స్వాధీనం
- నగరంలో వెలుగుచూసిన నయా మోసం

6లో..

చెట్టు డిజైన్ ఆకారంలో కనిపిస్తున్న దీనినే సీ ఫ్యాన్స్ అంటారు. సముద్ర గర్భంలో దొరికే ఈ ప్రాణులను ఫొటోఫ్రేములుగా తయారుచేసి రూ. లక్షలకు విక్రయిస్తున్నారు.

కొత్త కలెక్టర్‌గా సృజన

గతంలో కృష్ణాజిల్లా సబ్ కలెక్టర్‌గా విధులు



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి గుమ్మళ్ల సృజన కలెక్టర్‌గా రానున్నారు. ప్రస్తుతం ఆమె కర్నూలు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సృజన 2015లో కృష్ణాజిల్లా సబ్ కలెక్టర్‌గా చేశారు. ఆమె గ్రేటర్ విశాఖ మున్సిపల్ కమిషనర్‌గా కూడా పనిచేశారు. ఆ సమయంలో కరోనా ప్రబలుతుండగా, ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చి, మెటర్నటీ సెలవు ఉపయోగించుకునే అవకాశం ఉన్నా, తన బిడ్డతో విధులకు హాజరుకావడం అందరి దృష్టినీ ఆకర్షించింది. గుమ్మళ్ల సృజన తండ్రి బలరామయ్య ఐఏఎస్ అధికారి. తల్లి సుగుణశీల గృహిణి. భర్త రవితేజ హైకోర్టు అడ్వకేట్‌గా చేస్తున్నారు. సృజన విద్యాభ్యాసం మొత్తం హైదరాబాద్‌లో జరిగింది. బీఏ సెయింటాన్స్‌లో, ఎంఏ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చేశారు. శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. సృజన భర్త రవితేజ ప్రముఖ సోషలిస్టు నాయకుడు వాసిరెడ్డి కృష్ణారావు మనవడు.



దిల్లీరావుకు జాతీయ అవార్డు

మాదకద్రవ్యాల నిరోధం, బాలల హక్కుల పరిరక్షణపై పనితీరుకు గుర్తింపు

6లో..

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల దేవదాయశాఖ సహాయ కమిషనర్ (ఏసీ) అవినీతి అక్రమాలపై ప్రభుత్వం స్పందించింది. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ విచారణకు ఆదేశించడంతో విచారణాధికారిగా దేవదాయ శాఖ ప్రాంతీయ కమిషనర్ (ఆర్‌జేసీ) సుబ్బారావు శనివారం విజయవాడలో విచారణ నిర్వహించారు. దేవాలయాలను, ఆస్తులను, రికార్డులను పరిశీలించి అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. మరోపక్క, ఆర్‌జేసీ వస్తున్నారని తెలిసి ఏసీ హైదరాబాద్ పయనమయ్యారు. లొకేషన్ పంపమని అడగడంతో మార్గంమధ్యలోనే వెనుదిరిగి విజయవాడ చేరుకున్నారు. విచారణ సమయంలో అధికారులకు ఆర్‌జేసీ ముచ్చెమటలు పట్టించారు.

ఏసీ అక్రమాలపై ముచ్చెమటలు

ప్రశ్నల వర్షం కురిపించిన ఆర్‌జేసీ

- ఆర్‌జేసీ వస్తున్నారని తెలిసి తప్పించుకోజూసిన ఏసీ
- హైదరాబాద్ వెళ్తూ నాగాయలంకలో ఉన్నట్టు చెప్పించిన అధికారిణి
- లొకేషన్ పెట్టాలని ఆర్‌జేసీ కోరడంతో హడావిడిగా వెనక్కి పయనం
- అక్రమాలపై పరిశీలన • త్వరలో నివేదిక ఇస్తానని ఆర్‌జేసీ సుబ్బారావు వెల్లడి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయవాడ, జూన్ 22 : దేవదాయ శాఖ ఏసీ అవినీతి, అక్రమాలపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. వీటిపై దేవదాయశాఖ మంత్రి, ఇతర ఉన్నతాధికారులు ఆరా తీశారు. విచారణ చేపట్టాల్సిందిగా కమిషనర్‌కు సూచించారు. వన్‌టౌన్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్బారావు విచారణ చేపట్టారు. రికార్డులను తనిఖీ చేశారు. ఇన్‌చార్జి ఈవో మోహనరావు, గుమస్తా అజయ్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

● షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేతపై ప్రశ్నల వర్షం

దేవస్థానానికి చెందిన గవర్నరుపేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో భవనంపై ఉన్న మొదటి అంతస్తును ఎవరు కూల్చారు? ఎందుకు కూల్చారు? కూల్చిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని ఆర్‌జేసీ ప్రశ్నించారు. లీజు కాలపరిమితి ముగిసి 14 సంవత్సరాలైనా ఎందుకు స్వాధీనం చేసుకోలేదని అడిగారు. లీజుదారుడు పెద్ద మొత్తంలో బకాయి ఉన్నప్పుడు పంచనామా చేసి షాపును స్వాధీనం చేసుకోవడంతో పాటు టెండర్లను ఎందుకు పిలవలేదని నిలదీశారు. ఇందుకు సంబంధించిన రికార్డుల జిరాక్స్ కాపీలను ఆయన తీసుకున్నారు.

● రికార్డులు పరిశీలించి వివరాల సేకరణ

వన్‌టౌన్ పాతశివాలయంలోని విఘ్నేశ్వర రమా సహిత సత్యనారాయణస్వామి దేవస్థానం రికార్డులను పరిశీలించారు. గవర్నరుపేటలో ఉన్న దుకాణాల లీజు పూర్తి వివరాలు సేకరించారు. అనధికారికంగా ఉంటున్న



శివాలయ కల్యాణమండపాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలిస్తున్న ఆర్‌జేసీ

వారిని ఎందుకు ఖాళీ చేయించలేదు? కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? అద్దె బకాయిలను ఎందుకు రాబట్టడం లేదు? అసలు లీజుదారులు ఎవరు? అని ఈవో సురేష్‌ను నిలదీశారు. తరువాత ఆయన సంబంధిత షాపులను పరిశీలించారు. అద్దెకుంటున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

● చల్లంరాజు సత్రం పరిశీలన

సామారంగం చౌక్‌లోని చల్లంరాజు సత్రాన్ని కూడా పరిశీలించారు. ఈవో సత్యప్రసాద్‌ను సంబంధిత లీజులు, అద్దెలు, బకాయిలు తదితరాలను అడిగి తెలుసుకున్నారు. లీజు ఒప్పందాల నకళ్లను తీసుకున్నారు. అనంతరం సత్యనారాయణపురంలోని శివాలయం పక్కనే ఉన్న కల్యాణ

మిగతా 6వ పేజీలో...

జగ్గయ్యపేటలో హై అలర్ట్



విద్యానగర్, మిట్టగూడెంలో ఇంటింటి సర్వే

పెరుగుతున్న డయేరియా కేసులు.. ఆసుపత్రులకు క్యూ

జగ్గయ్యపేటలో డయేరియా విజృంభిస్తోంది. ఈ వ్యాధి లక్షణాలతో పదుల సంఖ్యలో జనం ఆసుపత్రుల పాలవుతున్నారు. శుక్రవారం ఇద్దరు, శనివారం నలుగురు మృతిచెందడంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. హై అలర్ట్ ప్రకటించారు. ఇంటింటి సర్వే చేపట్టి అనారోగ్య పీడితుల వివరాలు సేకరిస్తున్నారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి, లీకేజీలకు మరమ్మతులు చేయిస్తున్నారు.

నలుగురు మృతి.. ఆరుకు చేరిన మృతుల సంఖ్య

- వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరిన 21 మంది
- వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు
- ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్
- డీఎంహెచ్‌వోతో పాటు జేసీ, డీసీహెచ్‌ఎస్‌ల బస

జగ్గయ్యపేట, జూన్ 22 : జగ్గయ్యపేటలో డయేరియా లక్షణాలతో శనివారం నలుగురు మృతిచెందారు. జగ్గయ్యపేటకు చెందిన ఉమ్మినేని రంగయ్య, బూదవాడ, గండ్రాయి, వేదాద్రి గ్రామాలకు చెందిన మరో ముగ్గురు మహిళలు శనివారం చనిపోయారు. పట్టణంలో పలు ప్రాంతాల్లోని ఆసుపత్రులకు డయేరియా లక్షణాలతో ఎంతోమంది క్యూ కడుతున్నారు. వీరిలో చిన్నపిల్లలు కూడా ఉన్నారు. పట్టణంలోని విద్యానగర్, చిల్లకల్లు, మిట్టగూడెం, సీతారాంపురం, తోటబజార్, డాంగేనగర్‌తో పాటు గ్రామీణ ప్రాంతాలైన షేర్‌మహ్మద్‌పేట, చిల్లకల్లు, గండ్రాయి, ముక్కపేటలో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో షేర్‌మహ్మద్‌పేట, చిల్లకల్లు, ముక్కపేట గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. డయేరియా లక్షణాలున్న వారిని జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తున్నారు. పురపాలక సంఘం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టి, డయేరియా కేసులను జల్లెడ పడుతున్నారు. అన్ని వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. ప్రధానమైన లీకేజీలను గుర్తించి వాటిని సరిచేసేందుకు చర్యలు చేపట్టారు.

అధికారులు అప్రమత్తం

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పద్మావతి శనివారం జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో రోగులను పరామర్శించిన ఆమె డీఎంహెచ్‌వో సుహాసినీ, డీసీహెచ్‌ఎస్ నాయక్, నందిగామ ఆర్డీవో రవీంద్ర, సామాజిక ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్ హరీష్, ఇతర వైద్యులతో సమీక్షించారు. డయేరియా లక్షణాలు కనిపిస్తున్న గ్రామాల్లో సర్వేలు చేయాలని, అనుమానిత కేసులను గుర్తించాలని, అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో వివరాలు సేకరిస్తున్న జేసీ సంపత్‌కుమార్

జేసీ, డీసీహెచ్‌ఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణ

జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, జిల్లా ఆసుపత్రి సేవల కో-ఆర్డినేటర్ బీసీకే నాయక్ శనివారం ఆసుపత్రిలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి, మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అత్యవసర చర్యలను సూచించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని, వాటర్ ప్లాంట్లలో నీటి వనరులను పరిశీలించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు.

చికిత్స పొందుతున్నది వీరే..

జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వత్సవాయికి చెందిన భార్యాభర్తలు ప్రభావతి (60), నాగేశ్వరరావు (70), చిల్లకల్లుకు చెందిన అక్కాచెల్లెలు సూర్యకుమారి (10), డింపుల్ ధరణి (9), నాయనమ్మ, మనుమలు ఎం.సావిత్రి, ఎం.మహేంద్ర (15), లోకేశ్ (12), బి.హాసిని (9), సీతారాంపురానికి చెందిన తల్లీకొడుకులు సుజాత (25), గౌతమ్ (9), మిట్టగూడేనికి చెందిన లక్ష్మీప్రసన్న (12), శేషమ్మ (60), కవిత (16), తోటబజార్‌కు చెందిన షేక్ అయేషా (13), విద్యానగర్‌కు చెందిన ఎస్.పూజి (16), గండ్రాయికి చెందిన వల్లాల విజయమ్మ (55), ముక్కపేటకు చెందిన భార్యాభర్తలు గోపాలకృష్ణ, త్రివేణి, మంగొల్లుకు చెందిన నాగూర్‌బీ (20), షేర్‌మహ్మద్‌పేటకు చెందిన వై.అచ్చమ్మ (80), సింగవరం గ్రామానికి చెందిన టి.నరసింహారావు (19), చిట్యేలకు చెందిన మాలచ్చయ్యలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

1 నుంచి స్టాప్ డయేరియా

రెండు నెలల పాటు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు : కలెక్టర్ దిల్లీరావు

6లో..

మాచవరం ఇన్‌స్పెక్టర్‌కు పవన్ ఫోన్

యువతి అదృశ్యం కేసుపై ఆరా



విజయవాడ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం మాచవరం ఇన్‌స్పెక్టర్ గుణరామ్‌కు ఫోన్ చేశారు. ఓ యువతి అదృశ్యం కేసుపై ఆరా తీశారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన ఓ యువతి మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఓ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో చదివేది. ఎనికేపాడుకు చెందిన షణ్ము అనే యువకుడు అదే కళాశాలలో చదివేవాడు. ఇద్దరూ గత నవంబరులో అదృశ్యమయ్యారు. దీనిపై యువతి తల్లి మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, జనవరిలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇప్పటి వరకు యువతి ఆచూకీ లభించలేదు. పలుమార్లు ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఐదు రోజుల క్రితం మాచవరం ఇన్‌స్పెక్టర్ గుణరామ్‌ను కలిసింది. కాగా, శనివారం ఆమె నేరుగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి తన బాధ చెప్పుకొంది. స్పందించిన పవన్ తన కో ఆర్డినేటర్‌తో మాచవరం ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేయించారు. తర్వాత పవన్ మాట్లాడతారని ఆయనకు ఫోన్ ఇచ్చారు. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు వివరాలను గుణరామ్.. డిప్యూటీ సీఎంకు వివరించారు. వారిద్దరూ హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించామని, అక్కడ ఓ లాడ్జీలో బస చేసిన తర్వాత తిరిగి వెళ్లిపోయారని, దీనికి సంబంధించిన సీసీ పుటేజీని సేకరించామన్నారు. ఆ తర్వాత వారు ఫోన్లను మరొకరికి విక్రయించేశారన్నారు. షణ్ము ఇంతకుముందు ఒక యువతిని ఈవిధంగానే తీసుకెళ్లిపోయాడని వివరించారు. దర్యాప్తును కొనసాగిస్తూనే యువతిని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఆ తర్వాత జనసేన కార్యాలయ సిబ్బందితో యువతి తల్లిని పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పంపారు. కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. యువతి ఆచూకీని ఛేదించడానికి ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సీపీ ఆదేశించారు.

బదిలీల కోసం తహతహ

సొంత జిల్లాలకు బదిలీల కోసం ఉమ్మడి కృష్ణాజిల్లా తహసీల్దార్లు తహతహలాడుతున్నారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి బదిలీలపై వచ్చిన వారిలో కొందరు ఇక్కడే ఉండిపోవటానికి ప్రయత్నాలు చేయటంతో సొంత జిల్లా తహసీల్దార్లలో ఆందోళన నెలకొంది. వీరు రివర్స్ బదిలీల కోసం పట్టుబడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు.. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడగానే ఈ బదిలీలపై దృష్టి సారించారు. ఏపీ రెవెన్యూ సర్వీసు అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) అగ్ర నాయకత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు.

● సొంత జిల్లాకొచ్చినా.. పాత మండలం కష్టం

ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేయటం ఆనవాయితీ. దీన్ని కొనసాగించే క్రమంలో సొంత జిల్లాలకు బదిలీ చేస్తారే తప్ప సొంత మండలాలకు బదిలీ చేయరు. సీసీఎల్ఏ అధికారులు గంపగుత్తగా ఒక జిల్లాకు చెందిన తహసీల్దార్లను మరో జిల్లాకు కేటాయిస్తారు. ఇలా మరో జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు అక్కడి జిల్లా కలెక్టర్లు మండలాలను కేటాయిస్తారు. తిరిగి వీరంతా సొంత జిల్లాలకు బదిలీ చేసినపుడు కూడా ఆయా జిల్లాల కలెక్టర్లే మండలాలను కేటాయిస్తారు. గతంలో కేటాయించిన మండలాలను కేటాయించరు. కానీ, రెవెన్యూ తహసీల్దార్లు ఏదో రకంగా ఎన్నికల ముందు పనిచేసిన మండలాల్లోనే పనిచేసేందుకు ఆసక్తి చూపించడం గమనార్హం.

తహసీల్దార్ల లొల్లి

- ఏపీఆర్ఎస్ఏపై తీవ్ర ఒత్తిళ్లు
- ఇతర జిల్లాల నుంచి వచ్చినవారు పాతుకుపోతారని ఆందోళన
- సొంత జిల్లాలతో పాటు పాత మండలమే కావాలట..!
- అక్రమాలకు అనువుగా ఉండటమే కారణం
- ఐదేళ్లలో కార్యాలయాల్లో ఉంది తక్కువ.. కాసుల యావే ఎక్కువ
- సొంత మండలాలకు రాకుండా చూసుకుంటేనే అక్రమాలకు అడ్డు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తహసీల్దార్ల సంఘాలన్నీ ఏపీఆర్ఎస్ఏలో విలీనమై ఒకే గొడుగు కింద పనిచేస్తుండటంతో అగ్ర నాయకత్వానికి బదిలీల సమస్య తప్పటం లేదు. రెవెన్యూ శాఖ మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రమాణ స్వీకారం చేసిన రెండో రోజునే ఏపీఆర్ఎస్ఏ అగ్ర నాయకత్వం వెళ్లి బదిలీలపై మాట్లాడాల్సి వచ్చింది. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించినప్పటికీ ప్రభుత్వ స్థాయిలో విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది కాబట్టి కొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది.

● ఎందుకు ఒత్తిడి చేస్తున్నారంటే..

తహసీల్దార్లలో ఎందుకు ఇంత ఆందోళన నెలకొన్నదన్న అంశాన్ని పరిశీలిస్తే.. ఇతర జిల్లాల నుంచి వచ్చినవారు ఇక్కడ సీటు కదలటానికి ఇష్టపడకపోవటమేనని తెలుస్తోంది. దీంతోపాటు అక్రమంగా ఆర్జించటానికి అనేక అవకాశాలు ఉండటం.. మూడు నెలలుగా అవినీతి రుచి మరగటంతో ఇక్కడి నుంచి కదలకూడదన్న ప్రయత్నాలను ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు చేస్తున్నారు. దీనికోసం పైరవీలు కూడా చేస్తున్నారు. సొంత జిల్లాలకు వచ్చే క్రమంలో గతంలో తాము పనిచేసిన స్థానాల్లోనే పనిచేసేందుకు ఉబలాటపడుతున్న తహసీల్దార్లకు, పొరుగు జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్ల చర్యలు ఇబ్బందికరంగా మారాయి. దూరాభారాన ఉండటంతో తాము ఏమీ చేయలేకపోతున్నామని, సొంత జిల్లాలకు వస్తే ఏదైనా ప్రయత్నాలు చేయవచ్చన్న ఆలోచనతో ఉన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చినవారు ఇప్పటికే తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేల దగ్గర పైరవీలు ప్రారంభించారు. ఎమ్మెల్యేలు ఎలాంటి హామీలు ఇవ్వనప్పటికీ.. పొరుగు జిల్లాల్లో ఉన్న మన జిల్లా తహసీల్దార్లు మాత్రం కంగారు పడుతున్నారు.

బెజవాడలో 'సీ ఫ్యాన్స్' దొంగ

- సముద్రగర్భంలో వన్యప్రాణుల స్మగ్లింగ్
- ఫొటో ఫ్రేముల్లో అమర్చి లక్షలాది రూపాయలకు అమ్మకాలు
- సీ ఫ్యాన్స్ ఇంట్లో ఉంటే కుబేరులవుతారని ప్రచారం
- వీడియోల ఆధారంగా ట్రాప్ వేసిన డబ్ల్యూజేసీ
- రూ.91.25 లక్షల వన్యప్రాణి సంపద స్వాధీనం
- దేశంలోనే అతిపెద్ద స్మగ్లింగ్ అంటున్న అధికారులు





అయ్యప్పనగర్‌లో అక్షయనిధి పేరుతో షాపు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

విజయవాడ, జూన్ 22(ఆంధ్రజ్యోతి): సముద్రగర్భంలో 10 నుంచి 20 మీటర్ల లోతులో పరిశుభ్రమైన ప్రదేశంలో వివిధ వర్ణాల్లో నెమలి పురి విప్పినట్టుగా కనిపించే ఆకారాలవి. వీడియోలు, ఫొటోల్లో చూసిన వాళ్లంతా వాటిని సముద్రగర్భంలో పెరిగే మొక్కలు అనుకుంటారు. వన్యప్రాణి పరిభాషలో వాటిని సీ ఫ్యాన్స్‌గా వ్యవహరిస్తారు. అంతరించిపోతున్న జాతి జాబితాలో ఉన్న ఈ సీఫ్యాన్స్ ప్రాణులతోపాటు వన్యప్రాణుల శరీర భాగాలను ఫొటో ఫ్రేమ్‌లుగా తయారుచేసి లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్న వ్యక్తిని అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.91.25 లక్షల విలువైన వన్యప్రాణి సంపదను స్వాధీనం చేసుకున్నారు. దేశంలో వన్యప్రాణి సంపదను ఇంత పెద్దమొత్తంలో సీజ్ చేయడం ఇదే ప్రథమమని అధికారులు తెలిపారు. వివరాలను వైల్డ్‌లైఫ్ జస్టిస్ కమిషన్ ఇండియా హెడ్ ఎస్‌కేడీ నీరజ్, ఎన్టీఆర్ జిల్లా అటవీశాఖాధికారి ఏవీఎస్ఆర్‌కే అప్పన్న, విజిలెన్స్ విభాగ డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మ, విజిలెన్స్ విభాగ రేంజ్ అధికారి ఎం.శంకరయ్య శనివారం వెల్లడించారు. విజయవాడకు చెందిన ఎస్.శ్రీనివాసరావు మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. మహారాష్ట్రలోని విద్యుత్ ప్లాంట్‌లో కొన్నాళ్లు పని చేశాడు. దాన్ని మూసేయడంతో తిరిగి విజయవాడకు చేరుకున్నాడు. అయ్యప్పనగర్‌లో అక్షయనిధి పేరుతో ఓ షాపును ఏర్పాటు చేసుకున్నాడు. ఇందులో అడవినక్క తోక, ఏనుగు తోక వెంట్రుకలతో తయారు చేసిన బ్రాస్‌లెట్లు, సముద్రపు తేలు, పాములు విడిచిన చర్మం(కుబుసం), జింక చర్మం, సముద్రగర్భంలో పెరిగే సీ ఫ్యాన్స్‌ను తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. సీ ఫ్యాన్స్ ఎండిపోయిన మొక్క మాదిరిగా మారిన తర్వాత ఫొటో ఫ్రేమ్‌లో అమర్చి అమ్ముతున్నాడు. ఒక్కో ఫ్రేమ్‌ను రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు విక్రయిస్తున్నాడు. వాటి అమ్మకాలను పెంచుకోవడం కోసం యూట్యూబ్‌లో ఇంద్రజాలం, మహాఇంద్రజాలం పేరుతో వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నాడు.

ట్రాప్ ఇలా...

"నేను ఈ వీడియోలో చూపిస్తున్న వాటిని విక్రయించడం చట్టరీత్యా నేరం. ఈ వస్తువులు ఇంట్లో పెట్టుకుంటే సకల సిరిసంపదలు కలుగుతాయి. తక్కువ కాలంలోనే కుబేరవులతారు." శ్రీనివాసరావు తీసిన వీడియోల్లో వ్యాఖ్యానం ఇది. ఈ వీడియోలు అంతర్జాలంలో హద్దులు దాటి వెళ్లాయి. సముద్రగర్భంలో ఉండే వన్యప్రాణుల స్మగ్లింగ్ జరుగుతుందని తమిళనాడులోని రామేశ్వరంలో ఉన్న కొందరు గుర్తించారు. ఈ సమాచారాన్ని చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న వైల్డ్‌లైఫ్ జస్టిస్ కమిషన్‌కు అందజేశారు. ఈ కమిషన్ అధిపతి నీరజ్ ఆధ్వర్యంలో కొంతమంది కొద్దిరోజుల క్రితం విజయవాడకు చేరుకున్నారు. అటవీ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. అటవీ శాఖలో ఉండే విజిలెన్స్ విభాగ అధికారులు అక్షయ నిధి షాపు వద్ద రెక్కీ నిర్వహించారు. కొనుగోలుదారులుగా వెళ్లి బేరాలు మాట్లాడారు. షాపుతోపాటు గోడౌన్‌లో ఉన్న సరుకును పరిశీలించారు. వెంటనే శుక్రవారం రాత్రి శ్రీనివాసరావును అరెస్టు చేశారు. అతడిపై వన్యప్రాణుల సంరక్షణ చట్టంలోని 39, 40, 43, 44, 55 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. శనివారం కోర్టులో హాజరుపర్చగా శ్రీనివాసరావుకు రిమాండ్ విధించింది. అధికారుల విచారణలో అతడు పూర్తి వివరాలు వెల్లడించలేదు. ఈ సరుకును ఎక్కడి నుంచి తీసుకొస్తున్నావని ప్రశ్నించగా వరంగల్ జిల్లా మేడారంలో నిర్వహించిన సమ్మక్క సారక్క జాతరలో కొనుగోలు చేసినట్టు వెల్లడించాడు. దీన్ని అటవీ అధికారులు విశ్వసించడం లేదు. ఏడాదిన్నరగా ఈ వ్యాపారం చేస్తున్నట్టు వివరించాడు.



ఇదీ సీ ఫ్యాన్స్ చరిత్ర

సముద్రగర్భంలో బాగా అడుగుభాగాన అత్యంత పరిశుభ్రమైన ప్రదేశంలో పెరిగే ప్రాణులు సీ ఫ్యాన్స్. వాటి ముఖం నేలను తాకుతుంది. తల తర్వాత నుంచి పెరిగే శరీరంతా ఎదుగుతున్న మొక్కకు విస్తరించే కొమ్మల్లా ఉంటుంది. సంతానోత్పత్తిని పెంచుకుని ఉన్న ప్రదేశంలో చిన్న చిన్న కాలనీలను ఏర్పాటు చేసుకుంటాయి. సముద్రపు నీరు పరిశుభ్రంగా ఉన్న చోట, అలజడులు లేని ప్రశాంతమైన ప్రదేశంలో పెరుగుతాయి. సముద్ర మట్టానికి 20 నుంచి 30 మీటర్ల లోతులో ఉంటాయి. వీడియోలు, ఫొటోల్లో మొక్కలా కనిపిస్తాయి. వాటిని కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ 1లో చేర్చింది. అంతరించిపోతున్న జాతుల జాబితాలో ఉన్నాయి. వివిధ పరిమాణాల్లో ఉన్న సీఫాన్స్‌ను శ్రీనివాసరావు నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో సీ ఫాన్ వయస్సు 25 నుంచి 50 ఏళ్లు ఉంటుందని తెలిపారు. ఈ తరహా ప్రాణులు అండమాన్ నికోబార్ దీవులు, లక్షదీప్, రామేశ్వరం, తుత్తుకూడి, శ్రీలంక, గుజరాత్ ప్రాంతాల్లో సముద్రగర్భంలో ఉంటాయి.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న

హైకోర్టు న్యాయమూర్తి సుమతి

మోపిదేవి, జూన్ 22: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. వారికి స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ ఈవో ఎస్.ఎస్. చక్రధరరావు అందజేశారు.



నాగపుట్టలో పాలు పోస్తున్న జస్టిస్ సుమతి దంపతులు

రాజకీయ సన్యాసమా, క్షమాపణా..

కొడాలి నానీ ఏదో ఒకటి తేల్చుకో

- ఎన్నికల ముందు చేసిన సవాళ్లపై టీఎస్ఎన్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్ డిమాండ్

విద్యాధరపురం, జూన్ 22: "కుప్పంలో చంద్రబాబు గెలిచినా, జగన్మోహన్ రెడ్డిని అధికారంలో నుంచి దించినా రాజకీయ సన్యాసం చేస్తానని ఎన్నికల ముందు గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని సవాల్ చేశారు. ఇప్పుడు రాజకీయ సన్యాసం చేస్తారో? క్షమాపణలు చెబుతారో ఏదో ఒకటి తేల్చుకోవాలి." అని కొడాలి నానీ ని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్ డిమాండ్ చేశారు. గురునానక్‌కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడాలి నానీ మాట మీద నిలబడితే అతను రాజకీయ సన్యాసం చేసి రాష్ట్రం విడిచిపెట్టి పోవాలని లేదంటే బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన కొడాలి నానీకి మీడియా ముందుకు వచ్చి మాట్లాడే హక్కు, టీడీపీ హామీలపై ప్రశ్నించే హక్కు లేదన్నారు. ఏదైనా సమస్యలుంటే గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు కొడాలి నానీ, సీఎం చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్‌రెడ్డి అర్జీలు సమర్పించుకోవాలన్నారు. టీడీపీ నాయకులు తమపై దాడులు చేశారని చెప్పామని వైసీపీ వాళ్లు అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. చంద్రబాబు ఏనాడూ దాడులు చేయాలని కార్యకర్తలను ప్రోత్సహించలేదన్నారు. గతంలో జరిగిన సంఘటనలను జగన్‌రెడ్డి ఏనాడూ ఖండించలేదన్నారు. రుషికొండ ప్యాలెస్ జగన్ నివాసం ఉండేందుకు అని అప్పుడు చెప్పి, ఇప్పుడు టూరిజం గెస్ట్‌హౌస్ అని మాట మారుస్తున్నారన్నారు.

---

1 నుంచి స్టాప్ డయేరియా

రెండు నెలల పాటు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు

- పారిశుధ్యం, డ్రెయినేజీలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిపెట్టండి
- వివిధ శాఖల అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు దిశానిర్దేశం



విజయవాడ కొత్త ప్రభుత్వాస్పత్రిలో వైద్యులకు సలహాలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, జూన్ 22: "కేంద్ర, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖల మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు మూడు దశల స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాం. ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ శాఖలు సన్నద్ధమవ్వాలి. అధికారులు సమన్వయంతో పనిచేసి, అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం ద్వారా డయేరియాను సమర్థవంతంగా అడుకోవచ్చు." అని అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు దిశానిర్దేశం చేశారు. శనివారం వైద్య, ఆరోగ్యం, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, మున్సిపల్, గ్రామీణ నీటిసరఫరా అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ప్రత్యేక ప్రచార కార్యక్రమ అమలుకు ఇంటింటి సర్వే నిర్వహణ, ఐదేళ్లలోపు చిన్నారుల వివరాల సేకరణ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్ల పంపిణీపై ఆయన సూచనలు చేశారు. ప్రస్తుతం ఒకటి రెండు చోట్ల డయేరియా కేసులు నమోదవుతున్నందున క్షేత్రస్థాయిలో వివిధ శాఖల అధికారులు చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రతపై ప్రజలకు, చిన్నారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించడం, తాగునీటి పరీక్షలు చేయించడం ద్వారా తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలన్నారు. వర్షపు నీరు నిలవకుండా చూడాలని, డ్రెయినేజీ వ్యవస్థలు మెరుగుపరచాలని ఆదేశించారు. కలుషిత ఆహారం ముప్పుపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా డయేరియా కేసులు నమోదైతే వారికి సరైన వైద్యం అందించాలని ఆదేశించారు. డీఐవో డాక్టర్ అమృత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో కలెక్టర్ పరిశీలన

విజయవాడలోని కొత్త ప్రభుత్వాసపత్రిని శనివారం కలెక్టర్ దిల్లీరావు సందర్శించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. జగ్గయ్యపేటలో డయేరియా కేసులు వెలుగు చూడటం, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండటంలో భాగంగా కొత్త ప్రభుత్వాస్పత్రిలో 15 పడకలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్యాస్ట్రో ఎంటరైటిస్(జీఈ) విభాగాన్ని పరిశీలించారు. ఈ విభాగం ద్వారా రోగులకు అందే నాణ్యమైన వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్ కలెక్టర్ వెంట ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

కాచి చల్లార్చిన నీటినే తాగండి

- ప్రజలకు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ సూచన

మచిలీపట్నం, జూన్ 22(ఆంధ్రజ్యోతి): కాచి చల్లార్చిన నీటినే తాగాలని జిల్లా ప్రజలకు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. జూలై 1వతేదీ నుంచి ఆగస్టు 31వతేదీ వరకు రెండు నెలలపాటు స్టాప్ డయేరియా పేరుతో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని, వర్షాకాలంలో ప్రజలు డయేరియా బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం వైద్య విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మునిసిపల్, వివిధశాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీరు కలుషితమైతే జిల్లా ప్రజలు డయేరియా బారినపడే అవకాశమున్నందున పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుద్ధి చేయించాలన్నారు. ట్యాంకులు శుద్ధిపై జిల్లావ్యాప్తంగా పరిశీలన చేస్తానని తెలిపారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని, తరచూ శాంపిళ్లను సేకరించి బయాలజీ ఎనాలిసిస్ చేయించాలని ఆదేశించారు. పురపాలకసంఘాల్లో సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీలు, గ్రామ సచివాలయాల్లో అసిస్టెంట్ ఇంజనీర్లు పైప్‌లైన్లకున్న లీకేజీలను పరిశీలించి వాటిని అరికట్టి కమిషనర్లు, ఎంపీడీవోలతో సంతకాలు చేయించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ వాటర్ ప్లాంట్లనుతనిఖీ చేయాలన్నారు. సురక్షిత తాగునీటిని తీసుకోవడంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎం అండ్ హెచ్‌వో గీతాభాయి, డీఈవో తాహెరా సుల్తానా, డీపీవో నాగేశ్వరనాయక్, జడ్పీ సీఈవో ఆనందకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టి.శివప్రసాద్, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, తాడిగడప, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నాగాయితిప్ప సచివాలయంలో ఫర్నిచర్ మాయం

- సర్పంచ్ ఫిర్యాదుతో సచివాలయ కార్యదర్శిపై విచారణ



నాగాయితిప్పలో విచారణ నిర్వహిస్తున్న ఈవోపీఆర్డీ అశోక్‌కుమార్

మోపిదేవి, జూన్ 22: మండలంలోని నాగాయితిప్ప గ్రామ సచివాలయంలో సచివాలయ కార్యదర్శి వెంకటరమణ ఫర్నిచర్‌ను మాయం చేశాడని సర్పంచ్ గరికపాటి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం ఈవోపీఆర్డీ బి.అశోక్‌కుమార్ విచారణ జరిపారు. సచివాలయ కార్యదర్శి కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్, రికార్డులు, ఇతర మెటీరియల్‌ను మాయం చేశాడని ఇన్‌చార్జి ఎంపీడీవో రామలింగేశ్వరరావుకు సర్పంచ్ గరికపాటి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ తెలిపారు. ఈనెల 16, 17 తేదీల్లో సెలవు అయినప్పటికీ సచివాలయ కార్యదర్శి వెంకటరమణ బయట వ్యక్తులతో వచ్చి కార్యాలయంలో ఉన్న బీరువాలు, కుర్చీలు ఆడుదాం ఆంధ్రా ఆట సామగ్రి కిట్లు, పలు రికార్డులు మాయం చేసినట్లు సర్పంచ్ ఫిర్యాదు చేశారు. సెలవురోజుల్లో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారులకు సమాచారం ఇవ్వకుండా కార్యాలయం నుంచి ఇష్టానుసారంగా ఫర్నిచర్ మాయం చేయడం ఏంటని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. సచివాలయ ఉద్యోగులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే సరిపోతుందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ అనుమతి లేకుండా ఫర్నిచర్ మాయం చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీని గ్రామస్థులు కోరారు. పంచాయతీ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు, పలువురు పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

ఎంపీ కేశినేని చిన్ని అల్పాహార విందు

- హాజరైన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును సత్కరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని



మంత్రి సుభాష్‌తో ఎంపీలు చిన్ని, జీఎం హరీశ్ బాలయోగి

విద్యాధరపురం, జూన్ 22: కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతోపాటు రాష్ట్రానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలకు శనివారం ఉదయం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అల్పాహార విందు ఇచ్చారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఇండియన్ క్రికెటర్ కేఎస్ భరత్ పాల్గొన్నారు. రామ్మోహన్‌నాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి చిన్ని స్వాగతించారు. కొద్దిసేపు వారు రాజకీయాలు మాట్లాడుకున్నారు. టీడీపీ విజయానికి కృషి చేసిన వారందరికీ రామ్మోహన్‌నాయుడు అభినందనలు తెలిపారు. మాజీ మేయర్ శ్రీధర్, చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, పారిశ్రామికవేత్త కరణం మోహనరావు, కొల్లూరి రవిబాబు పాల్గొన్నారు.

ఎంపీలను కలిసిన మంత్రి సుభాష్

కార్మిక శాఖ రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం గురునానక్‌నగర్‌లోని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) నివాసానికి వెళ్లారు. చిన్నితోపాటు అక్కడే ఉన్న అమలాపురం ఎంపీ జీఎం హరీశ్ బాలయోగిని మంత్రి కలిశారు. మంత్రిని ఎంపీలిద్దరూ సత్కరించారు. పార్లమెంట్ సమావేశాలకు తొలిసారి హాజరుకాబోతున్న ఎంపీలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల విశేషాలతోపాటు కార్మిక రంగంలోని పలు అంశాలపై వారు చర్చించుకున్నారు.



మండడంలో వెనిగండ్ల రాముకు హారతి పడుతున్న రాజధాని ప్రాంత మహిళలు, రైతులు

ఎమ్మెల్యే వెనిగండ్లకు అపూర్వస్వాగతం

గుడివాడ: గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి నానిపై భారీ మెజారిటీతో విజయం సాధించిన వెనిగండ్ల రాముకు రాజధాని ప్రాంత రైతులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. అసెంబ్లీ సమావేశాలకు వెళుతూ శనివారం అమరావతిలోని మందడం గ్రామంలో వేణుగోపాలస్వామిని ఆయన దర్శించుకున్నారు. దేవస్థానం వద్ద ఎమ్మెల్యే వెనిగండ్లకు మహిళలు మంగళ హారతులు పట్టి అపూర్వస్వాగతం పలి కారు. కొడాలి నానీని అసెంబ్లీలో అడుగుపెట్టకుండా చిత్తుచిత్తుగా ఓడించిన వెనిగండ్లకు తామంతా రుణపడి ఉంటామని రైతులు పేర్కొన్నారు.

అమరావతిలో ఘంటసాల విగ్రహం ఏర్పాటు చేయాలి

విజయవాడ కల్చరల్, జూన్ 22: అమరావతిలో అమరగాయకుడు ఘంటసాల 25 అడుగుల విగ్రహాన్ని రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని, ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని కౌతా వారి కళావేదిక సమీపంలో ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఘంటసాల విగ్రహ సాధన కమిటీ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఎన్టీఆర్, ఘంటసాల వేంకటేశ్వరరావుకు భారతరత్న ప్రకటించేలా కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కృష్ణానది తీరాన ట్యాంక్‌బండ్ ఏర్పాటుచేసి తెలుగుకవులు, కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు.

ఏసీ అక్రమాలపై ముచ్చెమటలు

(ఐదో పేజీ తరువాయి)

మండపాన్ని పరిశీలించారు. కల్యాణమండపానికి సంబంధించిన వివరాలను ఈవో సుభద్రాదేవిని అడిగి తెలుసుకున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు కల్యాణ మండపాన్ని ఎందుకు స్వాధీనం చేసుకోలేదో చెప్పాలన్నారు. స్వాధీనం చేసుకోవ డానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌జేసీ కల్యాణమండపంలో పరిశీలిస్తున్న సమ యంలో మండపం నిర్వాహకులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీనిపై ఆర్‌జేసీ ప్రశ్నించగా, ఈవో బదులిస్తూ నిర్వాహకులు విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్టు తెలిపారు. అనంతరం సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

●ఆర్‌జేసీ అంటే ఏసీకి లెక్కలేదు

విచారణ నిమిత్తం ఆర్‌జేసీ సుబ్బారావు వస్తున్నారని తెలిసి కూడా ఏసీ శాంతి హాజరు కాలేదు. వెంకటేశ్వరస్వామి గుడిలో విచారణ చేస్తున్న సమయంలో ఏసీ ఎక్కడ అని సుబ్బారావు ప్రశ్నించగా, అక్కడి ఈవో మోహనరావు ఇన్‌స్పెక్టర్ అనురాధ, సూపరింటెండెంట్ శెట్టి సమాధానం చెప్పలేక తటపటాయించారు. ఆ తరువాత నాగాయలంకలో ఒక దేవస్థానానికి చెందిన భూముల తనిఖీకి వెళ్లినట్టు తెలిపారు. సుబ్బారావు వెంటనే స్పందించి అక్కడి ఈవో, గుమస్తాతో ఫోన్‌లో మాట్లాడి, ఏసీ ఉన్న లోకేషన్‌ను వాట్సాప్ ఫొటో పంపాలని ఆదేశించారు. అయితే, సాయంత్రం 6 గంటల వరకు వారి నుంచి ఎటువంటి స్పందనా లేదు. ఆ తరు వాత చల్లంరాజు సత్రంలో ఆర్‌జేసీ ఉన్నప్పుడు అక్కడికి హడావిడిగా ఏసీ శాంతి చేరుకున్నారు. అయితే, సుబ్బారావు ఆమెతో ముక్తసరిగా మాట్లాడి బయటకు వచ్చే శారు. ఆర్‌జేసీ విచారణకు వస్తున్నారని సిబ్బంది తెలిపినా ఆమె తాను హైదరా బాద్ వెళ్తున్నట్టు వారికి చెప్పారు. అయితే, ఆర్‌జేసీ లోకేషన్ పెట్టమని అడగడంతో ఆమె మార్గంమధ్య నుంచి విజయవాడ వచ్చినట్టు తెలిసింది. విచారణ నివే దికను త్వరలో ఉన్నతాధికారులకు అందిస్తానని ఆర్‌జేసీ సుబ్బారావు తెలిపారు.

పత్తికి ప్రత్యామ్నాయం

మొక్కజొన్న, సుబాబుల్ సాగు వైపు రైతుల చూపు

- మూడేళ్లుగా వరుస నష్టాలతో తగ్గనున్న పత్తి సాగు విస్తీర్ణం

కంచికచర్ల, జూన్ 22: ఎన్టీఆర్ జిల్లాలో ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది. వరుసగా మూడేళ్ల నుంచి నష్ట పోతుండటంతో పలువురు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపారు. తొలకరిలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు సుబాబుల్ సాగు చేసేందుకూ మొగ్గు చూపుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ఏటా లక్ష ఎకరాల్లో పత్తి సాగు చేస్తుంటారు. ఈ ఏడాది పత్తి సాగుకు రైతులు విముఖత చూపుతున్నారు. గత సంవత్సరం పత్తి రైతులందరూ తీవ్రంగా నష్టపోయారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఆశించిన దిగుబడులు రాలేదు. సగటున ఐదారు క్వింటాళ్లు కూడా రాలేదు. కొద్దిమంది రైతులకే పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దీనికితోడు మార్కెట్ కూడా దోబూచులాడింది. సీసీఐ కూడా చురుకుగా కొనలేదు. పండిన కొద్ది పంటకు సైతం గిట్టుబాటు ధర లభించలేదు. కూలీల కొరత అంతాఇంతా కాదు. పత్తితీత కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టం వాటిల్లింది. అంతకు ముందు రెండేళ్లు కూడా నష్టపోవటంతో రైతులు పత్తి సాగు చేసేందుకు ముందుకు రావటం లేదు. దీంతో ఈ ఏడాది నందిగామ డివిజన్ పరిధిలో పత్తి విస్తీర్ణం గణనీయంగా తగ్గుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పత్తి విత్తనాలు చురుకుగా అమ్ముడుపోవటం లేదని విత్తన డీలర్లు చెబుతున్నారు. 450 గ్రాముల బీటీ -2 పత్తి విత్తనాల ప్యాకెట్‌కు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.864, సాధారణంగా ఎంఆర్‌పీకి మించి అమ్ముతుంటారు. అలాంటిది పెద్దగా గిరాకీ లేనందున ఎనిమిది వందల నుంచి రూ.850 లోపు అమ్ముతున్నారు. పత్తి సాగు తగ్గటంతో మొక్కజొన్న విస్తీర్ణం బాగా పెరగనున్నది. ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ పంటకు కూలీలతో పెద్దగా అవసరం లేదు. పంట కోతకు యంత్రాలు వినియోగిస్తుండటం వల్ల పని సులువుగా అవుతోంది. దీంతో రైతులు మొక్కజొన్న వేస్తున్నారు. నందిగామ డివిజన్ పరిధిలో సుబాబుల్ విస్తీర్ణం కూడా క్రమేణా పెరుగుతోంది. కొద్ది నెలల నుంచి మార్కెట్లో సుబాబుల్ కర్రకు గిరాకీ పెరిగింది. గిట్టుబాటు ధర లభిస్తుండటంతో ఇప్పటికే ఎక్కువ మంది రైతులు సుబాబుల్ విత్తనాలు వేశారు.



సుబాబుల్ విత్తనాలు నాటుతున్న కూలీలు

దిల్లీరావుకు జాతీయ అవార్డు

- మాదకద్రవ్యాల నిరోధం, బాలల హక్కుల పరిరక్షణపై అత్యుత్తమ పనితీరుకు గుర్తింపు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కృష్ణలంక): మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అడ్డుకోవడం, బాలల హక్కుల పరిరక్షణలో చూపిన అత్యుత్తమ పనితీరుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావును జాతీయ అవార్డు వరించింది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్‌సీపీసీఆర్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సంయుక్త కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు బాలల హక్కుల పరిరక్షణలో ప్రత్యేక దృష్టిపెట్టిన ఆయనకు ఈ గుర్తింపు లభించింది. కలెక్టర్ దిల్లీరావుకు బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ నుంచి శనివారం సమాచారం అందింది. దీంతో ఈనెల 30న న్యూఢిల్లీలోని రాజ్‌పథ్ ఏరియా, మౌలానా ఆజాద్ రోడ్డులో గల విజ్ఞాన్ భవన్ నందు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రశంసాపత్రం, అవార్డును అందుకోనున్నారు. జిల్లా యంత్రాంగంతో పాటు పోలీస్, టాస్క్‌ఫోర్స్, చైల్డ్‌లైన్, హెల్త్‌కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ, ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్, నవజీవన్ బాలభవన్, సంయుక్త ఫౌండేషన్‌లను ఏకతాటిపైకి తీసుకొచ్చి జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిరోధంపై ప్రత్యేక ప్రణాళికను రూపొందించి, అమలు చేయడంలో, బాలల సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో పూర్తిస్థాయిలో ఆయన సఫలీకృతమయ్యారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	134, 143, 154
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.10

పశ్చిమలో అనధికార నిర్మాణాల తొలగింపు

చిట్టినగర్, జూన్ 22: పశ్చిమలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పలు నిర్మాణాలను నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు. జోజినగర్, కరెంట్ ఆఫీస్ రోడ్డుతోపాటు కామకోటినగర్ తదితర ప్రాంతాల్లో అనధికారిక నిర్మాణాలను కూల్చి వేశారు. ఆయా ప్రాంతాల్లో అనుమతి తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారని పట్టణ ప్రణాళిక విభాగానికి ఫిర్యాదులు అందటంతో స్పందించిన చీఫ్ సిటీ ప్లానర్ నిర్మాణాలను పరిశీలించారు. వాటిలో కొన్ని భవనాలకు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అనధికారికంగా పై అంతస్థులు నిర్మాణం చేపట్టడాన్ని గుర్తించిన చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్ వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ జోజినగర్, కరెంట్ ఆఫీస్ చుట్టు పక్కల అనుమతులు లేని నాలుగు భవనాల శ్లాబ్‌లను తొలగించే పనులు చేపట్టారు.

పేదల విద్యకు ప్రభుత్వ ప్రాధాన్యం

ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

భవానీపురం, జూన్ 22 : పేదల విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, దానికి అనుగుణంగా టీచర్లు బోధనపై శ్రద్ధ పెడితేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి అన్నారు. 44వ డివిజన్ లేబర్‌కాలనీ జీఎస్‌ఆర్ స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, షూలతో కూడిన కిట్లను ఆయన శనివారం అందజేశారు. స్థానిక కార్పొరేటర్ దంపతులు షైలవరపు రత్నకుమారి, దుర్గారావులు ఎమ్మెల్యే సుజనా చౌదరికి అమ్మవారి చిత్రపటం బహూకరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని జోనల్ కమిషనర్ రమ్య కీర్తన కోరగా కార్పొరేటర్ దంపతులు హాజరైనట్లు తెల్పింది. ఎంఈవో నరసింహారావు, హెచ్‌ఎం శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

చిరు సత్కారానికి నో

స్కూల్ యాజమాన్యం ఎమ్మెల్యే సుజనాను సత్కరించడానికి యత్నించగా ఆయన సున్నితంగా తిరస్కరించారు. పశ్చిమలో అధికారికంగా ప్రారంభోత్సవానికి హాజరైన సుజనా చౌదరికి టీడీపీ తెలుగు యువత పశ్చిమ ఉపాధ్యక్షుడు కుప్పిలి నాగబాబు, 44,45 డివిజన్ల జనసేన అధ్యక్షులు మల్లెపు విజయలక్ష్మి, బొమ్ము గోవిందలక్ష్మి, జనసేన నగర ప్రధాన కార్యదర్శి లింగం ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, మండల అధ్యక్షుడు పచ్చిపులుసు వెంకట శివప్రసాద్, కలపాక డూండీ, రెడ్డిపల్లి రాజు, కొత్తమాసు పిచ్చియ్య, గన్నవరపు శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

44వ డివిజన్‌లో శానిటరీ కార్యాలయం ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భవానీపురం, జూన్ 22 : 44వ డివిజన్‌లో శానిటరీ కార్యాలయాన్ని శనివారం ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి ప్రారంభించారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 20న 'నిరుపయోగంగా శానిటరీ డివిజన్ కార్యాలయం' శీర్షికన ప్రచురితమైన కథనానికి జోనల్ కమిషనర్ రమ్యకీర్తన స్పందించారు. ఈ డివిజన్‌లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే చేపట్టాలని యోచించగా, ఆమె ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి శానిటరీ కార్యాలయాన్ని ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు శనివారం ఉదయం ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుజనా కార్యాలయంను పరిశీలించారు. ఇది ఎప్పుడు నిర్మించారని స్థానిక కార్పొరేటర్ రత్నకుమారిని అడగ్గా సమాధానం చెప్పలేకపోయారు. ఎమ్మెల్యే వెంట జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, అదనపు ఎంహెచ్‌వో సురేష్‌బాబు, వీఎంసీ ఈఈ సామ్రాజ్యం, డీఈలు, ఏఈ రవీంద్ర, శానిటరీ సూపర్‌వైజర్ శివరామ్‌ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు, జనసేన డివిజన్ అధ్యక్షురాలు మల్లెపు విజయలక్ష్మి, నామన కార్తీక్, లింగం శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

అన్న సంతర్పణ

పాయకాపురం, జూన్ 22 : 61వ డివిజన్ వాంబేకాలనీ హెచ్ బ్లాక్ వద్ద గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సంతాన వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముందుగా స్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్న సంతర్పణలో పాల్గొని భక్తులకు భోజనం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన చిట్టినగర్



హోమాలు చేస్తున్న అర్చకులు

చిట్టినగర్, జూన్ 22: చిట్టినగర్ పరిసర ప్రాంతమంతా గోవింద నామ స్మరణతో మార్మోగింది. స్థానిక పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వర స్వామి దేవస్థానం త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రత్నమాచార్యులు, శ్రీనువాసుల గోపాల్ స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కల్యాణ మండపంలో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, భేరిపూజ, నవకుంబ స్థాపన, ధ్వజారోహణ, సంతానార్థులకు గరుడ ప్రసాదం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం నిత్యం, బలిహరణాదులు, అష్టాక్షరీ హోమం, నవగ్రహ ఆరాధన హోమం, రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రూ. 58 వేల నగదు స్వాధీనం

వన్‌టౌన్, జూన్ 22: విద్యాధరపురం కరెంట్ ఆఫీసు రోడ్డులోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. దాడిలో 12 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద లభించిన రూ.58 వేలు స్వాధీనం చేసుకుని భవానీపురం పోలీసులకు అప్పగించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అరెస్టయిన వారంతా స్థానికులేనని పోలీసులు తెలిపారు.





ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ

కోదండ రామాలయం నూతన కమిటీ ప్రమాణస్వీకారం

రాణిగారితోట, జూన్ 22: రాణిగారితోటలోని కోదండ రామాలయం నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం శనివారం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా రాయి రంగమ్మ, ప్రధాన కార్యదర్శిగా కొమీరి శ్రీను, కోశాధికారి బత్తుల బాలయ్య, గౌరవ అధ్యక్షులుగా బలగాని శ్రీను, వేముల దుర్గారావు, పగడాల వెంకటేశ్వర్ రెడ్డి, డప్పుకొట్టు వెంకటేశ్వరరావు, కొప్పుల శ్రీనివాస్, కుందూరు బుడ్డారెడ్డి, ఉపాధ్యక్షులుగా పసుపులేటి నీలకంఠం, పిండిమర చెన్నయ్య, సహాయ కార్యదర్శులుగా చింతలపూడి తిరుపతిరెడ్డి, గండ్ర వెంకటేశ్వర్లుతో పాటు 16మందితో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు రాయి రంగమ్మ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులందరి సహకారంతో ముందుకు వెళతానని తెలిపారు.

హామీ మేరకు ఎమ్మెల్సీ ఇవ్వండి

● రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నేత పేరం

ధర్నాచౌక్, జూన్ 22: తమ పార్టీకి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నేత పేరం శివ నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. తమ పార్టీ రాష్ట్ర నాయకుడు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలన్నారు. కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి, బెజవాడ సాంబయ్య, ఆర్.ఎస్.యు. ప్రకాష్, ఫణీంద్రకుమార్ జవ్వాజి, యర్నేని కిరణ్, శ్రీనివాస్, వి.ముత్తయ్య పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 22 : తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం పైపులరోడ్డు ప్రాంతానికి చెందిన పఠాన్ హుస్సేన్ బాషా ఈనెల 18న కుటుంబ సభ్యులతో కలసి నంద్యాలలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి శనివారం రాగా తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి లోపలకి వెళ్లాడు. ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉండటం, బీరువా తలుపులు తెరిచి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఇంట్లో ఉండాల్సిన రూ. 1.50 లక్షలు, రూ. 1.80 లక్షలు విలువగల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారం పంపిణీ



మాట్లాడుతున్న ప్రోగ్రాం మేనేజర్ కిరణ్

పాతరాజరాజేశ్వరి పేట, జూన్ 22 : నవజీవన్ బాలభవన్ విజయవాడ ఆధ్వర్యంలో పెజ్జోని పేటలోని నీతోడు మానసిక వికాస కేంద్రంలో శనివారం హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎయిడ్స్ నివారణా సంస్థ ప్రోగ్రాం మేనేజర్ పి. కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉచితంగా నిజ నిర్ధారణ పరీక్షలు చేసి మందులను అందిస్తారని చెప్పారు. నవజీవన్ బాలభవన్ ప్రతి నెలా హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారాన్ని అందజేయడం చాలా గొప్ప విషయం అన్నారు. అనంతరం పౌష్టికాహారాన్ని అందజేశారు. డాక్టర్ వి. గౌతమ్ అంబేడ్కర్, జిల్లా కౌన్సిలర్ ఎం. బాస్కరరావు, నవజీవన్ బాలభవన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఫాదర్ అంతయ్య, ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు, బి. గాయత్రి, సైకాలజిస్టు జి. అనూష, కో-ఆర్డినేటర్లు కె. ప్రియాంక, కె. శ్రావణ్ పాల్గొన్నారు.

టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణకు కొత్త బ్యాచ్‌లు

గవర్నర్‌పేట, జూన్ 22: ఎంజీ రోడ్డులోని ఎంబీవీకే భవన్‌లో మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణకు జూలై ఒకటి నుంచి కొత్త బ్యాచ్‌లు ప్రారంభం కానున్నట్లు ఎంబీవీకే మహిళా శిక్షణ విభాగం బాధ్యులు పి. విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 30లోగా రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీవీకే భవన్ ఆఫీసులో సంప్రదించాలని కోరారు.

26 నుంచి ఇన్నర్ ఇంజనీరింగ్ యోగా తరగతులు

లబ్బీపేట, జూన్ 22: ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి జూలై 2 వరకు ఇన్నర్ ఇంజనీరింగ్ యోగా తరగతులు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తెలుగు బోధనలో జరిగే ఈ తరగతులు ఎంజీ రోడ్డులోని తనిష్క్ జ్యూయలరీ బిల్డింగ్ 2వ అంతస్థులోని ఈశా యోగా సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



మాచవరం, జూన్ 22 : విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలని వాసవీ క్లబ్ ఆఫ్ పెరల్స్ ఇంటర్నేషనల్ సభ్యులు చందా శ్రీధర్, చారుకొండ రమేష్‌బాబులు అన్నారు. క్లబ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాచవరంలోని వాణీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు 300 విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. స్కూల్ డైరెక్టర్ అంజూరు శేషుబాబు, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం

వన్‌టౌన్, జూన్ 22: కృష్ణానదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. సమాచారం మేరకు కనకదుర్గ ఫ్లై ఓవర్ సమీపంలో నదీతీరం వద్దకు పోలీసులు చేరుకుని పరిశీలించారు. మృతుడికి సుమారు 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

పీపుల్స్ మ్యాక్ సొసైటీ వార్షికోత్సవం

మొగల్రాజపురం, జూన్ 22: మహిళల ఆర్థిక స్వావలంబన, అభివృద్ధి కోసం పీపుల్స్ మ్యాక్ సొసైటీ పని చేస్తోందని ఛైర్మన్ ఆలమండ ఎల్లారావు చెప్పారు. సొసైటీ 11వ వార్షికోత్సవం పీజీ సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సొసైటీ ద్వారా పొదుపు సంఘాలకు కోట్ల రూపాయలను రుణాలుగా ఇచ్చామని చెప్పారు. రాబోయే రోజుల్లో లక్షమంది మహిళలకు రుణాలు ఇవ్వాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ఖాతాలు ఫోన్ ద్వారా తెరుచుకునే నిమిత్తం పీపుల్స్ కనెక్ట్ అనే యాప్‌ను రూపొందించామని చెప్పారు. సొసైటీ కోశాధికారి ఎ. జ్యోత్స్న మహిళల కోసం ప్రారంభించిన పథకాలను వివరించారు. పాపులర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్, జీవీ సాంబశివరావు, సొసైటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో దూరవిద్య కోర్సులు



గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) దూరవిద్య విభాగం- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఈ కోర్సులను ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో నిర్వహిస్తారు.

డిగ్రీ: బీఏ, బీకాం, బీబీఏ ప్రోగ్రామ్‌ల వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

బీఏ సబ్జెక్టులు: ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్

బీకాం సబ్జెక్టులు: జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్

● బీబీఏ, బీఎల్ఐఎస్సీ, బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. బీఏ(ఎకనామిక్స్, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం(జనరల్) కోర్సులను తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో చదువుకోవచ్చు. మిగిలిన బీఏ కోర్సులు తెలుగు మాధ్యమంలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ/ఇంటర్ ఒకేషనల్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎల్ఐఎస్సీ కోర్సుకు మాత్రం ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

పీజీ: ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సుల వ్యవధి రెండేళ్లు. మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్.

ఎంకాం స్పెషలైజేషన్‌లు: అకౌంటెన్సీ, బ్యాంకింగ్

● ఎంఏ కోర్సుల్లో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లను ఆ మాధ్యమంలోనే చదవాలి. ఎంఏ(ఎకనామిక్స్/హిస్టరీ/పొలిటికల్ సైన్స్/సోషియాలజీ) కోర్సులు తెలుగు మాధ్యమంలో ఉన్నాయి. మిగిలిన కోర్సులను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి.

అర్హత: ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సులకు ఏదేని డిగ్రీ; ఎంఏ(ఎకనామిక్స్)కు బీఏ(ఎకనామిక్స్); ఎంకాం కోర్సుకు బీకాం/బీబీఏ; ఎంఎల్ఐఎస్సీ కోర్సుకు బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏలో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

డిప్లొమా: ఈ కోర్సుల్లో ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫుడ్ ప్రొడక్షన్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, సైకలాజికల్ గైడెన్స్ కోర్సుకు ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్సులు: హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్, హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్ కోర్సులు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి. హౌస్ కీపింగ్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, ఎయిడ్స్ కౌన్సెలింగ్‌కు ఇంటర్(పారామెడికల్)తోపాటు ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.anucde.info

దిక్సూచి DIKSUCHI

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MQRZNeDలో చదవండి.

విశాఖ ఐఐపీఈలో బీటెక్

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ తోపాటు డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి క్యాట్ స్కోర్ లేకుండానే ఐఐఎం విశాఖపట్నంలో ఎంబీఏ చదివే వీలుంది.

విభాగాలు-సీట్లు: పెట్రోలియం ఇంజనీరింగ్‌లో 62 సీట్లు, కెమికల్ ఇంజనీరింగ్‌లో 63 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 40 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 65 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **అకడమిక్ సెషన్ ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** iipe.ac.in

ఓయూలో లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. సాయంత్రం సమయాల్లో ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000.

అర్హత: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐ&ఎంఎల్ స్పెషలైజేషన్‌కు ఏ విభాగంవారైనా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఈ/ఏఐ/ఏఐడీ/ఏఐఎం /సీఎంఈ/సీఎస్‌బీ/సీఎస్‌సీ/సీఎస్‌డీ/సీఎస్‌జీ/సీఎస్ఐ/సీఎస్ఎం/సీఎస్ఎన్/సీఎస్ఓ/సీఎస్‌టీ/సీఎస్‌డబ్ల్యూ/సీఐసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వుడ్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం ఏడాది ఫుల్ టైమ్ ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 11
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 18
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 21
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 27
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 3
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

విజువల్‌గా.. మ్యూజికల్‌గా...



నాగచైతన్య, సాయి పల్లవి జంటగా రూపుదిద్దుకుంటున్న 'తండేల్' చిత్రం వైజాగ్, శ్రీకాకుళం షెడ్యూల్ శనివారంతో పూర్తయింది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. ఈ షెడ్యూల్‌లో హీరోహీరోయిన్లతో పాటు ఇతర నటీనటులు పాల్గొనగా కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. పాత్రల గెటప్, కాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్, యాస ప్రామాణికంగా ఉండేలా దర్శకుడు చందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాస్తవ సంఘటనల ప్రేరణతో ఓ ప్రేమ కథగా 'తండేల్' ను భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. విజువల్‌గా, మ్యూజికల్‌గా ఎంతో అద్భుతంగా ఉండేలా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవి శ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: షామ్‌దత్, ఎడిటింగ్: నవీన్ నూలి.

రామానుజుల గొప్పతనం చెప్పే కథ



డా. సాయి వెంకట్ టైటిల్ రోల్‌లో నటించి.. దర్శకత్వం వహించిన సినిమా 'జయహో రామానుజ'. జో శర్మ, సుమన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా వస్తున్న ఈ సినిమా ఫస్ట్ పార్ట్ జూలై 12న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'జయహో రామానుజ' సినిమా పాటలను చిత్ర బృందం శనివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు, హీరో సాయి వెంకట్ మాట్లాడుతూ 'మహిళల్ని గౌరవించాలని.. కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో మానవాళి కలసి ఉండాలని సందేశాన్ని ఇచ్చిన గొప్ప గురువు భగవత్ శ్రీ రామానుజాచార్యులు. ఆయన గొప్పదనం ఈ తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందించాను' అని చెప్పారు. నిర్మాత ప్రవల్లిక మాట్లాడుతూ 'భారీ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మించిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్, దర్శకుడు వీరశంకర్ పాల్గొన్నారు.

ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ



హాస్య నటుడు అలీ ఫ్యామిలీ నుంచి వచ్చిన సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. పి.ఎల్. విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గోదావరి అందాలు, నేచురల్ లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ చిత్రంలోని 'కలలో .. కలలో' అంటూ సాగే గీతాన్ని సంగీత దర్శకుడు కోటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ పాట చూస్తుంటే చక్కని అనుభూతి కలుగుతోంది. సాహిత్యం, సంగీతం, హీరోహీరోయిన్ల అభినయం చక్కగా కుదిరాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే పాట అవుతుంది' అన్నారు. 'ఇది ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానం అందంగా చూపించే ప్రయత్నం చేశాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల చేస్తాం' అని తెలిపారు దర్శకనిర్మాతలు. సునీల్ రావినూతల, పృథ్వీ, సాయికుమార్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో...



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది. ఈ సినిమాలోని ఓ పాటకు 'వార్', 'పఠాన్' సినిమాల ఫేమ్.. ప్రముఖ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిస్ నృత్యరీతుల్ని సమకూరుస్తున్నారు. థాయిలాండ్‌లో ప్రస్తుతం ఆ పాట షూటింగ్ జరుగుతోంది. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌తో తీసుకున్న ఫొటోను ఆయన షేర్ చేస్తూ.. "అత్యద్భుతమైన ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో పనిచేయడం ఎంతో ఆనందాన్నిస్తోంది" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

కల్కి ప్రత్యేక షో, టికెట్ ధరల పెంపునకు అనుమతి



ప్రభాస్ హీరోగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం ప్రత్యేక ప్రదర్శన, టికెట్ ధరల పెంపునకు అనుమతినిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈనెల 27వ తేదీన చిత్రం విడుదల కానుంది. జూలై 4వ తేదీ దాకా 8 రోజుల పాటు ప్రతీరోజూ ఐదు షోలు ప్రదర్శించటానికి అవకాశం ఇచ్చారు. విడుదల రోజు ఉదయం 5:30 గంటలకు ప్రత్యేక ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ రోజు మొత్తం ఆరు షోలు ప్రదర్శించనున్నారు. ఇక టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ.200లకు పెంచుకోవడానికి అనుమతించారు. సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న టికెట్ ధరపై రూ.75, మల్టీప్లెక్స్‌లలో రూ.100 అదనంగా పెంచుకోవడానికి అనుమతిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జితేందర్ శనివారం మెమోనెం.23424/జనరల్.ఏ1/2024ను జారీ చేశారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

లక్కు..నీ వెంట ...



'నా పేరు శివ', 'అంధగారం' వంటి చిత్రాల్లో నటించిన వినోద్ కిషన్ ప్రస్తుతం 'పేక మేడలు' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. అనూష కృష్ణ హీరోయిన్. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రే నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం భార్గవ్ కార్తీక్ రాసిన 'లక్కు నీ వెంట కుక్క తోక లెక్క ఊపుకుంటూ వచ్చరో లచ్చన్న' అంటూ సాగే పాటను విడుదల చేశారు. నాగూర్ బాబు ఈ పాట పాడారు. స్మరణ్ సాయి సంగీత దర్శకుడు. ఈ సినిమాను జులైలో విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు.



ప్రతి అంతం మరొక ఆరంభానికి నాంది అవుతుంది. ఆ ఆరంభానికి అడ్డుపడే శక్తులు ఎప్పుడూ ఉంటాయి. వాటిని జయించినప్పుడే నవ్య యుగం ప్రారంభమవుతుంది. 'కల్కి' సినిమా కథాంశమిదే.



మూడు లోకాలు.. మూడు కాలాలు..

అదీ 'కల్కి'

"గంగ మానవజాతికి జీవాధారం. కలియుగం అంతంలో గంగ ఎండిపోతుంది.. అప్పుడు ఈ భూమిపై ఉన్న అతి పురాతన నగరం- కాశీ ఎలా ఉంటుంది? మన సంస్కృతి కాశీ నుంచే ప్రారంభమయిందనేది ఒక భావన. అలాంటి కాశీ మరో వెయ్యి ఏళ్ల తర్వాత ఎలా ఉంటుంది? ఆ సమయంలో ఆర్థిక కార్యకలాపాలు ఎలా జరుగుతాయి? ఆ సమయంలో వాహనాలు ఎలా ఉంటాయి? ప్రజల జీవన విధానం ఎలా ఉంటుంది? వీటిని దృష్టిలో పెట్టుకొని కాశీని ఈ సినిమాలో నిర్మించారు. ఆ కాశీపై ఒక పిరమిడ్‌లా ఉండే భవిష్యత్ నగరం- కాంప్లెక్స్. మన భూమిపై ఏమి ఉండవో.. అవన్నీ ఈ కాంప్లెక్స్‌లో లభిస్తాయి. కాశీలో గంగ ఎండిపోయి కనిపిస్తుంది. కానీ కాంప్లెక్స్‌లో ఆహ్లాదకరమైన సముద్రం ఉంటుంది. ఒక విధంగా చూస్తే- ఇది ఒక స్వర్గం. ఈ భూమిపై ఉండే త్రిశంకు స్వర్గం. ఈ రెండూ కాకుండా - మరో ప్రపంచం కూడా 'కల్కి'లో కనిపిస్తుంది. దీని పేరు శాంబాలా. దీనిలో నివసించే వారు మనకు భిన్నమైన వారు. వీరికి దేవుడు ఉండడు. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే- దేవుణ్ణి ఆ లోకం నుంచి బహిష్కరిస్తారు. కాంప్లెక్స్‌లో నివసించేవారికి, శాంబాలాలో వారికి మధ్య నిరంతరం పోరాటం జరుగుతూ ఉంటుంది. కల్కి శాంబాలాలో జన్మిస్తాడని అందరూ నమ్ముతూ ఉంటారు.

అశ్వత్థామ: మహాభారతంలోని ప్రధానమైన పాత్రల్లో అశ్వత్థామ ఒకరు. 'కల్కి' సినిమాలో ఈ పాత్ర ను అమితాబ్ పోషించారు. భారతంలో అశ్వత్థామ చిరంజీవి.. మహావీరుడు. అతడికి మరణం ఉండదు. దుర్యోధనుడికి మిత్రుడు. కౌరవుల తరఫున పోరాడాడు. ఇప్పటి దాకా విడుదలయిన రెండు ట్రైలర్స్ ఆధారంగా చూస్తే- 'కల్కి'ని పెంచటంలోను, అతణ్ణి ఒక ప్రతిభావంతుడైన యోధుడిగా తీర్చిదిద్దటంలోను అమితాబ్‌దే ప్రధాన పాత్ర అనిపిస్తుంది. అయితే అందరూ అభిమానించే పురాణపాత్రలు ఈ చిత్రంలో కనిపించవు" అంటారు నాగ్ అశ్విన్. 'అపరిమితయిన శక్తితో పుట్టిన ఒక వ్యక్తికి తన అధికారాన్ని ఏం చేసుకోవాలో తెలియదు. ఆ సమయంలో అతనికి ఒక గురువు దొరుకుతాడు..ఈ చిత్రంలో ఇదొక ముఖ్యమైన అంశం..." అంటారాయన.

కలి: ఒక నాయకుడి శక్తి అతను పోరాడే ప్రతినాయకుడి శక్తి కన్నా ఎక్కువగా ఉండాలి. అప్పుడే అతను నాయకుడు అవుతాడు. ఈ సినిమాలో కమల్‌హాసన్ ప్రతినాయక పాత్ర కూడా ఇలాంటిదే! శంబాలాలోని అతి శక్తిమంతుడైన వ్యక్తి అయిన 'కలి'గా కమల్ ఇప్పటికే ప్రేక్షకుల ప్రశంసలు పొందుతున్నారు. నాగ్ అశ్విన్ తొలిసారి కలిసి కథ చెప్పిన తర్వాత... కమల్ ఈ పాత్ర ఎలా ఉంటే బావుంటుందనే విషయంపై చాలా అధ్యయనం చేశారట. "ఆ పాత్రకు ఎలాంటి దుస్తులు వేసుకోవాలి? ఎలాంటి మేకప్ ఉంటే బావుంటుంది? అనే విషయంపై నాగీకి కొన్ని రిఫరెన్స్‌లు పంపాను. కానీ వాటిని అప్పటికే అమితాబ్‌కు ఉపయోగిస్తున్నారని ఆ తర్వాత తెలిసింది" అంటారు కమల్. ఈ సినిమాలో మరో ముఖ్య పాత్ర దీపికది. ఈ ప్రపంచాన్ని కాపాడే వీరుడికి జన్మనిచ్చే పాత్ర ఆమెది. ఇక ఈ చిత్రంలో ప్రధానమైన పాత్ర ప్రభాస్‌ది! ఎప్పుడైతే ఈ ప్రపంచం క్రమం తప్పుతుందో., అలాంటి సమయంలో ప్రపంచాన్ని కాపాడటానికి వస్తానని విష్ణువు చెప్పిన మాటల ఆధారంగా పుట్టిన అవతారమే కల్కి. దశావతారాల తర్వాత వచ్చే అవతారం. అయితే ఇప్పటి దాకా బయటకు వెలువడిన ట్రైలర్స్, ఇతర పబ్లిసిటీ మెటీరియల్ ఆధారంగా చూస్తే- కల్కి తన అందమైన కలలో గుర్రంపైనే వెళ్తుంటాడు. కానీ అతనికి తోడుగా ఉండేది మాత్రం అత్యాధునికమైన 'బుజ్జి'. ఇంకో రెండు వేల ఏళ్ల తర్వాత ఎలాంటి వాహనాలు ఉండచ్చు? అనే విషయానికి ప్రతీక ఈ బుజ్జి. ఇక హీరో కల్కికి ప్రేమికురాలిగా దిశా పటానీ, మరో ముఖ్యమైన పాత్రలో శోభన కనిపిస్తున్నారు. ఇప్పటిదాకా ఈ చిత్రం గురించి మనకు తెలిసింది అతి తక్కువే! ఇంకా ఈ సినిమాలోని అనేక పాత్రల కోసం మరో నాలుగు రోజులు వేచి చూడాల్సిందే!




వ్యక్తిగతంగాను.. వృత్తిపరంగాను ఈ సినిమా ఒక అద్భుతమైన ప్రయాణమని చెప్పుకోవాలి. ఈ సినిమా ద్వారా నేను ఎంతో నేర్చుకున్నాను. ఈ సినిమాలో ఉన్నది ఇప్పటి దాకా మనమెప్పుడూ చూడని అద్భుత ప్రపంచం. మీలాగే నేను కూడా సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా? అని ఎదురుచూస్తున్నా.

- దీపిక పదుకొనే



ఈ సినిమా ఒక కల కన్నా పెద్దది. అంతకన్నా నేను ఎక్కువగా ఏమి చెప్పలేను..

- ప్రభాస్



మన ఊహకు కూడా అందని ఒక అద్భుతమైన సినిమాలో పనిచేసినందుకు చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్తులో ఎలా ఉంటుందనే ఊహాకు ప్రతిరూపం ఈ చిత్రం. ఇలాంటి ఒక ఊహ వచ్చినందుకు నాగినీ అభినందించాల్సిందే!

- అమితాబ్ బచ్చన్



ఒక విలన్ పాత్రలో నటించాలని చాలా కాలంగా అనుకుంటున్నా.. ఎందుకంటే ఒక సినిమాలో ఉంటే మంచి విషయాలన్నీ విలన్‌కే దక్కుతాయి.. హీరోలు డ్యూయెట్స్ పాడుతూ, హీరోయిన్ల కోసం వేచి చూస్తూ ఉంటారు.. కానీ విలన్ తను ఏమనుకుంటాడో అది చేయగలుగుతాడు

- కమల్ హాసన్



5 గంటల్లోనే

'భైరవ ఏంథమ్' పూర్తైపోయింది

'కల్కి'- ప్రస్తుతం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా. దీని నుంచి తాజాగా విడుదలయిన - "భైరవ ఏంథమ్" దేశవ్యాప్తంగా దుమ్మురేపుతోంది. ప్రముఖ పంజాబీ గాయకుడు దిల్‌వీర్, హీరో ప్రభాస్ నటించిన ఈ గీతానికి **పోని ప్రకాష్‌రాజ్** కొరియోగ్రాఫర్‌గా వ్యవహరించారు. పంజాబీ గెటప్‌లో ప్రభాస్ కనిపించిన ఈ గీతపు కొరియోగ్రఫీ విశేషాలను పోనీ - 'నవ్య'తో పంచుకున్నారు.



"ఈ పాట చేసినందుకు చాలా సంతృప్తిగా ఉంది. దాదాపు ఎనిమిదేళ్ల నుంచి నేను ఎక్కువగా ప్రాజెక్టులు చేయటం లేదు. అలాంటి నాకు'కల్కి'లో ఈ పాటకు కొరియోగ్రఫీ చేసే అవకాశం రావటం ఒక అదృష్టమనే చెప్పాలి. ప్రస్తుతం ఈ పాట దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోంది. ప్రతి కొరియోగ్రాఫర్ ఇలాంటి పాట కోసం ఎదురుచూస్తూ ఉంటారు. 'కల్కి' కోసం ఒక చిన్న సాయం చేసిపెట్టమని నిర్మాత స్వప్న అడిగింది. సెట్స్‌కు వెళ్లాను. అదంతా వేరే ప్రపంచంలా అనిపించింది. "ఇలాంటి చిన్న పనుల కోసం నన్ను పిలవకు.. పెద్ద పని కోసం పిలువు" అని స్వప్నతో సరదాగా అన్నాను. అంతకుముందు ఆమెతో 'అన్నీ మంచి శకునములే...' కూడా పనిచేశాను. ఒక రోజు స్వప్న హఠాత్తుగా ఫోన్ చేసి "ప్రభాస్‌తో ఒక సాంగ్ ఉంది.. చేస్తావా?" అని అడిగింది. నాకు ఒక క్షణం ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. నేను హైదరాబాద్‌లో స్థిరపడిన పంజాబీని. పంజాబీ నృత్యం స్వాభావికంగా నాలో ఉంటుంది. ఇక ప్రభాస్- మన దేశంలోనే అతి పెద్ద స్టార్. ఈ రెండింటినీ ఒక చోట కలిపే అవకాశం రావటం చాలా అరుదైన విషయం. ముందు నేను నమ్మలేదు. చాలా హడావిడిగా అన్నీ జరిగిపోయాయి.

కళ్ల ముందు ప్రభాస్!

నేను మొదటిసారి ఆ పాట విన్నప్పుడు- ప్రభాస్ నాకు పూర్తి స్థాయి పంజాబీ డ్రెస్‌లో కళ్ల ముందు కనిపించాడు. 'ఇంత అందంగా ఉన్నాడేంటి?' అనుకున్నా. నేను ఈ విషయం అందరికీ చెప్పినప్పుడు అందరు నమ్మలేని నిజాన్ని చూసినట్లు అనిపించారు. దిల్‌జిత్ ఉత్తరాది రాష్ట్రాలకు, పంజాబీ సంస్కృతికి ప్రతీక. ఇక ప్రభాస్ దక్షిణ భారతదేశానికి ప్రతీక. వీరిద్దరూ కలిస్తే- ఆ ఆలోచనే అందరితోను ఉత్సుకత రేకెత్తించింది. నేను ఈ విషయం ప్రభాస్‌కు చెప్పినప్పుడు ముందు అంత ఆసక్తి చూపించలేదు. "నన్ను నమ్మండి. ఒక్క ఛాన్స్ ఇవ్వండి. రిజల్ట్ చూసి మీరే ఆశ్చర్యపోతారు" అని ప్రభాస్‌తో చెప్పా. "ఆర్ యూ ష్యూర్?' అన్నారు. అనుకున్నట్లే- ప్రభాస్ సెట్ మీదకు పూర్తి పంజాబీ దుస్తులతో వచ్చినప్పుడు- సెట్‌లో ఉన్నవారందరూ చప్పట్లు కొట్టి, గట్టిగా అరవటం మొదలుపెట్టారు. వారి రెస్పాన్స్‌ను చూసి నాకే మతిపోయింది. దిల్‌జిత్, ప్రభాస్‌లకు నేను కొరియోగ్రాఫర్‌గా 'వన్, టూ, త్రీ' అంటూ కౌంటింగ్ ఇవ్వాలి. కానీ వారిద్దరిని చూస్తూ నేను కౌంటింగ్ ఇవ్వటం కూడా మరచిపోయాను. సెట్‌లో విపరీతమైన ఎనర్జీ వచ్చేసింది. నేను 'డర్టీ పిక్చర్‌లో... విద్యాబాలన్‌తో 'ఊలాల.. ఊలాల...' పాటకు కొరియోగ్రఫీ చేస్తున్నప్పుడు ఇలాంటి ఉత్సుకత వచ్చింది. ఇంతకాలం తర్వాత మళ్లీ ఈ పాటకు వచ్చింది.

స్టెప్స్ తక్కువే!

దిల్‌జిత్‌కు, ప్రభాస్‌కు ఈ పాటలో కష్టమైన స్టెప్స్ పెట్టలేదు. దిల్‌జిత్ పెర్‌ఫార్మర్. డ్యాన్సర్ కాదు. అదే విధంగా ప్రభాస్‌కు ఉన్న ఇమేజ్ వేరు. తను డ్యాన్స్ చేయాల్సిన అవసరం లేదు. కేవలం నడిస్తే చాలు. వారిద్దరి మధ్య ఒక కెమిస్ట్రీ వచ్చేలా కొన్ని మూమెంట్స్‌ను డిజైన్ చేశాను. వారిద్దరూ మన దేశంలోని రెండు భిన్నమైన సంస్కృతులకు చెందిన పురుషులకు ప్రతీకలు. అంతేకాకుండా ఈ పాట మరో లుంగీ డ్యాన్స్ కావటం నాకు ఇష్టం లేదు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. నా జీవితంలో ఇంతత్వరగా ఏ పాటను కొరియోగ్రఫీ చేయలేదు. మొత్తం పాటను కేవలం ఐదు గంటల్లో పూర్తి చేశాం. స్వప్న, ప్రియాంక, కెమేరామేన్ అల్బేష్, ప్రొడక్షన్ టీమ్ చాలా కష్టపడి పనిచేశారు. ఒక రోజు రిహార్సల్స్ చేశాం అంతే! ఈ పాట పూర్తయిపోయి, బయటకు వెళ్లి... సంచలనాలు క్రియేట్ చేస్తోందంటే నమ్మలేకపోతున్నా.

• సీవీఎల్ఎన్ ప్రసాద్





అలనాటి కథ

ఆ రోజుల్లో...

ఒకప్పుడు మన దేశంలో ముఖ్యమంత్రులకు చాలా గౌరవం ఉండేది. వారి సిఫార్సులను విదేశాలలో కూడా గౌరవంగా చూసేవారు. ఇక ప్రధానులకు సాహితీకారులంటే విపరీతమైన గౌరవం ఉండేది. ఒక దేశ ప్రధాని- ఒక విదేశీభాషకు సంబంధించిన లైబ్రరీ శంకుస్థాపన కార్యక్రమానికి రావటం ఇప్పుడు సాధ్యమవుతుందా? ఒకప్పుడు అది కూడా సాధ్యమే! నేటి పరిస్థితులను.. రాజకీయనాయకులను గమనిస్తుంటే- నాకు మారిషస్‌లో నా తొలి విదేశీ పర్యటన గుర్తుకువచ్చింది.



నాకు 26 ఏళ్ల ఉన్నప్పుడు నా తొలి విదేశీ పర్యటనకు వెళ్లా! అది కూడా తెలుగు రచయిత బృందానికి నాయకురాలిగా. మారిషస్‌లో తెలుగు వారి కోసం ఒక లైబ్రరీ నిర్మించాలనుకున్నారు. ఈ లైబ్రరీ శంకుస్థాపనా కార్యక్రమానికి తెలుగువారికి ప్రాతినిధ్యం వహిస్తూ ఒక బృందాన్ని పంపాలనుకున్నారు. నా పేరు ఎవరు ప్రతిపాదించారో తెలియదు కానీ.. శేషేంద్ర, పోతుకూచి సాంబశివరావు, నేను ఒక బృందంగా మారిషస్‌కు బయలుదేరాం. నాకు అక్కడ ఎవరు ఉంటారో తెలియదు. అక్కడ ఏం మాట్లాడాలో తెలియదు. ఎందుకైనా మంచిదని అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డిని ఒక ఉత్తరం ఇవ్వమని అడిగాను. ఆయన అక్కడి ప్రధానికి నన్ను పరిచయం చేస్తూ ఒక ఉత్తరం ఇచ్చారు. విమాన ప్రయాణం బాగా జరిగింది. మారిషస్ రాజధానికి చేరుకున్నాం. అక్కడ ప్రభుత్వం తరఫున ఆతిధ్యం ఇచ్చేవారు- నాకు ఒక చోట వసతి ఏర్పాటు చేశారు. శేషేంద్ర, ఇతరులకు వేరే చోట విడిది ఇచ్చారు. అందమైన పూలతోట.. సమీపంలోనే నదీతీరం.. నాకు వసతి ఏర్పాటు చేసిన ప్రాంతం స్వర్గంలా అనిపించింది.

ఉదయాన్నే లేచి బ్రేక్‌ఫాస్ట్ చేసి రిలాక్స్ అవుతున్న సమయంలో- ప్రధాని మంత్రి సీవూసగర్ అపాయింట్‌మెంట్ ఒక గంటలో ఉందనే కబురు వచ్చింది. వెంటనే మేము తయారయి ప్రధాని కార్యాలయానికి వెళ్లాం. అక్కడికి వెళ్లిన వెంటనే- ప్రధాని సెక్రటరీ డాక్టర్ హజారేసింగ్ మమల్ని రిసీవ్ చేసుకున్నారు. పిచ్చాపాటి మాట్లాడిన తర్వాత ప్రధాని కార్యాలయంలోకి మమల్ని తీసుకువెళ్లారు. ప్రధాని మాకు స్వాగతం చెప్పారు. ఆయనకు బ్రహ్మానందరెడ్డి రాసిన ఉత్తరాన్ని, కొన్ని పుస్తకాలను ఇచ్చాను. ఆ తర్వాత మేము లైబ్రరీకి శంకుస్థాపన చేస్తున్నామని చెప్పాం. మా ఆలోచనలు ఆయనతో పంచుకున్నాం. శంకుస్థాపన కార్యక్రమానికి రమ్మని ఆహ్వానించాం. ఒక దేశ ప్రధానిని- శంకుస్థాపన కార్యక్రమానికి రమ్మని అడగటమే ఒక సాహసం. అది కూడా ఎటువంటి ముందస్తు అపాయింట్‌మెంట్ లేకుండా. నాకు ఆయన వస్తాడనే నమ్మకం ఏ కోశాన లేదు. కానీ వెంటనే



ఆయన తన ప్రైవేట్ సెక్రటరీని పిలిచి- ఆ రోజు అపాయింట్‌మెంట్స్ ఏమిటో తెలుసుకున్నారు. అన్నింటినీ క్యాన్సిల్ చేయమని మా కార్యక్రమానికి వస్తానన్నారు. ఇప్పటికీ ఆ సంఘటన గురించి ఆలోచిస్తూ ఉంటే- అది నిజమా? కలా? అనే విషయం అర్థం కాదు. ఒక దేశ ప్రధాని దగ్గరకు ఎటువంటి అపాయింట్‌మెంట్ లేకుండా వెళ్లి- ఆయనను ఒక ప్రైవేట్ ఫంక్షన్‌కు పిలవటం ఇప్పుడు ఏ విధంగాను సాధ్యం కాదు. ఆ సమయంలో సాహిత్యకారుల పట్ల.. కళాకారుల పట్ల నాయకులకు అంత గౌరవం ఉండేది.

ఆ రోజు కార్యక్రమానికి ప్రధానితో పాటుగా ఆ దేశంలోని అనేక మంది కళాకారులు, సాహితీకారులు, భాషాభిమానులు హాజరయ్యారు. అంత మంది ముందు నేను ఒక ఉపన్యాసం ఇవ్వాల్సి వచ్చింది. ఒకప్పుడు మారిషస్‌లో ఎక్కువగా ఫ్రెంచ్ మాట్లాడేవారు. ఇంగ్లీషు తక్కువగా మాట్లాడేవారు. నాకు ఫ్రెంచ్ మాట్లాడటం అస్సలు రాదు. పైగా అంత మంది పెద్దల ముందు నా తొలి ప్రసంగం! నా పరిస్థితి ఎలా ఉండి ఉంటుందో అర్థం చేసుకోండి. మొత్తానికి నా ప్రసంగం బాగానే సాగింది. అందరూ ఆసక్తిగా విన్నారు. ఆ మర్నాడు నన్ను అనేక మంది సాహితీకారులకు పరిచయం చేశారు. ఈ పర్యటనలో నాకు బాగా గుర్తున్న మరొక సంఘటన- ప్రముఖ కవి మార్సల్ కాబాన్, ఆయన భార్య మేడమ్ డి కెవిరన్‌లను కలవటం. ఒక అందమైన చిన్న కొండ మీద ఉన్న వారి ఇంటికి హజారేసింగ్ నన్ను తీసుకువెళ్లారు. అక్కడ కెవిరన్ మాకు ఆతిధ్యం ఇవ్వటంతో పాటుగా 'అప్సర' అనే ఫ్రెంచ్ దీర్ఘకవితను వినిపించారు. ఇప్పటికీ ఆమె మృదువైన కంఠం, చదివే విధానం అన్నీ జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/49R9nXb లో చదవండి.

కలిసికట్టుగా కదం తొక్కగా..

టీ20 వరల్డ్‌కప్

బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం

సెమీస్ బెర్త్ దాదాపు ఖాయం



హార్దిక్ పాండ్యా (50 నాటౌట్)



కుల్దీప్ (3/19)

నార్త్ సౌండ్: టీ20 వరల్డ్‌కప్‌లో భారత్ అజేయ ఆటతీరు కొనసాగుతోంది. అటు బ్యాటింగ్.. ఇటు బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చడంతో శనివారం గ్రూప్ 1లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 50 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. టోర్నీలో జట్టుకిది వరుసగా ఐదో విజయం కాగా.. సూపర్-8లో రెండోది. దీంతో తమ గ్రూప్‌లో 4 పాయింట్లతో టాప్‌లో నిలవడంతో పాటు సెమీఫైనల్ బెర్త్‌ను కూడా దాదాపు ఖాయం చేసుకుంది. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు అఫ్ఘాన్‌పై గెలిస్తే భారత్‌తో పాటు ఆసీస్ కూడా సెమీస్ చేరుతుంది. ఇక రెండు ఓటములతో ఉన్న బంగ్లాదేశ్ సాంకేతికంగా టోర్నీలోనే ఉన్నా ముందుకెళ్లడం అసాధ్యమే. మ్యాచ్‌లో ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 196 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 50 నాటౌట్), కోహ్లీ (28 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 37), పంత్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 36), దూబే (24 బంతుల్లో 3 సిక్సర్లతో 34) కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. తన్‌జీమ్, రిషాద్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులు చేసి ఓడింది. షంటో (40), తన్‌జీద్ (29), రిషాద్ (24) మాత్రమే రాణించారు. కుల్దీప్‌నకు మూడు.. బుమ్రా, అర్ష్‌దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హార్దిక్ పాండ్యా నిలిచాడు.

పోరాటమే లేదు..: భారీ ఛేదనలో బంగ్లా బ్యాటర్లను భారత్ బౌలర్లు సమర్థవంతంగా అడ్డుకున్నారు. ముఖ్యంగా స్పిన్నర్ కుల్దీప్ మధ్య ఓవర్లలో తడాఖా చూపించడంతో మిడిలార్డర్ కుదేలైంది. ఓపెనర్లు లిట్టన్ (13), తన్‌జీద్ ఓ మాదిరి ఆటతీరుతో తొలి వికెట్‌కు 35 పరుగులు జోడించారు. ఐదో ఓవర్‌లో లిట్టన్‌ను హార్దిక్ అవుట్ చేశాడు. కానీ కుల్దీప్ తన వరుస ఓవర్లలో తన్‌జీద్, తౌహీద్ (4), షకీబ్ (11) వికెట్లను తీయడంతో 98/4తో బంగ్లా ఆట పూర్తిగా లయ తప్పింది. ఆ తర్వాత మిగతా బ్యాటర్లు కూడా ప్రభావం చూపలేకపోయారు. 19వ ఓవర్‌లో రిషాద్‌ను బుమ్రా అవుట్ చేయడంతో బంగ్లాకు భారీ ఓటమి తప్పలేదు.

సమష్టిగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌లో ఈసారి బ్యాటింగ్ విభాగం అదరగొట్టింది. సూర్య మినహా క్రీజులోకి వచ్చిన ప్రతీ ఆటగాడు బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు 200 చేరువకు వచ్చింది. విఫలమవుతున్న విరాట్, దూబే సైతం ఆకట్టుకోగా.. హార్దిక్ ధనాధన్ ఆటతో అజేయ హాఫ్ సెంచరీతో నిలిచాడు. ఆరంభంలోనే ఓపెనర్లు రోహిత్ (23), విరాట్ జోరును చూపారు. నాలుగో ఓవర్‌లోనూ రోహిత్ 6,4తో ధాటిని ప్రదర్శించినా షకీబ్ వేసిన ఫుల్లర్ బంతికి క్యాచ్ అవుటయ్యాడు. దీంతో తొలి వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తాజా టోర్నీలో ఈ వికెట్‌కు భారత్ నుంచి ఇదే అత్యధికం కావడం గమనార్హం. అటు ముస్తాఫిజుర్ ఓవర్‌లో కోహ్లీ సిక్సర్‌తో పవర్‌ప్లేలో జట్టు 53/1 స్కోరు సాధించింది. ఇక వచ్చీ రాగానే సిక్సర్ బాదిన సూర్యకుమార్ (6)ను తన్‌జీమ్ పెవిలియన్ చేర్చాడు. పంత్ మాత్రం తన ధాటిని కొనసాగించినా, ఆ తర్వాత స్పిన్నర్ రిషాద్‌కు చిక్కడంతో నాలుగో వికెట్‌కు దూబేతో 31 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో హార్దిక్ దూకుడుతో తిరిగి స్కోరు గాడిన పడింది. ఇక ఆరంభంలో నిదానంగా ఆడిన దూబే తర్వాత భారీ సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. కానీ ఎక్కువ సేపు క్రీజులో నిలువకుండా రిషాద్ ఓవర్‌లో బౌల్డయ్యాడు. అప్పటికే ఐదో వికెట్‌కు వీరి మధ్య 34 బంతుల్లోనే 53 పరుగులు జత చేరాయి. అటు ఆఖరి ఓవర్‌లో పాండ్యా ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. చివరి ఐదు ఓవర్లలో జట్టు 62 రన్స్ సాధించడం విశేషం.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) జాకర్ (బి) షకీబల్ 23, కోహ్లీ (బి) తన్‌జీమ్ 37, పంత్ (సి) తన్‌జీమ్ (బి) రిషాద్ 36, సూర్యకుమార్ (సి) లిట్టన్ (బి) తన్‌జీమ్ 6, దూబే (బి) రిషాద్ 34, హార్దిక్ (నాటౌట్) 50, అక్షర్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 196/5; వికెట్ల పతనం:** 1-39, 2-71, 3-77, 4-108, 5-161; **బౌలింగ్:** మెహిదీ హసన్ 4-0-28-0, షకీబల్ 3-0-37-1, తన్‌జీమ్ 4-0-32-2, ముస్తాఫిజుర్ 4-0-48-0, రిషాద్ 3-0-43-2, మహ్మదుల్లా 2-0-8-0.

బంగ్లాదేశ్: లిట్టన్ (సి) సూర్య (బి) హార్దిక్ 13, తన్‌జిద్ (ఎల్బీ) కుల్దీప్ 29, షంటో (సి) అర్ష్‌దీప్ (బి) బుమ్రా 40, హ్రిదయ్ (ఎల్బీ) కుల్దీప్ 4, షకీబల్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 11, మహ్మదుల్లా (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 13, జాకర్ అలీ (సి) కోహ్లీ (బి) అర్ష్‌దీప్ 1, రిషాద్ (సి) రోహిత్ (బి) బుమ్రా 24, మెహిదీ హసన్ (నాటౌట్) 5, తన్‌జీమ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 146/8; వికెట్ల పతనం:** 1-35, 2-66, 3-76, 4-98, 4-109, 6-110, 7-138, 8-145; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-30-2, బుమ్రా 4-0-13-2, అక్షర్ పటేల్ 2-0-26-0, హార్దిక్ 3-0-32-1, జడేజా 3-0-24-0, కుల్దీప్ యాదవ్ 4-0-19-3.

పాయింట్ల పట్టిక — గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	2	2	0	0	4	2.425
ఆస్ట్రేలియా	1	1	0	0	2	2.471
అఫ్ఘాన్	1	0	1	0	0	-2.350
బంగ్లాదేశ్	2	0	2	0	0	-2.489

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

టీ20 ప్రపంచకప్‌లో 50 వికెట్లు పూర్తి చేసిన తొలిబౌలర్‌గా షకీబ్

1

వరల్డ్‌కప్‌ల్లో (టీ20, వన్డే) 3వేల పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా విరాట్

ఈ మైదానంలో జరిగిన టీ20ల్లో ఇదే అత్యధిక స్కోరు (196)

టీ20 వరల్డ్‌కప్ చరిత్రలోని ఓ మ్యాచ్‌లో ఎక్కువ సిక్సర్లు (13) బాదిన జట్టుగా భారత్.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

అఫ్ఘానిస్థాన్ x ఆస్ట్రేలియా (ఉ.6. గం.)

ఇంగ్లండ్ x అమెరికా (రా.8. గం.)

హోప్ ఫటాఫట్

- చేజ్ మ్యాజిక్
- 9 వికెట్లతో విండీస్ విక్టరీ
- అమెరికా నాకౌట్ ఆశలు గల్లంతు?



షాయ్ హోప్ (39 బంతుల్లో 82 నాటౌట్)



రోస్టన్ చేజ్ (3/19)

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): ఇంగ్లండ్ చేతిలో కంగు తిన్న వెస్టిండీస్.. టీ20 వరల్డ్‌కప్‌లో బలంగా పుంజుకొంది. రోస్టన్ చేజ్ (3/19) తిప్పేయగా.. ఓపెనర్ షాయ్ హోప్ (39 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్స్‌లతో 82 నాటౌట్) ధనాధన్ అర్ధ శతకంతో సెమీస్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. సూపర్-8లో భాగంగా గ్రూప్-2లో శనివారం జరిగిన మ్యాచ్‌లో విండీస్ 9 వికెట్ల తేడాతో అమెరికాను చిత్తు చేసింది. హోప్ భారీ షాట్లతో చెలరేగిపోతుంటే.. అతడిని ఎలా కట్టడి చేయాలో యూఎస్ కెప్టెన్ ఆరోన్ జోన్స్‌కు పాలుపోలేదు. ఈ విజయంతో రన్‌రేట్‌ను భారీగా మెరుగుపరచుకొన్న విండీస్.. గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. మరోవైపు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన యూఎస్ నాకౌట్ ఆశలు దాదాపుగా ముగిసినట్టే..! టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన అమెరికా 19.5 ఓవర్లలో 128 పరుగులకే కుప్పకూలింది. ఆండ్రిస్ గౌస్ (29), నితీష్ కుమార్ (20) టాప్ స్కోరర్లు. ధాటిగా ఆడుతున్న ఆండ్రిస్‌ను అల్జారీ జోసెఫ్ అవుట్ చేయగా.. ఆ తర్వాత 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' చేజ్ తన మాయాజాలాన్ని ప్రదర్శించాడు. పవర్‌హిట్టర్ ఆరోన్ జోన్స్ (11)ను బౌల్డ్ చేసిన రోస్టన్.. కోరె అండర్సన్ (7), హర్మీత్ సింగ్ (0)ను పెవిలియన్ చేర్చి అమెరికా బ్యాటింగ్ వెన్నువిరిచాడు. రస్సెల్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని వెస్టిండీస్ 10.5 ఓవర్లలో 130/1 స్కోరు చేసి సునాయాసంగా నెగ్గింది. తొలి వికెట్‌కు చార్లెస్ (15)తో కలసి 67 పరుగులు జోడించిన హోప్.. ఆ తర్వాత పూరన్ (27 నాటౌట్)తో రెండో వికెట్‌కు అభేద్యంగా 23 బంతుల్లో 63 రన్స్ జోడించాడు. దీంతో విండీస్ మరో 55 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది.

సంక్షిప్త స్కోర్లు

అమెరికా: 19.5 ఓవర్లలో 128 ఆలౌట్ (ఆండ్రిస్ 29, నితీష్ 20; చేజ్ 3/19, రస్సెల్ 3/31, జోసెఫ్ 2/31).
వెస్టిండీస్: 10.5 ఓవర్లలో 130/1 (హోప్ 82 నాటౌట్, పూరన్ 27 నాటౌట్; హర్మీత్ 1/18).

పాయింట్ల పట్టిక — గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
సౌతాఫ్రికా	2	2	0	0	4	0.625
వెస్టిండీస్	2	1	1	0	2	1.814
ఇంగ్లండ్	2	1	1	0	2	0.412
అమెరికా	2	0	2	0	0	-2.908

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

భారత్ X దక్షిణాఫ్రికా మహిళల మూడో వన్డే
మ.1.30 నుంచి జియో సినిమా, టీవీ 18లో



సురేఖ జట్టుకు హ్యాట్రిక్ స్వర్ణం

అంటాల్యా (టర్కీ): ఫామ్‌లో ఉన్న భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు వరల్డ్‌కప్‌లో 'హ్యాట్రిక్' స్వర్ణంతో అరుదైన ఘనతను అందుకొంది. శనివారం జరిగిన వరల్డ్‌కప్ స్టేజ్-3 టీమ్ ఫైనల్లో జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌ల త్రయం 232-229తో ఎస్తోనియాను ఓడించింది. షాంఘైలో జరిగిన స్టేజ్-1, యెచియాన్‌లో జరిగిన స్టేజ్-2లో కూడా పసిడి పతకాలు సాధించిన కాంపౌండ్ జట్టు.. వరుసగా స్టేజ్-3లో స్వర్ణ కాంతులీనింది. పురుషుల వ్యక్తిగత ఈవెంట్ ఫైనల్లో 148-149తో స్లూపెర్ (నెదర్లాండ్స్) చేతిలో ఓడిన ప్రియాన్ష్ రజతంతో సరిపెట్టుకొన్నాడు. కాగా, ఆదివారం జరిగే రికర్వ్ విభాగంలో భారత్ మూడు స్వర్ణాల కోసం తలపడనుంది. వ్యక్తిగత, మిక్స్‌డ్‌లో ధీరజ్ బొమ్మదేవర.. మహిళల ఈవెంట్‌లో అంకిత భక్త్ ఫైనల్లో ఆడనున్నారు.

నాకౌట్‌కు పోర్చుగల్

యూరో చాంపియన్‌షిప్



సిల్వా

డార్ట్‌మండ్ (జర్మనీ): యూరో చాంపియన్‌షిప్‌లో క్రిస్టియానో రొనాల్డో సారథ్యంలోని పోర్చుగల్ జట్టు నాకౌట్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-ఎఫ్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 3-0తో తుర్కియేను చిత్తుచేసింది. పోర్చుగల్ జట్టులో సిల్వా (21వ), అకేడిన్ (28వ), ఫెర్నాండెజ్ (56వ) తలో గోల్ సాధించారు. తన గ్రూపులో వరుసగా రెండు విజయాలు నమోదుచేసిన పోర్చుగల్ 6 పాయింట్లతో నాకౌట్‌కు అర్హత సాధించింది. ఇక, ఫ్రాన్స్-నెదర్లాండ్స్ గ్రూపు దశ బ్లాక్‌బస్టర్ పోరు 0-0తో డ్రాగా ముగిసింది. గ్రూప్ 'డి'లో అత్యంత బలమైన ఈ రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ సాకర్ ఫ్యాన్స్‌కు మస్తు మజా పంచింది. ఫ్రాన్స్-నెదర్లాండ్స్ నువ్వా..నేనా..అనేలా తలపడడంతో ఒక్క గోల్ కూడా నమోదు కాకుండానే పోరు ముగియడం విశేషం. అయితే 69వ నిమిషంలో డచ్ మిడ్‌ఫీల్డర్ సిమోన్స్ గోల్ కొట్టినా..రెఫరీ 'ఆఫ్‌సైడ్'గా ప్రకటించాడు. గ్రూప్ 'ఎఫ్'లో చెక్ రిపబ్లిక్-జార్జియా మ్యాచ్ 1-1తో డ్రా అయ్యింది.

నగాల్‌కు ఒలింపిక్ బెర్త్



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగాల్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌లో తలపడడం నగాల్‌కిది రెండోసారి. గతంలో టోక్యో ఒలింపిక్స్‌లో సింగిల్స్‌లో ఆడిన అతను రెండో రౌండ్‌లో మెద్వెదెవ్ చేతిలో ఓడిపోయాడు. ఇక, ఇటీవలి అద్భుత ప్రదర్శనతో నగాల్ ర్యాంకింగ్స్‌లోనూ 71వ స్థానానికి ఎగబాకడంతో విశ్వక్రీడలకు బెర్త్ దక్కించుకున్నాడు.

బిజినెస్



సంపన్నులు మకాం మార్చేస్తున్నారు..

హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ నివేదిక వెల్లడి

ఈ ఏడాది 4,300 మంది భారత మిలియనీర్లు ఇతర దేశాలకు వలస పోవచ్చని అంచనా

న్యూఢిల్లీ: భారత సంపన్నులు అధిక సంఖ్యలో వలసపోతున్నారని హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ తాజా నివేదిక వెల్లడించింది. గత ఏడాదిలో 5,100 మంది భారత మిలియనీర్లు (కనీసం రూ.8.3 కోట్ల సంపద కలిగిన వారు) ఇతర దేశాల్లో స్థిరపడగా.. 2024లో మరో 4,300 మంది ధనికులు తమ మకాం మార్చేయవచ్చని నివేదిక అంచనా వేసింది. అధిక శాతం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో స్థిరపడేందుకు మొగ్గుచూపుతున్నారని నివేదిక పేర్కొంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- మిలియనీర్ల వలసల విషయంలో చైనా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది.
- సంపన్నుల వలసలతో యూఏఈ అధికంగా లబ్ధిపొందనుంది. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 1.28 లక్షల మంది సంపన్నులు ఇతర దేశాల్లో స్థిరపడవచ్చని.. అందులో 6,800 మంది మిలియనీర్లు యూఏఈకి వలసపోవచ్చని అంచనా. అమెరికా, సింగపూర్ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.
- 2013-23 మధ్యకాలంలో యూఏఈకి భారత సంపన్నుల వలసలు 85% పెరిగాయి.
- సంపన్నుల వలసలకు భద్రత, పన్ను ప్రయోజనాలు, ఆర్థిక కారణాలు కారణమని నివేదిక పేర్కొంది.

దేశీయ వాహన కంపెనీల ఈ-రష్!





బడా ఎస్‌యూవీల ఎలక్ట్రిఫికేషన్‌పై దృష్టి

వచ్చే 6-8 నెలల్లో మార్కెట్లోకి పలు కొత్త మోడళ్ల విడుదల

ఎలక్ట్రిక్ కార్ల (ఈవీ) విభాగంలోనూ పోటీ వేడెక్కుతోంది. మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ, వోల్వో వంటి అంతర్జాతీయ లగ్జరీ కార్ల బ్రాండ్లను మినహాయిస్తే, దేశీయ మార్కెట్లో అధికంగా హ్యాచ్‌బ్యాక్, కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడళ్లలోనే ఎలక్ట్రిక్ వెర్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఈ విషయంలో మరో మెట్టెక్కేందుకు వాహన సంస్థలు మిడ్‌సైజ్, బడా ఎస్‌యూవీ మోడళ్లలోనూ ఈ-వెర్షన్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం), హ్యుండయ్, కియా, మారుతి సుజుకీ, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ వచ్చే 6-8 నెలల్లో పలు ఈ-ఎస్‌యూవీలను మార్కెట్లో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి.

టాటాదే హవా



నెక్సాన్, పంచ్, టియాగో, టిగోర్ ఈవీ వెర్షన్లతో దేశీయ ఎలక్ట్రిక్ కార్ల విభాగంలో దాదాపు 70 శాతం మార్కెట్ వాటాను చేజిక్కించుకున్న టాటా మోటార్స్ తన ఈ-పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించనుంది. ఇందులో భాగంగా ఎస్‌యూవీ హారియర్‌లోనూ ఈవీ వెర్షన్‌ను ప్రవేశపెట్టేందుకు సంస్థ సిద్ధమవుతోంది. సంప్రదాయ ఇంధన ఇంజన్‌తో కూడిన హారియర్ ఎక్స్‌షోరూమ్ కనీస ధర రూ.17 లక్షల స్థాయిలో ఉంది. హారియర్ ఈవీ రేటు ప్రారంభ రేటు రూ.22-25 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. కాగా, టాటా మోటార్స్ త్వరలో విడుదల చేయనున్న క్రాసోవర్ వెహికిల్ 'కర్వ్'లో సంప్రదాయ ఇంజన్ వేరియంట్లతో పాటు ఈవీ వెర్షన్‌ను సైతం అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిసింది.

మార్చి నాటికి హ్యుండయ్ క్రెటా

హ్యుండయ్ మోటార్ ఇండియా తన బెస్ట్ సెల్లింగ్ మోడళ్లలో ఒకటైన క్రెటాలో ఎలక్ట్రిక్ వేరియంట్‌ను వచ్చే మార్చి నాటికి మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. ఇప్పటికే 'ఈవీ 6' మోడల్‌ను దేశీయ మార్కెట్లో విక్రయిస్తోన్న కియా.. త్వరలో 'ఈవీ 9'ను లాంచ్ చేయనుంది. దీని ధర రూ.కోటి స్థాయిలో ఉండవచ్చని అంచనా. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ప్రస్తుతం జెడ్‌ఎస్, కోమెట్ ఈవీలను అందుబాటులోకి తెచ్చింది. క్లౌడ్ పేరుతో ఎలక్ట్రిక్ క్రాసోవర్ యుటిలిటీ వెహికిల్‌ను త్వరలో విడుదల చేయనుంది. దాని ధర రూ.20 లక్షల స్థాయిలో ఉండే అవకాశం ఉంది.

మహీంద్రా ఎక్స్‌యూవీ 700 ఈవీ

మరో దేశీయ వాహన తయారీ సంస్థ మహీంద్రా తన ఎస్‌యూవీ మోడల్ 'ఎక్స్‌యూవీ 700'లో ఈ-వెర్షన్‌ను లాంచ్ చేసేందుకు సిద్ధమవుతోంది. దీని ధరను రూ.20 లక్షల లోపే నిర్ణయించే అవకాశం ఉంది. ఆ తర్వాత కంపెనీ బోర్న్ ఎలక్ట్రిక్ మోడల్ 'బీఈ 05'ను మార్కెట్లోకి ప్రవేశపెట్టనుంది. దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా సైతం ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈవీఎక్స్ కాన్సెప్ట్ ఆధారిత ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడల్‌ను కంపెనీ వచ్చే ఏడాది తొలినాళ్లలో జరగబోయే ఆటో ఎక్స్‌పోలో ఆవిష్కరించనుంది. దాని ధరను రూ.10-15 లక్షల స్థాయిలో నిర్ణయించే అవకాశముంది. అంతర్జాతీయ లగ్జరీ కార్ల బ్రాండ్ల విషయానికొస్తే, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ ఇప్పటికే పలు ఎలక్ట్రిక్ వెర్షన్లను దేశీయ మార్కెట్లోకి ప్రవేశపెట్టాయి. ఎలక్ట్రిఫికేషన్‌లో ఈ రెండు కంపెనీలు మిగతా లగ్జరీ బ్రాండ్ల కంటే ముందున్నాయి. భారత్‌లో ఈక్యూ ఎస్ లగ్జరీ సెలూన్, ఈక్యూ బీ, ఈక్యూ ఈ ఎలక్ట్రిక్ మోడళ్లను విక్రయిస్తోన్న బెంజ్.. ఈ ఆగస్టులో ఈక్యూ ఏ మోడల్‌ను ప్రవేశపెట్టనుంది.

విత్తన ఉత్పత్తిలోకి సంగం డెయిరీ

- త్వరలో మిర్యాలగూడ ప్లాంట్ ప్రారంభం

పొన్నూరు టౌన్: సంగం డెయిరీ.. విత్తన ఉత్పత్తి విభాగంలోకి అడుగు పెట్టింది. పాడి రైతుల అవసరాలతో పాటు రైతుల అవసరాలు తీర్చే ఉద్దేశంతో ఈ రంగంలోకి ప్రవేశించినట్లు సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎంఎల్ఏ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. శనివారం నాడిక్కడ డెయిరీ పాలక వర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారులకు మెరుగైన పశుగ్రాస జొన్న విత్తనాలు అందించే లక్ష్యంతో విత్తన లైసెన్స్ ఒప్పందాలు చేసుకున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే మార్కెట్లో డిమాండ్ ఉన్న సీఎస్‌హెచ్ 43 ఎంఎఫ్ జన్యు విత్తనాల లైసెన్స్ సరఫరా కోసం ఢిల్లీకి చెందిన అగ్రి ఇన్నోవేటివ్ ఇండియా లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే పశువుల రక్త నమూనాలు, వీర్య నమూనాలను పరీక్షించేందుకు లేబోరేటరీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా తెలంగాణలోని మిర్యాలగూడలో లక్షన్నర లీటర్ల ప్రాసెసింగ్ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ప్లాంట్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు.

విశాఖలో మోగ్లిక్స్ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బీ2బీ ఈ-కామర్స్ సంస్థ మోగ్లిక్స్.. కార్యకలాపాలు విస్తరించేందుకు రెడీ అవుతోంది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మోగ్లిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ గోయల్ వెల్లడించారు. రూ.10 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ సెంటర్ వచ్చే ఏడాది కాలంలో కార్యకలాపాలు ప్రారంభించనుందని చెప్పారు. పారిశ్రామిక సంస్థలు, ఎంఎస్ఎంఈలకు అవసరమైన ఉత్పత్తులను కంపెనీ సరఫరా చేస్తోంది. సంస్థ ఇప్పటికే హైదరాబాద్, నోయిడాలో రెండు టెక్నాలజీ హబ్‌లను నిర్వహిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా కంపెనీకి ఎంఎస్ఎంఈ విభాగంలో 5 లక్షల మంది, 700 బడా పారిశ్రామిక సంస్థలు తమ క్లయింట్లుగా ఉన్నాయని గోయల్ చెప్పారు. ప్రధానంగా ఆటోమొబైల్, ఫార్మా, ఎఫ్ఎంసీజీ విభాగంలోని సంస్థలు ప్రధాన క్లయింట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. మోగ్లిక్స్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 40కి పైగా ప్రాంతాల్లో 40 కార్యాలయాలను నిర్వహిస్తోందని చెప్పారు. కంపెనీలో 2,000 మంది ఉద్యోగులుండగా వచ్చే ఏడాది కాలంలో 500 మంది ఉద్యోగులను నియమించుకోనున్నట్లు గోయల్ తెలిపారు.

అమర రాజా ఎనర్జీకి గ్రేట్ ప్లేస్ టు వర్క్ అవార్డు

రేణిగుంట: అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ఈ అండ్ ఎం).. 2024 సంవత్సరానికి గాను గ్రేట్ ప్లేస్ టు వర్క్ అవార్డును గెలుచుకుంది. ది గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇనిస్టిట్యూట్ 2024 సంవత్సరానికి గాను నిర్వహించిన అధ్యయనం ప్రకారం భారత్‌లో పని చేసేందుకు అత్యుత్తమ కంపెనీల జాబితాలో 68వ ర్యాంకింగ్‌ను దక్కించుకున్నట్లు అమర రాజా ఎనర్జీ తెలిపింది. అలాగే ఆటో, ఆటో కాంపోనెంట్స్ పరిశ్రమలో కూడా బెస్ట్ వర్క్‌ప్లేస్‌గా నిలిచినట్లు పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,380 ▼	66,350 ▼	96,500 ▼
ముంబై	72,746 ▲	66,635 ▲	90,666 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ

హైదరాబాద్	515	విజయవాడ	510
వరంగల్	517	గోదావరి	510
చిత్తూరు	573	విశాఖపట్నం	520

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	119	విజయవాడ	130
వరంగల్	119	గుంటూరు	130
కరీంనగర్	119	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	144
కర్నూలు	119	నెల్లూరు	144
విశాఖపట్నం	136	అనంతపురం	130
గోదావరి	130		

లే అవుట్లలోని ప్లాట్లకు జీఎస్‌టీ వర్తిస్తుందా..?

ఇదీ GST



రాంబాబు గొండాల

నిర్మాణ రంగానికి సంబంధించి జీఎస్‌టీ గురించి చూసుకుంటే.. మొదట్లో నివాసిత అపార్ట్‌మెంట్స్ (రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్) అమ్మకానికి పన్ను 12 శాతం ఉండేది. 2019లో దీన్ని 5 శాతానికి తగ్గించారు. అయితే వాణిజ్య పరిధిలోకి వచ్చే కమర్షియల్ అపార్ట్‌మెంట్స్‌కు మాత్రం పన్ను శాతంలో కానీ, ఇన్‌పుట్ విషయంలో కానీ ఎలాంటి మార్పు చేయలేదు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే కంప్లీషన్ సర్టిఫికెట్ జారీ చేసిన తర్వాత అమ్మే అపార్ట్‌మెంట్లకు ఎలాంటి జీఎస్‌టీ వర్తించదు. ఇది అన్ని రకాల అపార్ట్‌మెంట్లకు వర్తిస్తుంది. వివరంగా చెప్పాలంటే, జీఎస్‌టీ చట్టంలోని నిర్వచనాల ప్రకారం.. అపార్ట్‌మెంట్లకు సంబంధించి ఒక ప్రాజెక్ట్ మొదలు పెట్టినప్పటి నుంచి ప్రాజెక్ట్ పూర్తయి కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే వరకు జరిపే అమ్మకాలను 'సర్వీస్' కింద భావిస్తారు. కాబట్టి వీటి మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, అపార్ట్‌మెంట్‌కు విస్తృత నిర్వచనం ఇవ్వటం జరిగింది. దీని ప్రకారం ఫ్లాట్, విల్లా, షాప్, గోడౌన్, షెడ్, ఆఫీస్, షోరూమ్ ఇలా నివాసానికి, వాణిజ్య అవసరాలకు సరిపడే వివిధ రకాల నిర్మాణాలను 'అపార్ట్‌మెంట్' కింద పరిగణిస్తారు.

నిజానికి, ఈ రంగానికి సంబంధించిన వివిధ నిర్వచనాలను అంటే 'ప్రమోటర్', 'అపార్ట్‌మెంట్', 'రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్' మొదలైన వాటిని రెరా చట్టం నుంచి తీసుకోవటం జరిగింది. అయితే రెరా చట్టం ప్రకారం ప్రమోటర్, రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ అనే నిర్వచనం కేవలం నిర్మాణ రంగానికే కాకుండా ఖాళీ లేదా వ్యవసాయ భూములను ప్లాట్లుగా అంటే 'లే అవుట్స్' గా అభివృద్ధి చేయటానికి కూడా వర్తిస్తుంది. దీంతో ఒక ప్రమోటర్ కొంత స్థలాన్ని లే అవుట్‌గా డెవలప్ చేసి అందులోని స్థలాలను అమ్మటం అనేది జీఎస్‌టీ వర్తించే అంశం అని ఒక వాదన. కానీ, జీఎస్‌టీ చట్టం ప్రకారం పొలాలు, స్థలాలు అంటే ల్యాండ్ అమ్మకం అనేది జీఎస్‌టీలోకి వచ్చే అంశం కాదు. కాబట్టి ఇదే మినహాయింపు లే అవుట్ ప్లాట్లకు కూడా వర్తిస్తుందని ఇంకో ఆలోచన. అయితే, మామూలు స్థలాలను లే అవుట్ ప్లాట్లతో పోల్చకూడదు. ఒక లే అవుట్‌లో డెవలప్‌మెంట్ జరిగే దశలో ప్లాట్లు అమ్మటం అనేది కంప్లీషన్ సర్టిఫికెట్ రాకముందు అపార్ట్‌మెంట్స్‌ను అమ్మటంతో సమానం. ఎందుకంటే ఇందులో కేవలం స్థలం మాత్రమే కాకుండా రోడ్లు, కాలువలు, పార్క్ మొదలగు వాటితో కూడిన డెవలప్‌మెంట్ అనే అంశం ముడిపడి ఉంది. ప్రమోటర్ కేవలం స్థలానికే కాకుండా డెవలప్‌మెంట్‌కు కూడా కలిపి డబ్బులు తీసుకుంటాడు. కాబట్టి ఇది కూడా సర్వీస్ కింద భావిస్తూ తగిన జీఎస్‌టీ చెల్లించాలనే మరొక వాదన ఏర్పడింది.

ఈ గందరగోళాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ రంగానికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలు విడుదల చేయటం జరిగింది. దీని ప్రకారం, ఏదేనీ ఒక లే అవుట్‌లో అమ్మే స్థలాలకు ఎటువంటి జీఎస్‌టీ వర్తించదు. అంటే లే అవుట్ డెవలప్‌మెంట్ జరిగే దశలో కావచ్చు లేదా పూర్తయిన తర్వాత కావచ్చు. ఎప్పుడు అమ్మినా అట్టి ప్లాట్ల మీద ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. ఇదే సమయంలో మరొక వివరణ ఇవ్వటం జరిగింది. లే అవుట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఎవరికైనా కాంట్రాక్ట్ ఇస్తే అంటే భూమి చదును చేయటం, అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణం లేదా పార్క్ ఏర్పాటు మొదలైన పనులను ఎవరికైనా కాంట్రాక్ట్ ఇస్తే, సదరు కాంట్రాక్టర్ ఆ మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అంతేకానీ, ప్లాట్ కొనుగోలుదారుడు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. కాబట్టి ప్రమోటర్, కొనుగోలుదారులు, కాంట్రాక్టర్లు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవటం అత్యంత ఆవశ్యకం.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

సభాపతిగా అయ్యన్న

(మొదటి పేజీ తరువాయి)


సభకు నమస్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అధికారికంగా ప్రకటించారు. అనంతరం, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్‌లు అయ్యన్నపాత్రుడిని స్పీకర్ స్థానం వద్దకు తోడ్కొని వెళ్లారు. అయ్యన్నపాత్రుడు తన స్థానాన్ని అలంకరించారు. అయితే.. స్పీకర్ బాధ్యతలు చేపట్టే సమయంలో సభ సంప్రదాయాల ప్రకారం ప్రతిపక్షం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని సభాపతికి గౌరవ సూచకంగా ఆయన స్థానం వరకు సాగనంపాలి. కానీ, వైసీపీ నాయకులు ఒక్కరు కూడా శనివారం సభకు హాజరుకాలేదు. ముఖ్యంగా ఆ పార్టీ అధినేత, ఎమ్మెల్యే జగన్ సైతం ఈ సంప్రదాయాన్ని విస్మరించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా, నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన అయ్యన్న పాత్రుడు టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్నారు. 16 ఏళ్ల మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా పదేళ్లపాటు పార్టీకి సేవలందించారు. ఎన్టీఆర్ పిలుపుతో 25 ఏళ్ల వయసుల్లో అయ్యన్నపాత్రుడు రాజకీయాల్లోకి వచ్చారు. ఏడు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీగా విజయం దక్కించుకున్నారు.

సంప్రదాయాలకు పెద్దపీట

సభలో సంప్రదాయాలకు పెద్దపీట వేద్దామని సభ గౌరవాన్ని, హుందాతనాన్ని పెంచుదామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. సభలో తనను ఏకగ్రీవంగా ఎంపిక చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ నేతలు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ దఫా అసెంబ్లీకి మరో విశిష్టత ఉందని, కొత్తగా 88 మంది సభ్యులు సభలో అడుగుపెట్టారన్నారు. మొదటి సారి గెలిచిన వారికి సభలో మాట్లాడే అవకాశం ఇస్తామన్నారు. తనకు జీవితాన్ని ఇచ్చిన టీడీపీని జీవితంలో మరచిపోలేనని స్పీకర్ అయ్యన్న తెలిపారు.

సభ పట్ల జగన్ గౌరవం బయటపడింది

శాసనసభ పట్ల వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు ఉన్న గౌరవం ఏమిటో ఈ రోజు బయటపడిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ ఎన్నిక సమయానికి సభలో ఉంటే బాగుంటుందని వైసీపీ నేతలకు శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఫోన్ చేసి చెప్పారని, అయినా జగన్ సభకు రాలేదన్నారు. జగన్‌కు సభా సంప్రదాయాలు పట్టవని అన్నారు. కగా, అయ్యన్న పాత్రుడి గురించి తమిళ వికీపీడియాలో ప్రముఖంగా పేర్కొన్నారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా విజయం సాధించిన ఆయన.. నాలుగుసార్లు మంత్రిగా వ్యవహరించారని తెలిపారు.

టీడీపీపీ నేతగా లావు శ్రీకృష్ణదేవరాయలు

- ఉప నేతలుగా ప్రసాదరావు, శబరి
- పోలవరం, అమరావతిని ప్రాధాన్యాలుగా ఎంచుకోండి: చంద్రబాబు



అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్లమెంటరీ నేతగా నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నియమితులయ్యారు. శనివారం రాత్రి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ ఎంపీల సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ విషయం ప్రకటించారు. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఎంపీల సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంటరీ పార్టీ ఉప నేతలుగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కోశాధికారిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, విప్‌గా అమలాపురం ఎంపీ గంటి హరీశ్‌ను నియమించారు. కాగా, రాష్ట్రానికి ఎక్కువ నిధులు రాబట్టడం ప్రథమ ప్రాధాన్యంగా టీడీపీ ఎంపీలు పనిచేయాలని చంద్రబాబు వారికి సూచించారు. 'పోలవరం, అమరావతిని ప్రాధాన్యాలుగా ఎంచుకొని పనిచేయాలి. అమరావతిని ఒక మంచి రాజధానిగా తీర్చిదిద్దాలి. కేంద్ర ప్రభుత్వ సంస్థలు అక్కడకు తరలిరావడానికి ప్రయత్నం చేయాలి. పోలవరం కూడా జగన్ విధ్వంస పాలనకు బలైంది. దానిని కూడా పూర్తి చేయాలి. రాష్ట్రం నలుమూలలకూ నీరివ్వాలి. మీ శక్తిని అంతటిని వీటికి వాడండి' అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రం తరఫున ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి నియామకంపై చర్చ జరిగింది. మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు పేరును కొందరు ఎంపీలు ప్రతిపాదించారు. దానిపై తుది నిర్ణయం జరగలేదు.

ప్రతి ప్రభుత్వాఫీసుపైనా సోలార్ ప్యానల్!

- 40,336 పెండింగ్ వ్యవసాయ కనెక్షన్లు మంజూరు: గొట్టిపాటి రవి


విద్యుత్తు శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న గొట్టిపాటి రవికుమార్

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం డబ్బులు చెల్లించిన 40,336 మందికి తక్షణమే కనెక్షన్లను మంజూరు చేస్తున్నట్లు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రకటించారు. శనివారం సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. గత ప్రభుత్వ హయాంలో దాదాపు 17 వేల కోట్ల రూపాయల ట్రూఅప్ వసూలుపై సీఎం చంద్రబాబుతో సమీక్షించాక విధాన నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. దశలవారీగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంలో ఇంటింటికి మూడు కిలోవాట్‌ల సోలార్ విద్యుత్‌ను అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తామని తెలిపారు.

ప్రమాణాన్ని విస్మరించిన జగన్: టీడీపీ ధ్వజం


అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): స్పీకర్ ఎన్నికకు వైసీపీ అధినేత, పులివెందుల ఎమ్మెల్యే జగన్ గైర్హాజరు కావడంపై పలువురు నేతలు స్పందించారు. టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఎక్స్‌లో.. 'ప్రజాతీర్పుతో కొలువుదీరిన శాసనసభలో జగన్ తొలి రోజు చేసిన ప్రమాణాన్ని రెండో రోజే విస్మరించారు. రెండోరోజు సభలో జరిగిన స్పీకర్ ఎన్నికకు జగన్ గైర్హాజరు కావడం సభా సంప్రదాయాలను పాటించకపోవడమే అవుతుంది' అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ, 'సభా మర్యాద ఏమాత్రం లేని వ్యక్తి జగన్ అని ఇన్నాళ్లూ జనం ఇన్నాళ్లు అనుకుంటున్న దానిని రెండో రోజే ఆయన నిజం చేశారు. జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా లేకపోయినా.. స్పీకర్ ఎన్నిక రోజు అసెంబ్లీలో ఉండటం సభా మర్యాద. ఆయన సభకు రాకుండా పులివెందుల వెళ్లారు. అనుమతులు లేవని ప్రభుత్వ భవనాలను కూల్చిన జగన్.. తాను అక్రమంగా కట్టిన భవనాన్ని కూల్చుతుంటే శోకాలు పెడుతున్నాడని ఎద్దేవా చేశారు. జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ, 'సభా మర్యాదలను గౌరవిస్తామని ప్రమాణం చేసిన జగన్.. స్పీకర్ ఎన్నికకు గైర్హాజరై, సభా సంప్రదాయాలను విస్మరించారు' అని అన్నారు. టీడీపీ, జనసేన మధ్య సమన్వయం చాలా బాగుందని కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఈ పొత్తు ఈ ఐదేళ్లు కాదు.. పదేళ్లకు పైగా కొనసాగుతుందన్నారు.

పెండింగ్ ఎయిర్‌పోర్టుల పూర్తి: రామ్మోహన్

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఎయిర్ పోర్టులను రెండేళ్లలో పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. అసెంబ్లీ లాబీల్లో శనివారం ఆయన మంత్రి లోకేశ్‌కు ఎదురుపడ్డారు. 'ఎయిర్ పోర్టులు ఎప్పటికి పూర్తి చేయిస్తున్నారు?' అని లోకేశ్ ఆయనను అడిగారు. రెండేళ్లలో అని రామ్మోహన్ చెప్పారు. అమరావతిలోని తన నివాసం వద్ద రోజూ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌ను కొనసాగిస్తానని లోకేశ్ మీడియా ప్రతినిధులకు చెప్పారు. కాగా, డీఎస్సీ నోటిఫికేషన్‌కు ముందు టెట్ నిర్వహించాలని తెలుగుదేశం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్... మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు.

25 వేల కోట్లకు లెక్క చెప్పండి: సాదినేని

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎడాపెడా అప్పులు చేసిందని, అందులో విశాఖపట్నంలోని ప్రభుత్వ కార్యాలయాలు తాకట్టుపెట్టి చేసిన రూ.25 వేల కోట్ల అప్పుల లెక్కలు చెప్పాలని బీజేపీ అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ డిమాండ్ చేశారు. ఆ నగదును ఎక్కడ ఎలా ఖర్చు చేశారనే వివరాలను వెల్లడించాలన్నారు.


పోడియం వద్ద స్పీకర్ అయ్యన్నపాత్రుడితో చంద్రబాబు, పవన్ కల్యాణ్, అచ్చెన్నాయుడు, సత్యకుమార్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి

గౌరవసభలో అడుగుపెట్టా!

నా బాధను ప్రజలు అర్థం చేసుకున్నారు.. అయ్యన్న పసుపు పోరాట యోధుడు

> తిరుపతిలో నాపై క్లైమోర్ దాడి జరిగింది. ఆ రోజు కూడా కన్నీళ్లు రాలేదు. కానీ, సభతో, రాజకీయాలతో సంబంధం లేని నా సతీమణిపై నీచంగా మాట్లాడారు. రాష్ట్రంలో గౌరవంగా బతికే ప్రతి ఆడబిడ్డపై సోషల్ మీడియాలో నీచంగా పోస్టులు పెట్టడంతో ఆ బాధ తట్టుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నా. అలాంటి వ్యక్తులు, నేతలు, పార్టీ రాష్ట్రానికి అరిష్టమని ప్రజలు భావించి మమ్మల్ని గెలిపించారు.
> - సీఎం చంద్రబాబు

> ఈ విలువైన ఐదేళ్లు.. రాబోయే తరాలకు గొప్ప భవిష్యత్తును ఇచ్చేలా ఉండాలి. అన్నం పెట్టే రైతులకు అండగా నిలిచేలా ఉండాలి. మహిళలకు గౌరవం కల్పించేలా ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులకు భరోసానిచ్చేలా, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు వేసేలా ఉండాలి. ఉంటుందని ఆకాంక్షిస్తున్నా.
> - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- బీసీ నేత స్పీకర్ కావడం సంతోషం : బాబు

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోనే బీసీ నాయకుల్లో అయ్యన్నపాత్రుడు సీనియర్ నేత అని, ఆయనకు స్పీకర్ స్థానం దక్కడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శనివారం అసెంబ్లీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన అయ్యన్నపాత్రుడిని ఆయన, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు సత్యకుమార్, అచ్చెన్నాయుడు స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూఅసెంబ్లీలో అత్యంత సీనియర్ సభ్యుల్లో అయ్యన్నపాత్రుడు ఒకరని, అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషకరమన్నారు. ఎన్టీఆర్ పిలుపుతో 25 ఏళ్ల వయసుల్లో అయ్యన్న రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. ఏడు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. ఏ పదవి ఇచ్చినా వన్నె తెచ్చారని పేర్కొన్నారు. 16 ఏళ్లు మంత్రిగా పని చేసిన అనుభవం ఉందన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ పడని ఇబ్బందులు గత ఐదేళ్లలో అనుభవించారని తెలిపారు. ఆయన ఇంటిపై పోలీసులు దాడులు చేశారని, అక్రమంగా 23 కేసులు పెట్టారని, ఆయనపై అనేక పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టి వేధించారని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా రాజీలేని పోరాటం చేశారని తెలిపారు. చట్ట సభకు రావడం అరుదైన అవకాశమని, ఎన్నుకున్న ప్రజలకు ఏం చేయాలో గుర్తు పెట్టుకోవాలన్నారు. గెలిచి వచ్చిన సభ్యులందరిపై పవిత్రమైన బాధ్యత ఉందని గుర్తుంచుకోవాలన్నారు. చట్టసభల్లో సభ్యుల ప్రవర్తన సరిగా ఉండాలని, సభ్యులు మాట్లాడే విషయాలన్నీ రాష్ట్రమంతా చూస్తుందని చంద్రబాబు తెలిపారు. "ఆనాడు మేం 23 మంది సభ్యులం. జనసేన, బీజేపీ సభ్యులు సభలో లేరు. ఇదే సభలో నేను ఎన్నో బాధలు పడ్డా. నన్ను, నా కుటుంబాన్ని ఇష్టానుసారంగా మాట్లాడితే నిరసన వ్యక్తం చేసేందుకు మైక్ కూడా ఇవ్వలేదు. ఇది గౌరవసభ కాదని, మైక్ కూడా ఇవ్వడం లేదని అప్పట్లోనే చెప్పా" అని అన్నారు.

గతాన్ని గుర్తు చేసుకుని..

సీఎం చంద్రబాబు గతాన్ని గుర్తు చేసుకున్నారు. వైసీపీ హయాంలో తనను సభలో ఏవిధంగా వేధించారో ఆయన చెప్పారు. "నా కుటుంబ సభ్యులను దూషించారు. ఆ సమయంలో నేను ఒకటే చెప్పా. 'నేను స్టేట్‌మెంట్ ఇవ్వాలనుకున్నా.. మీరు మైక్ ఇవ్వలేదు. అయినా నాకు బాధలేదు. మళ్లీ చెబుతున్నా ముఖ్యమంత్రిగానే సభకు వస్తాను. ఇది కౌరవసభ. గౌరవసభ కాదు. ఇలాంటి సభలో ఉండనని చెబుతున్నా' అని ఆనాడు చెప్పాను. నా అనుమానం ప్రజలు అర్థం చేసుకుని నిండు మనసుతో ఆశీర్వదించారు" అని చంద్రబాబు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో తనకు, రాష్ట్రంలోని మహిళలకు జరిగిన అవమానాన్ని మరెవ్వరికీ జరగనివ్వనని హామీ ఇచ్చారు. తన జీవితాంతం ప్రజలకు రుణపడి ఉంటానని, మళ్లీ జన్మ అంటూ ఉంటే తెలుగు గడ్డపై పుట్టి రుణం తీర్చుకుంటానన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని ప్రగల్భాలు పలికారని, పోటీ చేసిన 21 స్థానాల్లో పార్టీని గెలిపించిన వ్యక్తి పవన్ అని చంద్రబాబు అన్నారు. "ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్. వైసీపీ వైనాట్ 175 అని చెప్పి 11 సీట్లు తెచ్చుకున్న పరిస్థితిని చూశాం. నా జీవితంలో ఎప్పుడూ చూడని సభ 15వ శాసనసభ. అది కౌరవసభ. 16వ శాసనసభ అత్యున్నత గౌరవప్రదమైన శాసనసభ. దీనిని అత్యున్నత సభగా మనం నిర్వహించాలి. 24 గంటలూ మనం ప్రజలతో ఉండాలి. ప్రజలకు జవాబుదారీతనంతో ఉండాలి" అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ అందరి స్వప్నం కావాలని అభిలషించారు. దానికి అనుగుణంగా సభలో చర్చలు, నిర్ణయాలు, పాలసీలు రావాలన్నారు. సభలో దూషణలు, వెకిలి చేష్టలు లేకుండా హుందాగా సాగాలన్నారు.

ఇవీ లక్ష్యాలు

సభలో చంద్రబాబు కొన్ని లక్ష్యాలు ప్రకటించారు. రాజధాని నిర్మాణం, పోలవరం పూర్తి, నదుల అనుసంధానం చేసుకోవాలన్నారు. పెట్టుబడులు తీసుకురావడం, యువతకు ఉద్యోగాల కల్పన, బడుగులకు న్యాయం చేయాలన్నారు. అయ్యన్న ఆధ్వర్యంలో జరిగే సభ ద్వారా ఏపీని ప్రపంచంలో నెంబర్‌వన్‌గా నిలిపేందుకు, పేదరికం లేని రాష్ట్రంగా తయారు చేసేందుకు, ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఆ తరహా చర్చలు సాగాలని కోరుకుంటున్నామన్నారు.

ఓటమిని స్వీకరించలేని పిరికివారు

- వైసీపీ నేతలపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు



అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు విజయాన్ని ఆస్వాదించారే తప్ప.. ఓటమిని స్వీకరించలేకపోయారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. వారిని పిరికివారితో పోల్చారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు అసెంబ్లీ స్పీకర్‌గా రావడం సంతోషకరమని అన్నారు. అయ్యన్నపాత్రుడు స్పీకర్ స్థానాన్ని అలంకరించిన తర్వాత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. అయ్యన్నపాత్రుడిలో ఇన్ని దశాబ్దాలు ప్రజలు వాడివేడిని చూశారని అన్నారు. ఇకపై ఆయనకు కోపం వస్తే తిట్టడానికి అవకాశం లేదని, అల్లరి పిల్లాడికి క్లాస్ లీడర్ బాధ్యతలు అప్పచెప్పినట్లయిందని స్పీకర్‌ను ఉద్దేశించి పవన్ అన్నారు. దీంతో సభలో నవ్వులు వెల్లివిరిశాయి. ఇన్నాళ్లూ ప్రజలు ఆయన వాగ్ధాటి చూశారని, ఇవాళ్టి నుంచి రాష్ట్ర ప్రజలు హుందాతనం చూస్తారని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా బూతులు, వ్యక్తిగత దూషణలకు తావివ్వని చర్చలు సాగాలన్నారు. భాష మనసులను కలపడానికే.. విడగొట్టడానికి కాదన్నారు. విభేదించడం అంటే ద్వేషించడం కాదన్నారు. వాదించడమంటే కొట్టుకోవడం కాదని, విభేదించడం, వాదించడం అనేవి చర్చను మరింత ఉన్నత దశకు తీసుకెళ్లేలా ఉండాలని సూచించారు. కాగా.. శాసనసభలో ప్రతిపక్షం ఉన్నా లేకున్నా నిర్మాణాత్మకంగా సభను నిర్వహిస్తామని పవన్ స్పష్టం చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి చట్టాన్ని ఇప్పటి వరకు సరిగ్గా ఉపయోగించుకోలేదని తెలిపారు. ఈ చట్టాన్ని ఉపయోగించుకుని వ్యవస్థని సంస్కరించాలని అనుకుంటున్నట్టు తెలిపారు. "గెలుపు కోసం కష్టపడ్డాం. పోరాటాలు చేశాం. ఫలితంగా మేం పోటీ చేసిన 21 స్థానాల్లో గెలుపొందాం. పని చేసుకుంటూ పోతే ఫలితం అదే వస్తుంది. డిప్యూటీ స్పీకర్ ఎవరికి ఇస్తారనేది ఇప్పటి వరకు ఫైనల్ కాలేదు" అని పవన్ కల్యాణ్ వివరించారు.


టీవీ చానళ్లపై నిషేధం ఎత్తివేత ఫైల్‌పై తొలి సంతకం చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అసెంబ్లీలో చానళ్లపై నిషేధం ఎత్తివేత

- తొలి సంతకం చేసిన స్పీకర్ అయ్యన్న

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, ఈటీవీ, టీవీ 5 చానళ్లపై విధించిన నిషేధాన్ని శాసనసభ నూతన స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఎత్తివేశారు. స్పీకర్‌గా ఆయన తన తొలి సంతకాన్ని దీనికి సంబంధించిన ఫైలుపై చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన కొత్తలో మూడు చానళ్లపై నిషేధం విధించారు. ఆ చానళ్ల ప్రతినిధులు అసెంబ్లీ ప్రాంగణంలో అడుగు పెట్టకుండా ఈ నిషేధం ద్వారా అడ్డుకొన్నారు. ఐదేళ్లపాటు ఈ నిషేధం అమలైంది. ఆ నిషేధం ఆదేశాన్ని ఉపసంహరించాలని కోరుతూ టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర శనివారం అయ్యన్నపాత్రుడికి లేఖ అందచేశారు. ఈ నిషేధం ఎత్తివేతపైనే తొలి సంతకం చేయాలని నిర్ణయించుకొన్న ఆయన ఈ మేరకు ఫైలు తయారు చేయాలని అసెంబ్లీ అధికారులను ఆదేశించారు. స్పీకర్ ఎన్నిక పూర్తయి తన చాంబర్‌లోకి వచ్చాక పూజాదికాలు పూర్తి చేసుకొని ఆ తర్వాత ఈ ఫైలుపై తొలి సంతకం చేశారు. 'గత ప్రభుత్వ కక్ష సాధింపు ధోరణికి ఈ నిషేధం ఒక నిదర్శనం. అందుకే దానిని తొలగించాం. పత్రికా స్వేచ్ఛను కూడా హరించే విధంగా గత పాలకులు వ్యవహరించారు. ఈ నిషేధాన్ని తొలగించడం సంతోషంగా ఉంది' అని అయ్యన్న వ్యాఖ్యానించారు.

బీసీ స్పీకర్‌పై వైసీపీ చిన్నచూపు: ధూళిపాళ్ల

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): 'అయ్యన్నపాత్రుడు బీసీ వర్గాలకు చెందిన సీనియర్ నేత. ఏడు సార్లు గెలిచిన శాసనసభ్యుడు. ఆయనను స్పీకర్‌గా ఎంపిక చేస్తే బాధ్యతలు తీసుకొన్న రోజు వైసీపీ ఎమ్మెల్యేలు అందరూ కట్టగట్టుకొని సభకు గైర్హాజరయ్యారు. బీసీ సీనియర్ నేతను అత్యున్నత పదవికి ఎంపిక చేస్తే బాధ్యత కలిగిన ఒక పార్టీ ఇలా చేయడం సరైందేనా? వైసీపీ బీసీ వ్యతిరేక ధోరణికి ఇది నిదర్శనం' అని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర విమర్శించారు. శనివారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ హయాంలో తమ్మినేని సీతారాంను స్పీకర్‌గా ఎన్నిక చేస్తే మా పార్టీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మా ఉప నేత అచ్చెన్నాయుడు స్పీకర్ కుర్చీ వరకూ తమ్మినేనిని తోడ్కొని వెళ్లారు. నిబంధనలను పక్కనపెట్టి మా ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డి పట్ల ఔదార్యం చూపించింది. ఆయన దానిని నిలుపుకోలేక పోయారు. స్పీకర్ ఎన్నిక సమయంలో లేకుండా పోయారు. వారి పార్టీ ఎమ్మెల్యేలనూ సభకు పంపలేదు. కనీస హుందాతనం పాటించలేదు' అని ఆక్షేపించారు.

జగన్ సీఎంగా ఉన్నప్పుడే..

అక్రమ నిర్మాణంపై నోటీసులు


- వైసీపీ స్పందించకపోవడంతోనే సీఆర్‌డీఏ చట్టం ప్రకారం కూల్చివేత

(అమరావతి/గుంటూరు-ఆంధ్రజ్యోతి)

మాజీ సీఎం జగన్ నోరు విప్పితే పచ్చి అబద్ధాలు చెబుతారని మరోసారి తేలింది. తాడేపల్లి బోటుయార్డులోని రూ.కోట్ల విలువైన భూమిలో జల వనరుల శాఖ అనుమతి లేకుండా.. సీఆర్‌డీఏ, తాడేపల్లి-మంగళగిరి కార్పొరేషన్‌ల నుంచి పర్మిషన్ తీసుకోకుండా వైసీపీ కార్యాలయం కోసం అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని అధికారులు కూల్చివేయడంపై ఆయన గగ్గోలు పెడుతున్నారు. అధికారులు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా కూల్చారని ఆరోపిస్తున్నారు. అయితే గత నెల రోజులుగా నోటీసులపై నోటీసులు ఇచ్చాక.. వైసీపీ నుంచి ఎలాంటి స్పందనా లేనందునే కూల్చివేతకు వారు ఉపక్రమించారని తెలుస్తోంది. పైగా జగన్ సీఎంగా ఉన్నప్పుడే వైసీపీకి ఈ నోటీసులు అందడం గమనార్హం. అంతేకాదు.. ఆయన అధికారంలో ఉన్నప్పుడే.. సదరు భూమిని అప్పగించేది లేదని ఇంజనీర్-ఇన్-చీఫ్ సి.నారాయణరెడ్డి తేల్చిచెప్పారు. పైగా అక్రమ కట్టడాలు ఏవైనా ఉంటే కూల్చివేయాలని ఆదేశించారు. ఇవన్నీ కప్పిపుచ్చి ఇప్పుడు సీఎం చంద్రబాబుపై జగన్ అభాండాలు వేస్తున్నారు.

జరిగింది ఇదీ..

2019లో తాను గద్దెనెక్కాక వైసీపీ కార్యాలయాల నిర్మాణం కోసం విలువైన స్థలాలను కాజేందుకు జగన్ కుట్రకు తెరతీశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో రూ.కోట్లు ఖరీదు చేసే స్థలాలను 33 ఏళ్లపాటు ఎకరా రూ.వెయ్యి చొప్పున లీజుకు కట్టబెడుతూ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా విజయవాడ సమీపంలోని తాడేపల్లి బోటుయార్డులో జల వనరుల శాఖకు చెందిన 2 ఎకరాల భూమిని వైసీపీ కేంద్ర కార్యాలయం కోసం జగన్ ప్రభుత్వం గత ఏడాది కేటాయించింది. దీనికి ముందు చాలా తతంగం జరిగింది. బోటుయార్డు భూముల నుంచి రెండెకరాలు కేటాయించాల్సిందిగా జల వనరుల శాఖకు లేఖ రాయాలని నాటి గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను ఆ పార్టీ నాయకత్వం ఆదేశించింది. ఆయన లేఖ రాశారు. తెనాలి సబ్ కలెక్టర్ దీనిపై నివేదిక ఇస్తూ ఆ ప్రాంతంలోని 5.35 ఎకరాలను సీడ్ యాక్సిస్ రోడ్డు కోసం సీఆర్‌డీఏ మార్కింగ్ చేసిందని.. బోటుయార్డు భూమిని కేటాయించాలంటే ఇరిగేషన్ శాఖ అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. అయితే ఇరిగేషన్ శాఖ అనుమతులు తీసుకోకుండానే నేరుగా కేబినెట్‌లో పెట్టి ఆమోదం పొందారు. అలాగే వైసీపీ కార్యాలయ నిర్మాణంపై నిరుడు జనవరి 31న విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ).. బోటుయార్డు భూముల కేటాయింపుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఈఎన్‌సీ నారాయణరెడ్డిని కోరారు. ఈ కేటాయింపును ఈఎన్‌సీ వ్యతిరేకించారు. జల వనరులు, నీటి కుంటలు, చెరువులు, నీటి ప్రవాహ ప్రాంతాల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వాటిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఈఎన్‌సీ తన నివేదికలో స్పష్టం చేశారు. అలాగే జల వనరుల భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఇచ్చిన ఆదేశాలను గుర్తు చేశారు. బోటుయార్డులోని 17 ఎకరాలకు గాను 9 ఎకరాల్లో కృష్ణా పశ్చిమ కాలువ పారుతోందని.. ఈ కాలువకు 100 మీటర్ల దూరంలోనే వైసీపీ కార్యాలయం నిర్మించడం అక్రమమని పేర్కొన్నారు. మరో ఐదెకరాలను రాజధాని అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్డు కోసం రెవెన్యూ శాఖ కోరిందని వివరించారు. ఇక అక్కడ 3 ఎకరాలు మాత్రమే మిగిలి ఉందని.. అది కూడా నదీ తీర ప్రాంతమని తెలియజేశారు. ఈ భూముల్లోనే రాష్ట్ర జల భూ యాజమాన్య శిక్షణ సంస్థ కార్యాలయాన్ని, ఇంజనీరింగ్ రీసెర్చ్ లేబొరేటరీస్(ఏపీఈఆర్ఎల్)నూ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అందుచేత ఈ భూముల్లో వైసీపీ కార్యాలయం నిర్మించేందుకు అనుమతులు ఇవ్వడం సాధ్యం కాదని ఆయన తేల్చిచెప్పారు. అయితే జల వనరుల శాఖ అనుమతులు ఇవ్వకపోయినా.. కార్యాలయం నిర్మాణానికి వైసీపీ పూనుకుంది.


అక్రమ నిర్మాణంపై నోటీసుకు స్పందించనందుకు సదరు నిర్మాణాన్ని తొలగిస్తామంటూ ఈ నెల 1న కార్పొరేషన్ ఇచ్చిన తాఖీదు

గతంలో గుంటూరులో భూమి ఇచ్చినా..

వాస్తవానికి 2016లోనే టీడీపీ ప్రభుత్వం గుంటూరు నడిబొడ్డున కొరిటెపాడులో 98 సెంట్ల భూమిని కార్యాలయ నిర్మాణం కోసం వైసీపీకి కేటాయించింది. ఆ ఏడాది జూలై 21న జీవో 340 జారీచేసింది. అయితే ఈ భూమిని తీసుకునేందుకు ఆ పార్టీ నిరాకరించింది. తాము అధికారంలోకి వచ్చాక బోటుయార్డులో రెండెకరాలు తీసుకోవాలని నిర్ణయించింది. టీడీపీ ప్రభుత్వం గుంటూరులో వైసీపీకి కేటాయించిన భూమికి బదులు ఇక్కడ రెండెకరాల భూమిని కేటాయిస్తూ సీసీఎల్‌ఏ సాయిప్రసాద్ గత ఏడాది ఫిబ్రవరి 16న ఉత్తర్వు జారీ చేశా రు. ఇంకోవైపు.. ఈఎన్‌సీ నివేదికపై జగన్ సర్కారు న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ అంశంలో సుప్రీంకోర్టు ఆదేశాలను, ఎన్‌జీటీ మార్గదర్శకాలను పాటించాలని కోర్టు కూడా ఆదేశించింది. అయితే తహశీల్దార్ నిబంధనలకు విరుద్ధంగా 2023 మార్చి 31న స్థలాన్ని ఇరిగేషన్ శాఖ అనుమతి లేకుండానే వైసీపీకి అప్పగించేశారు. అధికార పార్టీ పెద్దలు భవన నిర్మాణానికి సీఆర్‌డీఏ నుంచి అనుమతులు తీసుకోకుండానే పనులు సాగించారు. ఇరిగేషన్ శాఖ అనుమతి ఇవ్వనందున భూమి కోసం లీజు ఒప్పందం కూడా కుదుర్చుకోలేదు. దీనిపై ఫిర్యాదులు రావడంతో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ ఏడాది మే 20న.. బోటు యార్డులో జల వనరుల శాఖ ఆమోదం లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడికి సంజాయిషీ నోటీసు జారీ చేశారు. అప్పటికి ఓట్ల లెక్కింపు జరుగనేలేదు. మే 13న రాష్ట్రంలో పోలింగ్ జరగడం.. జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడడం తెలిసిందే. అంటే అప్పటిదాకా జగన్ ప్రభుత్వం ఉన్నట్లే కదా! మే 20నాటి నోటీసుకు వైసీపీ నాయక త్వం స్పందించకపోవడంతో మళ్లీ ఈ నెల 1న వారం రోజుల్లో అక్రమ నిర్మాణాలపై సంజాయిషీ ఇవ్వాలని కార్పొరేషన్ నోటీసు ఇచ్చింది. ఈ నోటీసును భవన నిర్మాణం చేపట్టిన రాంకీ సంస్థకు కూడా పంపింది. అయినా స్పందనలేకపోవడంతో ఈ నెల 14న కార్పొరేషన్ కమిషనర్ కూల్చివేత ఉత్తర్వులు జారీ చేశారు. షోకాజ్ నోటీసుకు సమాధానం ఇవ్వకుండా.. హైకోర్టును ఆశ్రయించామంటూ రాకీ సంస్థ ఈ నెల 17వ తేదీ రాత్రి 11.37 గంటలకు తెలియజేసింది. అయితే హైకోర్టు కూడా ఈ వ్యవహారంలో చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలనే సూచించడంతో సీఆర్‌డీఏ చట్టం సెక్షన్ 115 ప్రకారం అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు.

వైసీపీ అక్రమాలపై బుల్డోజర్!

(మొదటి పేజీ తరువాయి)


తాడేపల్లిలో వైసీపీ అక్రమ నిర్మాణం నేలమట్టం

చేయించుకుంది. ఇరిగేషన్ భూముల్లో ఎలాంటి కాంక్రీటు నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలు చెబుతుండగా.. వాటన్నిటినీ తోసిరాజని గుంటూరు జిల్లా కలెక్టర్, తాడేపల్లి మండల తహసీల్దారు సదరు బోటు యార్డు భూమిలో రెండెకరాలను వైసీపీకి కట్టబెడుతూ ఉత్తర్వులిచ్చారు. వీటికి అనుగుణంగా వైసీపీకి భూమిని బదలాయిస్తూ జలవనరుల శాఖ స్వాధీనపు ఉత్తర్వులను ఇవ్వాల్సి ఉండగా ఆ శాఖ అధికారులు అందుకు అంగీకరించలేదు. అయినప్పటికీ సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ సదరు స్థలంలో హడావుడిగా కాంక్రీటు నిర్మాణాలను మొదలుపెట్టింది. వాస్తవంగా కేటాయించింది రెండెకరాలే అయినా.. మిగిలిన 15 ఎకరాలనూ స్వాహా చేయాలన్నది అసలు ఎత్తుగడ. ఎకరం రూ.25 కోట్లకు పైగా విలువ చేసే 17 ఎకరాల స్థలాన్ని 33 సంవత్సరాల లీజు(ఎకరాకు ఏడాదికి రూ.వేయి వంతున.. అది కూడా రెండెకరాలకు మాత్రమే) పేరిట స్వాధీనం చేసుకోవాలనుకుంది. నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) కూడా లేకుండా.. బోటు యార్డు స్థలంలో ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా పెద్దఎత్తున నిర్మాణాలు చేపట్టింది. ఈ అక్రమ నిర్మాణాన్ని ఆ ప్రాంత సచివాలయ సిబ్బంది గత నెల 20న గుర్తించారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేరోజున తక్షణమే నిర్మాణాలను నిలిపివేసి అనుమతులకు సంబంధించి తగు వివరణ ఇవ్వాలని కోరుతూ వైసీపీ అధిష్ఠానానికి ప్రొవిజినల్ ఆర్డర్స్ ఇచ్చామని కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్ కుమార్ శనివారం తెలిపారు. 'నోటీసులకు ఆ పార్టీ స్పందించకపోవడంతో తిరిగి ఈ నెల 1న సదరు అక్రమ నిర్మాణాలను ఎందుకు తొలగించరాదో చెప్పాలంటూ కన్ఫర్మేషన్ నోటీసులు కూడా ఇచ్చాం. వాటికీ ఎటువంటి స్పందన రాకపోవడంతో తిరిగి ఈ నెల 14న సదరు అక్రమ నిర్మాణాలను 24 గంటల్లోగా స్వచ్ఛందంగా తొలగించాలని.. లేకుంటే మేమే రంగంలోకి దిగి వాటిని సమూలంగా కూల్చివేసి...అందుకైన ఖర్చులను వారిపైనే వేస్తామంటూ మౌఖిక ఆదేశాలు జారీ చేశాం. అయినప్పటికీ వైసీపీ అధిష్ఠానం ఉలుకూపలుకూ లేకుండా నిర్లిప్తంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించింది' అని వెల్లడించారు. ఈలోగా రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(ఏపీసీఆర్‌డీఏ) కూడా ఈ నెల 10న సదరు అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ప్రొవిజనల్ ఆర్డర్స్‌ను, ఈ నెల 21న కన్ఫర్మేషన్ ఆర్డర్స్‌ను జారీ చేసినట్లు సమాచారం. సీఆర్‌డీఏ ఇచ్చిన కన్ఫర్మేషన్ ఉత్తర్వులపై వైసీపీ హైకోర్టుకు వెళ్లింది. విచారణ జరిపిన కోర్టు.. చట్టబద్ధంగా వ్యవహరించాలని సీఆర్‌డీఏను ఆదేశించినట్లు తమకు సమాచారం అందిందని కమిషనర్ తెలిపారు. తాము నెల రోజుల నుంచి నియమ నిబంధనల ప్రకారం నడుచుకున్న తర్వాత చట్టబద్ధంగా శనివారం తెల్లవారుజామున అక్రమ నిర్మాణాలను తొలగించామన్నారు.

సీడ్ యాక్సెస్ రోడ్డును అడ్డుకునేందుకే!

అమరావతిని సర్వనాశనం చేసి ఇక్కడ రాజధాని అనేది లేకుండా చేయాలన్నది వైసీపీ అధిష్ఠానం ఉద్దేశం. ఈ ఆలోచనకు అనుగుణంగానే వ్యూహాత్మకంగా తాడేపల్లి బోటు యార్డు స్థలంలో పార్టీ కేంద్ర కార్యాలయాన్ని నిర్మించాలని ఎత్తుగడ వేసింది. ఇక్కడ పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తే సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవచ్చు. కనకదుర్గ వారధి-మణిపాల్ హాస్పిటల్ వద్ద నుంచి 16వ నంబరు జాతీయ రహదారిని రాజధాని అమరావతికి అనుసంధానించేందుకు ఈ సీడ్ యాక్సిస్ రోడ్డే ప్రధానంగా ఉపయోగపడుతుంది. ఈ రోడ్డు తాలూకు ఫ్లైఓవర్ తాడేపల్లి బోటు యార్డు మీదుగా వెళ్లాలి. సరిగ్గా ఇక్కడ వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తే సీడ్ యాక్సిస్ రోడ్డును అడ్డుకోవచ్చు. అందుకే ఆ పార్టీ ఈ స్థలాన్ని ఎంచుకుంది.

బాబు కక్ష సాధింపులకు దిగారు: జగన్

తాడేపల్లిలో భవనాన్ని కూల్చివేయడంపై వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాష్ట్రంలో చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులకు దిగారని ఆరోపించారు. 'దాదాపు పూర్తికావచ్చిన మా పార్టీ కేంద్ర కార్యాలయ భవనాన్ని బుల్డోజర్లతో కూల్చివేయించారు. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేశారు. రాష్ట్రంలో చట్టం, న్యాయం పూర్తిగా కనుమరుగైపోయాయి. ఎన్నికల తర్వాత హింసాత్మక ఘటనలతో రక్తాన్ని పారిస్తున్న చంద్రబాబు.. ఈ ఘటన ద్వారా వచ్చే ఐదేళ్ల పాలన ఏ విధంగా ఉండబోతోందో హింసాత్మక సందేశాన్ని ఇవ్వకనే ఇచ్చారు. ఈ బెదిరింపులు, కక్షసాధింపు చర్యలకు మా పార్టీ తలొగ్గేది లేదు. వెన్ను చూపేది అంతకన్నా లేదు. ప్రజల తరఫున, ప్రజల కోసం ప్రజల తోడుగా గట్టి పోరాటాలు చేస్తాం. ప్రజాస్వామ్యవాదులంతా చంద్రబాబు దుశ్చర్యలను ఖండించాలి' అని విజ్ఞప్తి చేశారు.

అనుమతుల్లేని వైసీపీ కార్యాలయాలను కూల్చేస్తాం

- టీడీపీ నేతలు, కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేస్తాం
- పుంగనూరులోనూ ఇక అంబేడ్కర్ రాజ్యాంగం
- తీరు మార్చుకోని పోలీసులపై చర్యలు తప్పవు: హోం మంత్రి అనిత



అలిపిరి సమీపంలోని సప్తగిరి గో ప్రదక్షిణశాలలో వేణుగోపాలస్వామికి మొక్కుకుంటున్న హోం మంత్రి అనిత

తిరుపతి, రేణిగుంట/తిరుమల, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయాలు ఎక్కడున్నా కూల్చివేస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తిరుమల పర్యటన నిమిత్తం శనివారం సాయంత్రం తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆమెకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడ ఆమె మీడియాతో మాట్లాడారు. 'మాజీ సీఎం జగన్ అసెంబ్లీలో సభామర్యాదలు పాటిస్తానని ప్రమాణం చేసి 24 గంటలు పూర్తికాక ముందే మాట తప్పారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అయ్యన్న పాత్రుడు స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో ఆయన రాకపోగా వైసీపీ ఎమ్మెల్యేలను సైతం పంపలేదు. 2019 నుంచి బూతు పురాణాలు, వెకిలి చేష్టలతో సభా సంప్రదాయాలను మంట గలిపారు' అని విమర్శించారు. అనంతరం రోడ్డు మార్గాన ఆమె అలిపిరి సమీపంలోని సప్తగిరి గో ప్రదక్షిణశాలను సందర్శించారు. వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. అనంతరం తిరుమలలోని గాయత్రి నిలయం అతిథి గృహానికి చేరుకున్న ఆమెకు టీటీడీ రిసెప్షన్ అధికారులు స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. మంత్రి అనిత ఆదివారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పెట్టిన తప్పుడు కేసులపై పునర్విచారణ

రాష్ట్ర వ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వంలో పెట్టిన తప్పుడు కేసులపై పునర్విచారణ జరుపుతామని అనిత వెల్లడించారు. శనివారం రాత్రి తిరుపతిలో టీడీపీ కార్యాలయం వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. అన్నమయ్య జిల్లా అంగళ్లలో టీడీపీ అధినేత చంద్రబాబుతో సహా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందిపై అక్రమ కేసులు బనాయించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలపై నమోదైన తప్పుడు కేసులను ఎత్తివేస్తాం. ఇప్పటి వరకూ వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరులో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారు. ఇకపై అక్కడ కూడా అంబేడ్కర్ రాజ్యాంగమే అమలవుతుంది. తిరుపతిలో దొంగ ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్‌కు సంబంధించిన కేసుపై విచారణను వేగవంతం చేస్తాం. వైసీపీకి తొత్తుల్లా వ్యవహరించిన పోలీసులను, పోలీసు సంఘ నేతలను తీరు మార్చుకోవాలని ఇప్పటికే హెచ్చరించాం. వారు మారకపోతే చర్యలు తప్పవు. రాత్రిళ్లు ఎనిమిది గంటల తరువాత గుంపులుగా ఉండకూదన్నామే తప్ప జనజీవనం ఉండకూడదని మేం చెప్పలేదు' అని అనిత స్పష్టం చేశారు.

విశాఖ, అనకాపల్లి వైసీపీ ఆఫీసులకు నోటీసులు

- అక్రమ భవన నిర్మాణాలపై వారంలోగా వివరణకు ఆదేశం
- కార్యాలయాల గోడలకు అతికించిన అధికారులు



విశాఖ వైసీపీ కార్యాలయానికి జీవీఎంసీ అధికారులు అతికించిన నోటీసును తొలగిస్తున్న మాజీ మంత్రి అమర్నాథ్

విశాఖపట్నం/అనకాపల్లి, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) నుంచి ప్లాన్ తీసుకోకుండా విశాఖ, అనకాపల్లి జిల్లాల వైసీపీ కార్యాలయాల కోసం అక్రమంగా భవనాలు నిర్మించడంపై నగర టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం నోటీసులు జారీచేశారు. ఎండాడ సర్వే నంబరు 175/4లో ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకున్న రెండెకరాల్లో విశాఖ వైసీపీ కార్యాలయం కోసం ప్యాలెస్‌ను తలపించేలా భవనం నిర్మించారు. జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులూ తీసుకోకుండానే కట్టేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో జోన్-2 టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ 452 (1), 461 (1) ప్రకారం భవనంపై తదుపరి చర్యలు ఎందుకు తీసుకోకూడదో వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేశారు. ఆ నోటీసులిచ్చేందుకు సిబ్బంది శనివారం ఉదయం వైసీపీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో గోడకు అతికించి వెళ్లిపోయారు. కార్యాలయ సిబ్బంది ఈ విషయాన్ని పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులుకు తెలియజేశారు. ఆయనతో పాటు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అక్కడకు చేరుకున్నారు. గోడకు అతికించిన నోటీసును అమర్నాథ్ తొలగించారు. నోటీసును కార్యాలయ సిబ్బందికి ఇవ్వాలి గానీ గోడకు అతికించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యాలయంలోనే అందుబాటులో ఉన్న నాయకులు, కార్పొరేటర్లతో సమావేశమై చర్చించారు. జీవీఎంసీ అధికారుల చర్యలపై న్యాయపోరాటం చేయాలని నిర్ణయించినట్లు అమర్నాథ్ ఆ తర్వాత విలేకరులకు తెలిపారు. మరోవైపు.. అనకాపల్లి మండలం రాజుపాలెం రెవెన్యూ పరిధి కొత్తూరు నర్సింగరావుపేటలో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయ భవనం కూడా అక్రమ నిర్మాణమేనంటూ అధికారులు శనివారం నోటీసులు జారీచేశారు. అనకాపల్లి జోనల్ కార్యాలయ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ భవనాన్ని సందర్శించారు. వారంలో వివరణ ఇవ్వాలంటూ అక్కడా కార్యాలయం గోడకు నోటీసు అందించారు. సరైన సమాధానం ఇవ్వకపోతే తగు చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు.

ఐఏఎస్ అధికారుల కమిటీని రద్దు చేయాలి

- ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ వ్యతిరేకమైన ఐఏఎస్ అధికారుల కమిటీని వెంటనే రద్దు చేయాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వీఎం రవి శంకర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని అమరావతి సచివాలయంలో కలిశామని, ఆయనకు ఆమేరకు వినతిపత్రం అందజేశామని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లకు సంబంధించి రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఐఏఎస్ అధికారుల కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీం కోర్టు జర్నైల్ సింగ్ కేసులో తీర్పును పరిశీలనలోకి తీసుకోకుండా ఆ నిర్ణయం తీసుకుంది. అది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల భవిష్యత్తును డ్యామేజీ చేసేలా, 81వ రాజ్యాంగ సవరణకు తూట్లు పొడిచేలా ఉంది. ఆ చర్యలు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను భయాందోళనకు గురి చేశాయి. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013 లక్ష్యాలను గత ప్రభుత్వం నీరుగార్చింది. ఐదు సంవత్సరాల్లో రూ.83 వేల కోట్లు కేటాయించగా రూ.60 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీలు ఎంతో అన్యాయానికి గురయ్యారు' అని రవి శంకర్ పేర్కొన్నారు.

సొంతూరిలో జగన్‌కు షాక్

- బిల్లులు అందలేదని క్యాడర్ గగ్గోలు
- నాయకులు, కార్యకర్తల అసంతృప్తి
- తోపులాటలో కిటికీ అద్దాలు ధ్వంసం
- మాజీ సీఎంగా తొలిసారి కడప జిల్లాకు
- కనిపించని వైసీపీ శ్రేణుల హడావుడి



జగన్ రాక సందర్భంగా వైసీపీ క్యాడర్ లేక వెలవెలబోతున్న కడప ఎయిర్‌పోర్టు

కడప, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రిగా, పులివెందుల ఎమ్మెల్యే హోదాలో తొలిసారి సొంత గడ్డకు వచ్చిన జగన్‌కు సొంత పార్టీ శ్రేణులు ఝలక్ ఇచ్చారు. బిల్లుల కోసం జగన్‌ను నిలదీసినంత పనిచేశారు. 'బిల్లులు కాకపోతే మా ఆస్తులు అమ్మినా కూడా చేసిన అప్పులు తీరవు. మేము ఎలా బతకాలి? ఎన్నికలకు ముందు నుంచి కూడా బిల్లుల కోసం అధికారులపై ఎంత ఒత్తిడి తెచ్చినా పట్టించుకోలేదు'.. అంటూ వాపోయారు. అందరూ సహనంతో ఉండాలని, మళ్లీ మంచి రోజులు వస్తాయని జగన్ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో జగన్ ఇంటి కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. మూడు రోజుల పర్యటనకు శనివారం ఆయన సొంత జిల్లాకు వచ్చారు. పులివెందులకు వెళ్లేసరికి అక్కడ జనం పెద్దగా లేరు. తర్వాత వైసీపీ నాయకులు భారీ స్థాయిలో జనసమీకరణ చేసినట్లు తెలుస్తోంది. జగన్ ప్రభుత్వంలో కాంట్రాక్టు పనులు చేసి, బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఆవేదనలో ఉన్నవారంతా అక్కడకు వచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసేందుకు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. దీంతో పోలీసు సిబ్బంది వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. జగన్ కార్యాలయంలోకి వెళ్లిపోవడంతో ఆయనను కలిసేందుకు అందరూ అక్కడికి చేరుకున్నారు. వారు లోపలకు వెళ్లకుండా సిబ్బంది తలుపులు వేశారు. అందరూ ఒక్కసారిగా కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తోపులాట జరిగింది. కొందరు కిటీ అద్దాలను గట్టిగా కొట్టడంతో అద్దాలు పగిలినట్లు తెలిసింది. తేరుకున్న సిబ్బంది అందరినీ నిలువరింపజేశారు. జగన్‌ను కలిసేందుకు ఒకస్థాయి నాయకులను మాత్రమే పంపిస్తున్నారని కిందిస్థాయి నాయకులు మండిపడ్డారు. వెళ్లిన ప్రతి నాయకుడు బిల్లులు కాలేదని, ఇపుడు మా పరిస్థితి ఏమిటని సమస్యలు ఏకరువు పెట్టారు. మీడియాను ఆఫీసు బయటే ఆపేశారు.

దూరంగా క్యాడర్

కడప ఎయిర్‌పోర్టులో ఎంపీ అవినాశ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప మేయర్ సురేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, అంజాద్‌బాషలు మాత్రమే స్వాగతం పలికారు. జగన్ వస్తున్నారని చెప్పి ఎయిర్‌పోర్టుకు రావాలంటూ మాజీ ఎమ్మెల్యే అంజాద్‌బాష, మేయర్ సురేశ్‌బాబు క్యాడర్‌కు విజ్ఞప్తి చేసినా పెద్దగా హాజరు కాలేదు. వచ్చిన క్యాడర్‌తోనే సీఎం జగన్ అంటూ నినాదాలు చేయించుకుని మురిసిపోయారు. ఎయిర్‌పోర్టు నుంచి పులివెందులకు వెళ్లే రహదారిలో జగన్ కాన్వాయ్‌లోని ఇన్నోవా రామరాజుపల్లె వద్ద అగ్నిమాపక శాఖ వాహనాన్ని ఢీకొట్టింది. ఎవరికీ గాయాలు కాలేదు.

ఇక ఈ-గేట్‌తో ఇమిగ్రేషన్!

- ఎయిర్ పోర్టులో తనిఖీలు, క్యూలు లేకుండా స్వీయ ధ్రువీకరణ

న్యూఢిల్లీ, జూన్ 22: దేశంలోని ప్రధాన ఎయిర్‌పోర్టుల్లో ఇమిగ్రేషన్ సేవలను మరింత వేగంగా అందించటానికి వీలుగా కేంద్రప్రభుత్వం 'ఫాస్ట్ ట్రాక్ ఇమిగ్రేషన్-ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగామ్' (ఎఫ్‌టీఐ-టీటీపీ) అనే కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా అంతర్జాతీయ ప్రయాణాలు ఇకపై మరింత సులువు కానున్నాయి. ఎఫ్‌టీఐ-టీటీపీని దేశంలోని 21 ప్రధాన విమానాశ్రయాల్లో అమలు చేయనున్నారు. తొలిదశలో భాగంగా హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, కొచి, అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుల్లో తీసుకొస్తారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శనివారం ఎఫ్‌టీఐ-టీటీపీని ప్రారంభించారు. భారతీయ పౌరులకు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డుహోల్డర్లకు ఈ సదుపాయం ఉచితంగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కాగా, ఎఫ్‌టీఐ-టీటీపీ సదుపాయాన్ని వినియోగించుకోవాలంటే ప్రయాణికులు ముందుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీని కోసం ప్రత్యేకంగా కేంద్రప్రభుత్వం www.ftittp.mha.gov.in అనే వెబ్‌సైట్‌ను కూడా ఏర్పాటు చేసింది. దరఖాస్తు ఆమోదం పొందిన తర్వాత నిర్ణీత తేదీ, సమయంలో సమీపంలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో లేదా ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో ఇతరత్రా పత్రాలతోపాటు తమ బయోమెట్రిక్ (ఫేస్, ఫింగర్‌ప్రింట్స్) వివరాలను సమర్పించాలి. వీరిని ట్రస్టెడ్ ట్రావెలర్స్‌గా వ్యవహరిస్తారు. ఎఫ్‌టీఐ-టీటీపీ అమలయ్యే విమానాశ్రయాల్లో ఈ-గేట్లను ఏర్పాటు చేసి, వాటిల్లో ట్రస్టెడ్ ట్రావెలర్స్ వివరాలను నిక్షిప్తం చేస్తారు. సదరు ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వచ్చినప్పుడు తనిఖీలు, క్యూ ఏమీ లేకుండానే తమ బోర్డింగ్‌పాస్‌ను, పాస్‌పోర్టును ఈ-గేట్ వద్ద స్కాన్ చేసి, బయోమెట్రిక్ వివరాలను నమోదు చేస్తే సరిపోతుంది. అప్పటికే నిక్షిప్తమైన వివరాలతో సరిపోల్చుకొని ఈ-గేట్ దానంతట అదే తెర్చుకుంటుంది. దీంతో ఇమిగ్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లే.

ఆ ఉత్తర్వులు ఆయనకు వర్తించవా?

- 'కడా' కమిషనర్‌గా 2021 రిటైర్డ్ అధికారి
- జగన్ ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డి అండ
- మూడుసార్లు పొడిగింపు ఉత్తర్వులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

వైసీపీ విధేయ అధికారులకు ఇంకా ఉన్నత పదవులు దక్కుతూనే ఉన్నాయి. వివిధ శాఖల్లో పదవీ విరమణ చేసిన తర్వాత కూడా కొనసాగుతున్న ఉద్యోగులు, అధికారులను తక్షణం రాజీనామా చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జూన్ 20న ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను కొందరు అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆయకట్టు అభివృద్ధి సంస్థ(కడా) స్పెషల్ కమిషనర్‌గా పని చేస్తున్న రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి పీఎస్ రాఘవయ్యకు వైసీపీ విధేయ అధికారిగా పేరుంది. 2021 జనవరి 31న ఆయన ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి సీఎం జగన్ ఓఎస్‌డీ అయిన కృష్ణమోహన్ రెడ్డికి రాఘవయ్య సన్నిహితుడు కావడంతో వెనువెంటనే రెండేళ్లపాటు అదే పోస్టులో కొనసాగేలా ఉత్తర్వులు పొందారు. ఈ గడువు 2023 ఏప్రిల్‌లో ముగియడంతో రెండోసారి ఏడాది పాటు పొడిగింపు పొందారు. ఆ గడువు కూడా 2024 మార్చిలో ముగియడంతో ముచ్చటగా మూడోసారి మరో ఏడాది పొడిగింపు కోసం ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఉన్నతస్థాయిలో లభించిన అండదండలతో ఏళ్ల తరబడి అదే పోస్టులో పాతుకుపోయారు. కడా స్పెషల్ కమిషనర్ అనేది కీలక పోస్టు. వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసే బాధ్యతలు ఉంటాయి. నామినేషన్ల పనులు అప్పగించే అధికారం ఉంటుంది. ఇలాంటి కీలక పోస్టులో వైసీపీ విధేయ అధికారిని అది కూడా ఉద్యోగ విరమణ చేసిన అధికారిని కొనసాగించడం ఏమిటనే ప్రశ్న జలవనరుల శాఖ అధికారులు లేవనెత్తుతున్నారు.

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

అమరావతి, విశాఖపట్నం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు మధ్య బంగాళాఖాతం మీద కొనసాగుతున్న ఆవర్తనం ప్రభావంతో రానున్న రెండు రోజులు వివిధ జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఆదివారం అల్లూరి, మన్యం జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది. మరోవైపు, రుతుపవనాలు బలహీనంగా ఉండడంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉక్కపోత, ఎండ తీవ్రత కొనసాగాయి. ప్రధానంగా దక్షిణ కోస్తాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. శనివారం ఒంగోలులో 39, నెల్లూరులో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఏపీని ఆదుకోండి

- రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్లు కేటాయించండి
- పోలవరం పూర్తికి సహాయ సహకారాలు అందించండి
- హేండ్లూమ్స్, పాదరక్షలకు జీఎస్టీ తగ్గించండి
- కేంద్రానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల విజ్ఞప్తి
- ఢిల్లీలో బడ్జెట్ సన్నాహక సమావేశానికి హాజరు



న్యూఢిల్లీ, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసం వల్ల దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని కేంద్రప్రభుత్వానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విజ్ఞప్తి చేశారు. ఏపీకి జీవనాడిగా భావించే పోలవరం ప్రాజెక్టుకు ఉన్న చిన్నపాటి అభ్యంతరాలను త్వరగా పరిష్కరించి ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి స్థాయిలో సహాయసహకారాలు అందించాలని కోరారు. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15,000 కోట్లను కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఆదుకోవాలని కోరారు. శనివారం ఢిల్లీలోని భారత మండపంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన కేంద్ర బడ్జెట్ సన్నాహక(ప్రీ బడ్జెటరీ), జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలలో పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఆ సమావేశాలలో రాష్ట్రప్రభుత్వం తరఫున చేసిన ప్రతిపాదనలను అనంతరం ఆయన ఏపీభవన్‌లో మీడియాకు వెల్లడించారు. వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రతోపాటు ప్రకాశం జిల్లా సామాజిక, ఆర్థిక అభివృద్ధికి నిధులు కేటాయించాలని అడిగామని తెలిపారు. అవకాశం ఉన్న చోట పారిశ్రామిక రాయితీలు ఇవ్వాలని, ఏపీలో కేంద్రం చేపట్టిన పారిశ్రామిక కారిడార్‌లు, పార్కుల దగ్గర పారిశ్రామిక క్లస్టర్‌లు ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. మెగా టెక్స్‌టైల్ పార్క్, ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్‌కు నిధులతో పాటు గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు సాయం అందించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. తిరుపతి, వైజాగ్ ఎయిరుపోర్టుల కోసం స్వాధీనం చేసుకున్న భూములకు సంబంధించిన రీయింబర్స్‌మెంటు నిధులను విడుదల చేయాలని అడిగామన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరామని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కేంద్రం చేయూత అత్యవసరమనే విషయాన్ని వివరించామని తెలిపారు. రామాయపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంటు, క్రూడాయిల్ రిఫైనరీ, పెట్రోలియం కాంప్లెక్స్, రైల్వే జోన్‌కు సహకారం అందించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అగ్రికల్చరల్ యూనివర్సిటీ, గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం స్థాపించాలని కోరినట్లు తెలిపారు. 2047 కల్లా వికసిత్ భారత్ సాధనలో భాగంగా త్వరితగతిన దేశ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ మార్క్‌ను చేరడంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించబోతోందన్నారు. హేండ్లూమ్స్, పాదరక్షలకు జీఎస్టీ తగ్గించాలని కౌన్సిల్ సమావేశంలో నిర్మలా సీతారామన్‌ను కోరినట్లు మంత్రి పయ్యావుల తెలిపారు. జగన్ పాలనలో ఏ స్థాయిలో ఆర్థిక అరాచకం జరిగిందో ప్రాధాన్యమైన ఐదారు అంశాలపై త్వరలో ప్రజలకు అన్ని పారదర్శకంగా వెల్లడిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా పయ్యావుల తెలిపారు.

అభివృద్ధిలో బాబుతో పోటీ!

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. శనివారమిక్కడ బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి ఆడిటోరియంలో ఆస్పత్రి 24వ వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందుతాయనే భరోసా కల్పించే విధంగా ఇక్కడ హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తోందని ఆయన చెప్పారు. శంషాబాద్ విమానాశ్రయం పరిసరాల్లో 500 నుంచి వెయ్యి ఎకరాల్లో అన్ని సదుపాయాలతో ఈ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రపంచంలో పేరు గాంచిన వైద్య సంస్థలకు ఇక్కడ అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇందులో బసవతారకం ఆస్పత్రికి కూడా కచ్చితంగా చోటు ఉంటుందన్నారు. ఆస్పత్రికి ఎలాంటి సహకారం కావాలన్నా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఏపీ ప్రజలకు జగన్ పీడ విరగడైంది

- జగన్ పాలనలోని దుర్మార్గాలతో పోల్చితే ఎన్నికల అనంతర ఘటనలు చిన్నవి: నారాయణ

న్యూఢిల్లీ, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఇటీవలి ఎన్నికల ఫలితాలతో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పీడ విరగడై ఆంధ్రప్రదేశ్ ప్రజలకు విముక్తి దొరికిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. శనివారం, ఇక్కడ ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనలో జరిగిన దుర్మార్గాల కంటే ఎన్నికల ఫలితాల తర్వాత జరిగిన ఘటనలు చాలా చిన్నవని అభిప్రాయపడ్డారు. ఏపీలో టీడీపీకి మంచి రోజులు వచ్చాయన్నారు. వైసీపీ కార్యాలయం కూల్చివేతపై స్పందిస్తూ... వైసీపీ నేర్పిన విద్యయే కదా..! అంటూ ఎద్దేవా చేశారు. ఈవీఎంలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కక్షసాధింపు చర్యలకు దిగకుండా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నారాయణ సూచించారు.

48 గంటల్లోపే నిందితులను పట్టేశారు!

- చీరాల గ్యాంగ్ రేప్ కేసులో ముగ్గురి అరెస్ట్
- ఎస్‌బీ పోలీసులకు ఎస్పీ అభినందనలు
- కీలక నిందితుడిని విచారిస్తున్న పోలీసులు

చీరాలటౌన్, జూన్ 22: రాష్ట్రవ్యాపంగా సంచలనం రేపిన చీరాల హత్యాచార ఘటనలో ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది. యువతిపై ఘాతుకానికి పాల్పడిన మృగాళ్లను 48 గంటల్లో పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లా గూడూరు కు చెందిన చేనేత కుటుంబం చీరాల మండలం ఈపూరుపాలెం.. సీతారాంపేటలో కొంతకాలంగా అద్దెకు ఉంటోంది. వీరి పెద్ద కుమార్తె(21) ఇంటర్ పూర్తిచేసి, టైలరింగ్ చేస్తోంది. శుక్రవారం ఉదయం ఒంటరిగా సమీప రైలుకట్ట వైపు బహిర్భూమికి వెళ్లగా దుండగులు ఆమెపై అత్యాచారం చేసి, ఆపై కర్రలతో కొట్టి దారుణంగా హత్య చేశారు. ఘటనను సీఎం చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. ఆయన ఆదేశాలతో హోంమంత్రి అనిత బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఎస్పీ వకుల్ జిందాల్ 10 బృందాలతో గాలింపు చేపట్టారు. దారుణానికి పాల్పడిన ఈపూరుపాలెం చుక్కయ్యపేటకు చెందిన దేవరకొండ విజయ్, పోతురాజు శిల సమీపానికి చెందిన కారంకి మహేష్, చుక్కయ్యపేటకు చెందిన మూడో వ్యక్తి దేవరకొండ శ్రీకాంత్‌ను అరెస్ట్ చేశారు. కేసులో కీలకమైన నాలుగో వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఇలా దొరికిపోయారు!

మొదటి ముద్దాయి విజయ్ తోటవారిపాలెం మూడు రోడ్ల సెంటర్‌లో ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున ఆమెతో ఘర్షణ పడ్డాడు. దీంతో రెండో నిందితుడైన కారంకి మహేష్‌ను పిలుచుకుని సీతారాంపేట రైలు కట్ట వద్దకు చేరుకుని మద్యం సేవిస్తున్నారు. అదేసమయంలో బాధితురాలు బహిర్భూమికి రాగా, ఇద్దరూ అత్యాచారం చేసి హతమార్చారు. అనంతరం పరారయ్యారు. వీరు ధరించిన దుస్తులను భూమిలో పూడ్చివేశారు. కొద్దిసేపటి తరువాత మళ్లీ వచ్చి హతురాలిని పరిశీలించి వెళ్లారు. అదేసమయంలో వీళ్లను స్థానికులు గమనించారు. ఆ వివరాలతో పోలీసులు దర్యాప్తు వేగం పెంచారు. విజయ్ ఫోన్ నంబర్ ఆధారంగా షెల్టర్ ఇచ్చిన దేవరకొండ శ్రీకాంత్‌తోపాటు ముగ్గురిని అరెస్ట్ చేశారు. మొదటి ఇద్దరు గతంలోనూ ఓ మర్డర్ కేసులో ఉన్నారు. కేసును ఛేదించడంలో 48 గంటలపాటు విశేషంగా కృషిచేసిన ఎస్బీ పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వంపై హర్షం

ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే హోంమంత్రి సైతం సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబానికి రూ.10 లక్షలు సాయం అందించారు. 48 గంటల్లో కేసును ఛేదిస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకున్నారు. దీంతో దటీజ్ చంద్రబాబు అంటూ జనం చర్చించుకుంటున్నారు. 'ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.. శభాష్ హోంమంత్రి అనిత గారూ' అంటూ చీరాల ప్రాంతంలో సోషల్ మీడియా ద్వారా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

లేపాక్షి హస్తకళలకు పూర్వవైభవం

● విదేశాల్లో లేపాక్షి షోరూంల ఏర్పాటు ● రూ.వంద కోట్ల టర్నోవర్‌తో హస్తకళాకారులకు ఉపాధి ● రాష్ట్ర చేనేత జౌళి సంక్షేమ శాఖ మంత్రి సవిత

విజయవాడ లీగల్, జూన్ 22: నిర్లక్ష్యానికి గురైన లేపాక్షి హస్తకళలకు పూర్వ వైభవాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో దేశవిదేశాల్లో లేపాక్షి షోరూంలను ఏర్పాటు చేసి రూ.వంద కోట్ల టర్నోవర్‌తో హస్తకళాకారులకు జీవనోపాధి కల్పించి అధునాతన కళాకృతులను వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకోబోతున్నట్టు రాష్ట్ర చేనేత జౌళి బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. లేపాక్షి హస్తకళాకృతులను పరిశీలించేందుకు శనివారం ఆమె ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో గాంధీనగర్‌లోని లేపాక్షి ఎంపోరియంను సందర్శించి కళాకృతులను పరిశీలించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ గతంలో లేపాక్షి హస్తకళలు ఎంతో ప్రాముఖ్యత, గుర్తింపును సంతరించుకొన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 లేపాక్షి షోరూంలతో పాటు ఇతర రాష్ట్రాల్లో 3 షోరూంలు ఏర్పాటు చేసి హస్తకళాకృతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి వినియోగదారులకు అందుబాటులోకి తేవడంతో పాటు కళాకారులకు జీవనోపాధి కల్పించామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా లేపాక్షి షోరూంలో కొంత మేర విక్రయాలు మందగించినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. లేపాక్షి షోరూంలకు పూర్వవైభవాన్ని తెచ్చేందుకు తమ ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ప్రస్తుతమున్న లేపాక్షి షోరూంల ఆధునీకరణతో పాటు విదేశాల్లో తెలుగు వారు అత్యధికంగా నివాసముండే ప్రాంతాల్లో లేపాక్షి షోరూంలను ఏర్పాటు చేసి



లేపాక్షి హస్తకళలను పరిశీలిస్తున్న మంత్రి సవిత

కళాకారులను అందుబాటులోకి తెచ్చి మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం ద్వారా రూ.వంద కోట్ల టర్నోవర్ లక్ష్యంగా ప్రణాళికను రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా హస్తకళాకృతులను రూపొందించేలా హస్తకళాకారులకు నైపుణ్య శిక్షణ అందించే దిశలో అడుగులు ముందుకు వేయబోతున్నామన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో హస్తకళాకారులు ఇప్పటికీ హస్తకళలపై ఉన్న మక్కువతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకొనేలా కళాకృతులను రూపొందించి మన సంస్కృతీ సంప్రదాయాలకు జీవం పోస్తున్నారన్నారు. ఈ సందర్శనలో మంత్రి వెంట రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎం.బాలసుబ్రహ్మణ్యరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.విశ్వ, లేపాక్షి ఓఎస్‌డీ ఐవీ లక్ష్మీనాథ్, మేనేజర్ ఎం.సురేష్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీధరాచార్యులు, సిబ్బంది ఉన్నారు.

'భోగాపురం' తనిఖీలను సీజీఎస్టీకి అప్పగించాలి

● సీటీఎస్‌ఏ తీర్మానం

విజయవాడ: విశాఖజిల్లా భోగాపురంలో ఏర్పాటు కానున్న విమానాశ్రయంలో తనిఖీలను కస్టమ్స్ విభాగానికి కాకుండా సెంట్రల్ జీఎస్టీ విభాగానికి అప్పగించాలని అఖిల భారత సెంట్రల్ టాక్స్ సూపరింటెండ్స్ అసోసియేషన్ తీర్మానించింది. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘ జాతీయ అధ్యక్షుడు హర్పల్‌సింగ్, లోక్‌నాథ్, రవిమాలిక్, యుగంధర్‌కుమార్, మూర్తి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. గన్నవరంలోని విజయవాడ విమానాశ్రయంలో సీజీఎస్టీ అధికారులే సోదాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ మాదిరిగానే భోగాపురం విమానాశ్రయంలో తనిఖీలను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన జీఎస్టీ అధికారుల క్యాడర్ కంట్రోల్ అథారిటీ ప్రస్తుతం హైదరాబాద్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ పరిధిలో ఉందన్నారు. దాన్ని విశాఖపట్నం జీఎస్టీ చీఫ్ కమిషనర్ పరిధిలోకి తేవాలని సమావేశంలో తీర్మానించారు.

జాతీయ ఫుట్‌బాల్‌లో నగరవాసి కిరణ్ సత్తా



విజయవాడ స్పోర్ట్స్: జమ్మూకాశ్మీర్‌లో జరిగిన జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో నగరానికి చెందిన ఆదెళ్ల జైకిరణ్ సత్తా చాటాడు. ఈ పోటీల్లో ఏపీ విజేత గా నిలిచింది. టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహించిన నగర కుర్రాడు కిరణ్ తన ప్రతిభతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సందర్భంగా కిరణ్‌ను, అతడి తల్లిదండ్రులకు అభినందనలు వెల్లువెత్తాయి.

'ఆడుదాం.... ఆంధ్రా' అవినీతిపై సీఐడీ విచారణ చేయాలి

ధర్నాచౌక్: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా'లో జరిగిన అవకతవకలపై సీఐడీ విచారించాలని జాతీయ కబాడీ మాజీ క్రీడాకారుడు, అత్యా, పాత్యా అసోసియేషన్ సీఈవో ఆర్‌డి ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఆడుదాం.. ఆంధ్రాలో మాజీ మంత్రి ఆర్‌కే రోజా, శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రూ.వంద కోట్ల నిధులతో నిర్వహించిన కార్యక్రమంలో రూ.వంద కోట్ల అవినీతి జరిగిందనడం హాస్యాస్పదమని మాజీ మంత్రి రోజా వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆడుదాం.. ఆంధ్రకు రూ 130 కోట్ల నిధులు మంజూరవగా, క్రీడాకారులకు నాసిరకం కిట్స్ వచ్చారన్నారు. శాప్‌లోని డీఎస్‌వోలను బదిలీలు చేసి వారిపై విచారణ చేయాలన్నారు. గత ప్రభుత్వంలో మెడికల్, ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటీ సీట్లు పొందిన క్రీడాకారుల జాబితాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సీఐడీతో విచారణ చేయకపోతే తన వద్ద ఉన్న ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

విశ్వబ్రాహ్మణులకిచ్చిన హామీలను అమలు చేయని వైసీపీ ప్రభుత్వం

ధర్నాచౌక్: విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆంధ్రప్రదేశ్ విశ్వకర్మ పంచవృత్తుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీబీ భాస్కర్‌బాబు విమర్శించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి తమకు న్యాయం చేస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో అయన మాట్లాడారు. ఎన్డీఏ కూటమి తమకిచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. చట్టసభల్లో విశ్వబ్రాహ్మణులకు అవకాశాలివ్వాలని, ఎమ్మెల్సీతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో చోటు కల్పించాలన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి తాటికొండ రంగబాబు, విశ్వకర్మ సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్పాడ చందు, పట్నాల సత్యనారాయణ, పెంటా కిరణ్, పట్నాల హరిబాబు, దమ్మర్ సింగ్ ప్రకాష్, సుధార్ ఉదయ్, కేల్లా శిశ పాల్గొన్నారు.

జర్నలిస్టు ప్రమాద బీమా పునరుద్ధరిస్తాం: మంత్రి హామీ

చిట్టినగర్, జూన్ 22: జర్నలిస్టులకు ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరిస్తామని, సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తానని మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రతినిధి బృందం శనివారం తాడిగడపలోని మంత్రి కార్యాలయంలో ఆయన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇళ్లస్థలాల సమస్యపై సీఎం చంద్రబాబుతో మాట్లాడి రాష్ట్రంలో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నెల 27న దివంగత రామోజీరావు సంస్మరణ సభను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని, జర్నలిస్టులందరూ పాల్గొనాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, వి.సోమసుందర్, కంచల జయరాజ్, ఏచూరి శివ, యూనియన్ బాపట్ల జిల్లా శాఖ అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు పాల్గొన్నారు.

అలరించిన సినీసంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ప్రిన్స్ మెలోడీస్ ఆధ్వర్యంలో సంగీతమే నాప్రాణం పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై శనివారం జరిగింది. గాయకులు రామభద్ర కుమార్, డానియల్, శ్రీనివాస్, అ మలారాణి, చందన సురేష్, మాధవి, సింధు, మల్లేశ్వరి, భావన, డేవిడ్ తదితరులు శ్రావ్యంగా సినీగీతాలు ఆలపించారు. నిర్వాహకులు ప్రిన్స్, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు.





లెనిన్ సెంటర్‌లో నీట్ రద్దు చేయాలని కోరుతూ సీపీఐ నేతల ధర్నా, ధర్నాచౌక్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

నీట్‌ను రద్దు చేయాలి: సీపీఐ

గవర్నర్‌పేట, జూన్ 22: పరీక్ష పేపర్ లీక్ నేపథ్యంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు జరిగే నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో శనివారం లెనిన్ సెంటర్‌లో నిరసన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలు, ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతున్నా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి రానున్న రోజుల్లో సుప్రీంకోర్టు పర్యవేక్షణలో మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రం లీక్ విషయంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని, లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు మాట్లాడుతూ దేశాల మధ్య యుద్ధాలను ఆపగలిగే సామర్థ్యం ఉన్న నరేంద్ర మోదీ పేపర్ లీక్‌ను ఆపలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నిరసనలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు, సీపీఐ నేతలు కేవీవీ ప్రసాద్, పి.జమలయ్య, నక్కా వీరభద్రరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చుని ఎస్ఎఫ్ఐ నేతల వినూత్న నిరసన

ధర్నాచౌక్: నీట్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కే ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని, నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో శనివారం నిరసన ప్రదర్శన జరిగింది. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ మోకాళ్లపై నిల్చుని వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ నీట్ పరీక్షల నిర్వహణలో లీకేజ్ జరగడం విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టడమేనన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటీఏ, కేంద్ర ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరించి విద్యా వ్యవస్థను అపహాస్యం చేస్తుందని మండిపడ్డారు. ఎన్‌టీఏను రద్దు చేసి వైద్య కోర్సుల ప్రవేశ పరీక్షను రాష్ట్రాల పరిధిలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ భారీ అవినీతికి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి కుమారస్వామి, నగర నేతలు భవనేశ్వర్, షణ్ముక్, జ్వలిత, అవినాష్, ఉషా, యశస్వినిదేవి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రైళ్ల సమయపాలన తప్పనిసరి

● దక్షిణ మధ్య రైల్వే ఆపరేషన్స్ చీఫ్ ప్రిన్సిపల్ మేనేజర్ నాగయ్య



సిబ్బంది లాబీ, కార్యాలయాలను తనిఖీ చేసిన నాగయ్య

రైల్వేస్టేషన్, జూన్ 22: రైళ్ల రాకపోకలకు సంబంధించి ఖచ్చితంగా సమయపాలనను అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే ఆపరేషన్స్ చీఫ్ ప్రిన్సిపల్ మేనేజర్ బీ నాగయ్య అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం సిబ్బంది లాబీ, ఇతర కార్యాలయాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రయాణికులకు సురక్షిత, సౌకర్యవంతమైన, సమయపాలనతో కూడిన సేవలందించడమే మొదటి ప్రాధాన్యతన్నారు. స్టేషన్‌లో వసతులు, సౌకర్యాలను పరిశీలించి ఇంకా మెరుగైన ఫలితాలు రావాలని సూచించారు. క్రూలాబీలో లోకో పైలట్లు, సహాయ లోకో పైలట్లతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం సేఫ్టీ సెమినార్‌లో పాల్గొని ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ విధానంపై అవగాహన కల్పించారు. అన్ని రైళ్ల సమయపాలనపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు విజయవాడ-రాయనపాడు మధ్య జరుగుతున్న మూడోలైన్ పనులను పరిశీలించారు. సీనియర్ డివిజనల్ మేనేజర్ నరేంద్రవర్మ, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్, ఏడీఈఈ రవితేజ, ఏవోఎం పీ రంజిత్‌కుమార్, స్టేషన్ డైరెక్టర్ శైలజ పాల్గొన్నారు.

కేశినేని నాని, వెలంపల్లి ముంచేశారు

● వైసీపీకి నందెపు జగదీష్ రాజీనామా

పాయకాపురం, జూన్ 22: వైసీపీ నేతలు మాజీ ఎంపీ కేశినేని నాని, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ తనకు మాయమాటలు చెప్పి వైసీపీలోకి తీసుకెళ్లి తనను నట్టేట ముంచేశారని ఆ పార్టీ నేత, మాజీ కార్పొరేటర్ నందెపు జగదీష్ గొల్లుమన్నారు. ఇటీవల ప్రకాష్‌నగర్‌లో నందెపు జగదీష్ చేపట్టిన అక్రమ నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. శనివారం విలేకర్ల సమావేశంలో జగదీష్ మాట్లాడుతూ 30ఏళ్లుగా టీడీపీలో కొనసాగానని, కార్పొరేటర్‌గా కూడా చేశానని, తిరువూరు ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించి అక్కడా పనిచేశానన్నారు. తాను ఎమ్మెల్యే స్థాయికి వెళ్లడం ఇష్టంలేక బొండా ఉమా తనను వేధింపులకు గురిచేయడంతోనే వైసీపీలో చేరాల్సి వచ్చిందన్నారు. వైసీపీ నేతలు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాస్ తన ఇంటికొచ్చి బతిమలాడి అండగా ఉంటానని హామీ ఇవ్వడంతో వైసీపీకి పని చేశానని దీనిపై కక్ష కట్టిన బొండా ఉమా అనుమతులు లేవనే సాకుతో తన భవనాలను కూలగొట్టించారన్నారు. అండగా ఉంటామన్న కేశినేని నాని, వెలంపల్లి పారిపోయారని, తాను ఏకాకిగా మిగిలిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే పార్టీకి రాజీనామా చేశానన్నారు. పగలు ప్రతీకారాలుంటే బొండా ఉమా పైస్థాయిలో చూసుకోవాలే తప్ప తన లాంటి చిన్న వాళ్లను, సాధారణ వ్యక్తులను టార్గెట్ చేయకూడదని కోరారు.

మానసిక ప్రశాంతతకు ధ్యానం: ఈవో

దుర్గగుడిలో పౌర్ణమి సందర్భంగా ధ్యానయజ్ఞం





గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు, ధర్మపథ వేదికపై నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

వన్‌టౌన్, జూన్ 22: మనస్సు ప్రశాంతతకు ధ్యానం అవసరమని ఈవో కేఎస్ రామారావు అన్నారు. శనివారం పౌర్ణమి సందర్భంగా మహామండపం ఆరో అంతస్తులో ధ్యానయజ్ఞాన్ని నిర్వహించారు. తొలుత ఆయన అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అర్చనలు నిర్వహించిన తరువాత జ్ఞానయజ్ఞాన్ని ప్రారంభించి మాట్లాడారు. మనస్సు ప్రశాంతతకు ధ్యానం ఎంతో ఉపకరిస్తుందన్నారు. ధ్యానయజ్ఞాన్ని రెండో పర్యాయం నిర్వహిస్తున్నామని, 400 మంది ధ్యానపరులు వచ్చారని, వారందరికీ అమ్మవారి ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు. పౌర్ణమి రోజున ఆలయంలో ధ్యానయజ్ఞం నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు ఉదయం 9 నుంచి రాత్రి 9గంటల వరకు ధ్యానంలో పాల్గొనే అవకాశం కల్పించినట్టు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో దేవదాయ కమిషనర్

దుర్గమ్మను శనివారం దేవదాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కమిషనర్ సత్యనారాయణ దర్శించుకున్నారు ఆయనకు ఈవో రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

మూలానక్షత్రం సందర్భంగా సరస్వతీ యాగం

మూలానక్షత్రం సందర్భంగా ఆలయంలోని లక్ష్మీగణపతి స్వామి మందిరం పక్కన ఏర్పాటు చేసిన యాగశాలలో అర్చక బృందం సరస్వతీ యాగం నిర్వహించింది. ఈవో రామారావు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ

పౌర్ణమి సందర్భంగా శనివారం ఉదయం గిరిప్రదక్షణ నిర్వహించారు దుర్గగుడి ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమైంది. అలంకరించిన వాహనంపై గంగా పార్వతీమల్లేశ్వరుల ఉత్సవ మూర్తులను ఉంచారు లఘు అర్చనానంతరం హారతులు సమర్పించారు వాహనం ముందు పసుపు, కుంకుమలు వేసిన అన్నపురాశి పోసి బలిహరణ సమర్పించారు ఈవో రామారావు కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చారు. మేళతాళాలు, భక్తుల కోలాహలం మధ్య గిరి ప్రదక్షణ బయలుదేరింది స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకుడు ఆర్ శ్రీనివాసశాస్త్రి, ఏఈవోలు పాల్గొన్నారు. భక్తుల జయ జయ ధ్వానాలు, కోలాటాలు శంఖనాదాల నడుమ గిరి ప్రదక్షణ సాగింది.

నేడు ఒలింపిక్ డే రన్

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 22: పారిస్‌లో వచ్చే నెల 26 నుంచి ప్రారంభమయ్యే ఒలింపిక్స్‌లో భారత్‌తో పాటు, రాష్ట్ర క్రీడాకారులు సత్తాచాటి పతకాలను సాధించాలని కాంక్షిస్తూ 'లెట్ అజ్ మూవ్' అన్న నినాదంతో ఉమ్మడి ఒలింపిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉదయం 7 గంటలకు ఐజీఎంసీ నుంచి ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాదెళ్ల బ్రహ్మాజీరావు, పద్మజాబాల తెలిపారు. ఐజీఎంసీ స్టేడియంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వివిధ క్రీడాకారులు, కోచ్‌లు, అసోసియేషన్ ప్రతినిధులు 450 మందితో స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు, అక్కడ నుంచి స్టేడియం వరకు 6 కిలోమీటర్ల మేర రన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో రిజిస్టర్ అయిన ప్లేయర్స్‌కు జెర్సీలు, స్నాక్స్‌ను అందిస్తున్నామన్నారు. ఇటీవల ప్రపంచ స్కేటింగ్‌లో స్వర్ణం సాధించిన జెస్సీరాజ్ హాజరవుతుందన్నారు. ఈ రన్‌ను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని, అర్జున అవార్డీ, ప్రముఖ వాలీబాల్ రిటైర్డు ప్లేయర్ రమణరావు విశిష్ట అతిథిగా వస్తున్నారన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఈదా సులోచన, రాజేంద్రప్రసాద్, ఈసీ మెంబర్లు దయాకర్‌రావు, రవిశంకర్ పాల్గొన్నారు.

అనధికారిక నిర్మాణం తొలగింపు



అనధికార కట్టడాన్ని తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

చిట్టినగర్, జూన్ 22: పశ్చిమ పరిధిలోని కామకోటి నగర్ కన్యకాపరమేశ్వరి కల్యాణమండపం ఎదురుగా అనధికారికంగా అదనపు అంతస్తు భవన నిర్మాణాన్ని వీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు. అనధికార కట్టడంపై కొనసాగుతున్న వసూళ్ల దందా, అనధికార కట్టడాలపై వైసీపీ వారిదే పెత్తనం అనే శీర్షికన ఈ నెల 22న ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. కమిషనర్ స్పందించి టౌన్ ప్లానింగ్ అధికారులను అనధికార కట్టడం చర్యలు తీసుకోవాలని ఆదేశాలివ్వడంతో చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్ పర్యవేక్షణలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ గంధం ప్రసాద్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అనధికార కట్టడాన్ని తొలగించారు. వీఎంసీ టౌన్‌ప్లానింగ్‌లో వైసీపీ నేతల హవా కొనసాగిస్తూ, మాజీమంత్రి వెల్లంపల్లి అనుచరులతోపాటు వీఎంసీలో కీలకస్థానంలోని మహిళా ప్రజా ప్రతినిధి భర్త కనుసన్నల్లో వసూళ్ల దందా నడుస్తోందని, నూతన భవన నిర్మాణాల ప్లాన్ అనుమతి నుంచి కొత్త నిర్మాణాలకు పన్ను వేయడం, అనధికార కట్టడాల జోలికి వీఎంసీ అధికారులు కన్నెత్తి చూడకుండా దందాలు చేస్తున్నారు. నగరంలో అనుమతి లేకుండా ఏ అనధికార కట్టడాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

వెహికల్ ఫైనాన్స్ రంగం అభివృద్ధికి కృషి

● మంత్రి కొల్లు రవీంద్ర

లబ్బీపేట, జూన్ 22: వెహికల్ ఫైనాన్స్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం సహకారిస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎంజీ రోడ్డులోని మురళీఫార్చ్యూన్ హోటల్ నందు శనివారం ది కృష్ణాడిస్ట్రిక్ ఆటో ఫైనాన్సియర్స్ అసోసియేషన్ స్వర్ణోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ 1974లో ఆరుగురు సభ్యులతో ప్రారంభమైన సంస్థ నేడు 170 మందితో విజయవంతంగా ముందుకు సాగడం, 50 వసంతాల స్వర్ణోత్సవ వేడుకల్లో నేను అతిథిగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఫైనాన్స్ రంగానికి పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. శ్రీరామ్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఉమేష్ జీ రేవంకర్, శ్రీరామ్ ఫైనాన్స్ ఎండీ చక్రవర్తి, ఎఫ్ఐహెచ్ పీపీ చైర్మన్ పూర్ణచంద్రరావు, అసోసియోషన్ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, కార్యదర్శి నాగార్జున, చైర్మన్ జీజేసి కమిటీ వీజీకే ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రకు ఐలా సన్మానం



ఆటోనగర్: మంత్రి కొల్లు రవీంద్రను ఆటోనగర్ ఐలా ప్రతినిధులు శనివారం భారతీనగర్‌లోని మంత్రి నివాసంలో కలిసి సన్మానించారు. ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ నేతృత్వంలోని ఐలా ప్రతినిధుల బృందం మంత్రి కొల్లును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆటోనగర్ అభివృద్ధికి సహకారాన్ని కోరగా తప్పనిసరిగా అవసరమైన సహకారాన్ని అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఐలా సెక్రటరీ అన్నే శివనాగేశ్వరరావు, డాక్టర్ అబ్దుల్ కలాం, బెవర నాగేశ్వరరావు, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, షేక్ బాజీ షరీఫ్, బీ శ్రీరాములు, షేక్ హుస్సేన్, డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మంత్రి గొట్టిపాటికి విద్యుత్ ఉద్యోగుల సంఘం సత్కారం

ధర్నాచౌక్: మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను రాష్ట్ర విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది. శనివారం మంత్రి కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి మెమెంటోతో బహూకరించారు. విద్యుత్ ఉద్యోగులు రాష్ట్రానికి వెన్నుముక అని, బీసీ ఉద్యోగుల సమస్యలపై సమగ్రంగా చర్చిస్తానని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బలోపేతానికి ఉద్యోగులందరూ కృషి చేయాలన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ కోసెట్టి అప్పారావు, ఈపీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు కే సాయిబాబా, ఏపీసీపీడీసీఎల్ అధ్యక్షుడు ఎస్.పాపారావు, సంఘం జాయింట్ సెక్రటరీ బి.నరసింహామూర్తి, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్రావు పాల్గొన్నారు.



శ్రీనివాసరాజు పాదయాత్రకు హాజరైన మంత్రి కొల్లు, ఎమ్మెల్యే ఉమా

ఎస్ఎల్‌వీ చైర్మన్, ఎండీ పెన్మత్స పాదయాత్ర

భారతీనగర్, జూన్ 22: ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రాల్లో తెలుగు దేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రబాబు సీఎం కావాలని తిరుమలకు పాదయాత్ర చేస్తానని ఎస్ఎల్‌వీ చైర్మన్, ఎండీ పెన్మత్స శ్రీనివాసరాజు మొక్కుకున్నారు. మొక్కు చెల్లించుకోవడానికి ద్వారకా తిరుమలకు పాదయాత్ర చేయనున్న సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, పట్టాభిరామ్, మాజీ ఎమ్మెల్యే రామరాజు పాల్గొని పెన్మత్స పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి కావాలని కోరుకున్నారు. అనంతరం శ్రీనివాసరాజు రామవరప్పాడు నుంచి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి పాదయాత్రను శనివారం ప్రారంభించారు. మంత్రి కొల్లు, ఎమ్మెల్యే బొండా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు స్వర్ణయుగం వచ్చిందని, చంద్రబాబు పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళుతుందన్నారు.



కేకేను సత్కరిస్తున్న సుజనా చౌదరి, కామినేని తదితరులు

కేకే సంస్థ అధినేతకు ఘన సత్కారం

ధర్నాచౌక్, జూన్ 22: రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కేకే సంస్థ అధినేత కిరణ్ కొండేటి నిష్పక్షపాతంగా ఎగ్జిట్‌పోల్స్ ప్రకటించడం అభినందనీయమని ఎమ్మెల్యే సుజనాచౌదరి తెలిపారు. దీక్ష మీడియా ఆధ్వర్యం లో 'ఇంటరాక్షన్ విత్ కేకే' గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో శనివారం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న బీజేపీ ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, జనసేన నేత బాడిత శంకర్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ కేకే సంస్థ అధినేత కిరణ్ కొండేటిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ప్రజల నాడిని తెలుసుకోవడంలో కిరణ్ సఫలమయ్యారన్నారు. కిరణ్ కొండేటి మాట్లాడుతూ తమ ఓటమికి కారణాలు తెలుసుకుని తప్పులు సరిదిద్దుకుని ముందుకు సాగాలని రాజకీయ పార్టీలకు సూచించారు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకూడదన్నారు. తాము ఎప్పుడు ఏ రాజకీయ పార్టీతో కలిసి పని చేయలేదన్నారు. తమ సంస్థను దేశవ్యాప్తంగా విస్తరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీక్ష మీడియా అధినేత జొన్న రాజేష్ మాట్లాడుతూ కేకే సర్వేలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు.



స్కేటింగ్ చాంపియన్‌కు ఎంపీ అభినందన

విద్యాధరపురం, జూన్ 22: ఇటీవల న్యూజిల్యాండ్‌లో జరిగిన వరల్డ్ స్కేట్ ఓషినియా ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని వరుసగా వెండి, రజత పతకాలను సాధించిన పీ తేజేష్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. తేజేష్‌ను ప్రోత్సహించిన బాలసుబ్రహ్మణ్యాన్ని సైతం అభినందించారు. అరండల్‌పేటకు చెందిన తేజేష్‌ను శనివారం తన కార్యాలయానికి పిలిపించుకున్న శివనాథ్ అతనికి అభినందనలు తెలపారు. స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



జన దర్బార్‌లో జనసేన కార్యాలయం బయట ప్రజల వినతులు స్వీకరిస్తున్న పవన్

జనసేనాని 'జన దర్బార్'

- ప్రజల సమస్యలు విన్న పవన్
- అసెంబ్లీ నుంచి వచ్చి పార్టీ ఆఫీస్ బయటే కూర్చొని బాధితులకు భరోసా.. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన దర్బార్ పేరిట ప్రజలకు కలిసే కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం అసెంబ్లీ నుంచి తిరిగి వస్తూ జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వెలుపల బాధితుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ వద్ద కూర్చొని స్వయంగా అర్జీలు స్వీకరించారు. ప్రజల కష్టాలను ఓపికగా విన్నారు. పరిష్కరిస్తానంటూ భరోసా ఇచ్చి పంపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేశారు. ఇప్పుడూ అదే స్ఫూర్తితో జన దర్బార్ నిర్వహించారు. బాధితులతో ప్రత్యేకంగా మాట్లాడి, వారి సమస్యలు విన్నారు. పరిష్కారానికి హామీ ఇచ్చారు.బాధితులు చెప్పిన కొన్ని సమస్యలు ఇవీ..

కుమార్తె అదృశ్యం...

విజయవాడలో చదువుకుంటున్న తన మైనర్ కుమార్తెను ప్రేమ పేరిట ట్రాప్ చేశారని, తొమ్మిది నెలలుగా ఆమె జాడ తెలియడం లేదని భీమవరం నుంచి వచ్చిన శివకుమారి కన్నీటితో మొరపెట్టుకున్నారు. తన కూతురు చదువుకునే ప్రాంతం విజయవాడ కమిషనరేట్ పరిధిలోనిది కావడంతో మాచవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఆమె జాడ తెలిసినా పోలీసులు స్పందించడం లేదని తెలిపారు. వెంటనే స్పందించిన ఉపముఖ్యమంత్రి మాచవరం సీఐకి ఫోన్ చేసి కేసు వివరాలు తెలుసుకున్నారు. చర్యలకు ఆదేశించారు. బాధితులను పార్టీ వాహనంలోనే మాచవరం పోలీస్‌స్టేషన్‌కు పంపించారు.

మనవళ్లు వేధిస్తున్నారు..

ఇంటి కోసం సొంత మనవళ్లే వేధిస్తున్నారని, హింసిస్తున్నారని మాచర్ల నియోజకవర్గం రెంటచింతల ప్రాంతానికి చెందిన మత్స్యకారులైన జంపయ్య దంపతులు పవన్ కల్యాణ్‌కు విన్నవించుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రెవెన్యూ, పోలీస్ అధికారులతో మాట్లాడతానని పవన్ హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లాకు చెందిన సువర్ణ తన కుమారుడికి బ్రెయిన్ ఆపరేషన్ కోసం ఆర్థిక సాయం చేయాలని కోరారు. జగయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి పాటి నాగరాజు తనను రాజకీయ కారణాలతో కక్షకట్టి ఉద్యోగం నుంచి తొలగించారని, తనను ఆదుకోవాలని వినతిపత్రం అందించారు. 30 మంది దివ్యాంగులు తమ సమస్యలను చెప్పుకొనేందుకు రాగా, వారందరితో మాట్లాడిన పవన్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కాలుష్య నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్

- కృష్ణా, గోదావరి శుద్ధీకరణపై దృష్టి
- ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ బలోపేతానికి పవన్ ఆదేశాలు

రాష్ట్రంలో కాలుష్య నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం తన నివాసంలో అధికారులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ప్రతి జిల్లాలో కాలుష్యం లెక్కలు తీసి, ఏఏ పరిశ్రమల నుంచి ఎంతెంత కాలుష్యం విడుదలవుతోందో సమగ్ర నివేదిక ఇవ్వాలి. పొల్యూషన్ ఆడిట్ కచ్చితంగా చేపట్టాలి. ప్రతి జిల్లాలో పరిశ్రమల వారీగా జల, వాయు కాలుష్యం వివరాలు అందించాలి. నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలను తెలపాలి. కృష్ణా, గోదావరి తీరాల్లో కాలుష్యం, కాగిత పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యంపైనా కూలంకషంగా సమీక్షించాలి. రెండు జీవ నదుల శుద్ధీకరణపైనా దృష్టి పెట్టాలి' అని అధికారులకు నిర్దేశించారు. రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేస్తామని చెప్పారు. ఏపీ నుంచి స్మగ్లర్లు తరలించిన 172 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం నేపాల్‌లో భద్రత సిబ్బందికి పట్టుబడిందని అధికారులు చెప్పగా, దానిని ఇక్కడికి తీసుకురావాలన్నారు. దేశంలోనూ ఎర్రచందనం ఎక్కడెక్కడ ఎంత పట్టుబడిందో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన

- తెల్లవారుజాము నుంచే జనం బారులు
- ఓపిగ్గా వినతులు స్వీకరిస్తున్న నారా లోకేశ్



ఉండవల్లిలో దివ్యాంగుడి నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న లోకేశ్

తాడేపల్లి, జూన్ 22: మంత్రి నారా లోకేశ్ తన నియోజకవర్గ ప్రజల కోసం ప్రారంభించిన ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. కేవలం మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలు లోకేశ్‌కు చెప్పుకొంటున్నారు. తెల్లవారుజామునే ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వద్ద ప్రజలు బారులు తీరి అర్జీలు అందిస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి లోకేశ్ ఓపిగ్గా వినతులు స్వీకరిస్తూ భరోసా ఇస్తున్నారు. సమస్యలను సంబంధిత శాఖలకు పంపి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశిస్తున్నారు. శనివారం ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతులు వెల్లువెత్తాయి.

అసోం వరదల్లో 37 మంది మృతి

- 4 లక్షల మంది జీవితాలు ప్రభావితం

గువాహటీ, జూన్ 22: అసోం వరదల్లో మృతుల సంఖ్య 37కు చేరింది. మరొకరు గల్లంతయ్యారు. సుమారు 4 లక్షల మంది వరద ప్రభావానికి గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ 19 జిల్లాల్లో పరిస్థితి ఇంకా దయనీయంగానే ఉందని అధికారులు శనివారం వెల్లడించారు. వరద ప్రభావానికి గురైన ప్రజల సంఖ్య గురువారం 4.09 లక్షలు ఉండగా, శుక్రవారం సాయంత్రానికి అది 3,90,491 కు తగ్గింది. ఒక్క కరీంగంజ్ జిల్లాలోనే 2.40 లక్షల మంది వరద ప్రభావానికి గురయ్యారు. అన్ని నదులూ ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. 100కుపైగా పునరావాస క్యాంపుల్లో 15 వేలమందికిపైగా ఆశ్రయం పొందుతుండగా, మరో 125 ఆహార పంపిణీ కేంద్రాల ద్వారా బాధితులకు ఆహారం, తాగునీరు అందజేస్తున్నారు. ఇళ్లు, పశువుల పాకలు, రోడ్లు, వంతెనలు, ఆనకట్టలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. కాగా, అసోంను వరద రహిత రాష్ట్రంగా చేస్తామని హామీ ఇచ్చిన 'డబుల్ ఇంజిన్ మోదీ-అమిత్‌షా' ఆ రాష్ట్ర ప్రజలను దగా చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. మృతుల కుటుంబాలకు 'ఎక్స్'లో ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సైతం సహాయ, పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని అసోం ప్రభుత్వాన్ని కోరారు. ప్రభావిత ప్రజలను కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కూడా సాధ్యమైనంత వరకు ఆదుకోవాలని 'ఎక్స్'లో ఆమె పిలుపునిచ్చారు.

హౌసింగ్‌లో 'జగన్ అభిమాను'లకు

ఉద్వాసన

- ఏళ్ల తరబడి కీలక స్థానాల్లో రిటైర్డ్ అధికారుల తిష్ట
- చీఫ్ ఇంజనీర్, జీఎం(ఫైనాన్స్) స్థానాల్లోనూ రిటైరైనవారే
- వేల కోట్ల రూపాయల లావాదేవీలన్నీ వారి చేతుల మీదుగానే..
- వెంటనే రాజీనామాలు సమర్పించాలని ఎండీ గిరీషా ఉత్తర్వులు



అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణ శాఖలో పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఏళ్ల తరబడి కీలక స్థానాల్లో కొనసాగుతున్న జగన్ అభిమాన అధికారులు, ఉద్యోగులకు ఉద్వాసన పలికేందుకు రంగం సిద్ధమైంది. వైసీపీ పాలనలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ పూర్తిగా గాడి తప్పింది. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం పేరు చెప్పి కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. పని భారాన్ని సాకుగా చూపి కార్పొరేషన్‌లో లేని పోస్టులను సైతం సృష్టించి తమకు కావలసినవారిని ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి కీలక స్థానాల్లో నియమించుకున్నారు. జగన్ అభిమానులుగా ముద్ర వేసుకున్న అధికారులు, ఉద్యోగులను రిటైరైన తర్వాత కూడా అవే స్థానాల్లో తిరిగి నియమించుకుని ఏళ్ల తరబడి కొనసాగిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు కూడా వైసీపీ అభిమానులుగా చెప్పుకునే పలువురు అధికారులకు రీ-ఎంప్లాయిమెంట్‌తోపాటు సకల సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారందరికీ చుక్కెదురైంది. ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో తిరిగి నియమించుకున్న రిటైర్డ్ అధికారులు, ఉద్యోగుల నుంచి ఈనెల 24వ తేదీలోపు రాజీనామాలు తీసుకుని ఆమోదించాలని కొత్త ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ పీఎస్ గిరీషా చర్యలు చేపట్టారు. కార్పొరేషన్‌లో 30 మందికిపైగా ఉన్న రీఎంప్లాయిడ్ అధికారులు, ఉద్యోగులందరూ వెంటనే రాజీనామాలను సమర్పించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.వేల కోట్ల ఆర్థిక లావాదేవీలను తమ చేతుల మీదుగా నిర్వహిస్తూ.. సకల సౌకర్యాలు అనుభవిస్తున్న వారంతా ఇప్పుడు హౌసింగ్ కార్పొరేషన్‌ను వీడాల్సిన పరిస్థితి ఎదురైనందుకు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వెంటనే రాజీనామాలు సమర్పించాలని ఎండీ ఉత్తర్వులు జారీ చేసినా ఇంతవరకు ఒక్కరు కూడా రాజీనామా సమర్పించకపోవడం గమనార్హం.

ప్రధాన కార్యాలయంలోనే 12 మంది..

విజయవాడలోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోనే అత్యంత కీలకమైన ఇంజనీరింగ్, పరిపాలన విభాగాల్లో దాదాపు డజను మంది వరకు రిటైర్డ్ అధికారులు ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారు. జిల్లాల్లోనూ మరో 25 మంది వరకు రిటైర్డు అధికారులను కీలక స్థానాల్లో నియమించారు. ప్రధాన కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగంలో చీఫ్ ఇంజనీరు జీవీ ప్రసాద్ రెండేళ్ల క్రితమే రిటైరైనా ఇప్పటికీ సీఈగానే కొనసాగుతున్నారు. పరిపాలన విభాగంలో కీలకమైన ఫైనాన్స్ విభాగం జనరల్ మేనేజర్ శ్రీరాములు ఏడాది క్రితమే పదవీ విరమణ చేశారు. అయినప్పటికీ జీఎం(ఫైనాన్స్)గా ఆయనే ఇప్పటికీ కొనసాగుతున్నారు. ఇక్కడే సూపరింటెండెంట్ ఇంజనీరుగా పనిచేసిన కె.వెంకటరెడ్డి మూడేళ్ల క్రితమే పదవీ విరమణ చేశారు. వైసీపీకి వీరభక్తుడిగా పేరున్న ఆయన కోసం హౌసింగ్ కార్పొరేషన్‌లో లేని కన్సల్టెంట్ పోస్టును సృష్టించారు. జగన్ పేషీ నుంచి ప్రత్యేకంగా ఉత్తర్వులు తెచ్చుకున్న వెంకటరెడ్డి కన్సల్టెంట్‌గా కొనసాగుతూ.. తరచూ ఢిల్లీకి చక్కర్లు కొడుతూ అధికార దర్పాన్ని వెలగబెడుతున్నారని హౌసింగ్ వర్గాలు చెబుతున్నాయి. చిత్తూరు జిల్లాలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.మధుసూదనరెడ్డి మార్చిలో పదవీ విరమణ చేశారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిఫారసు మేరకు ఆయనను అదే స్థానంలో అదే హోదాతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా నియమిస్తూ అప్పటి హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ కె.వి.రమణారెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు హౌసింగ్ వర్గాలు చెబుతున్నాయి. సత్యసాయి జిల్లాలో హౌసింగ్ హెడ్‌గా రిటైరైన ఎం.చంద్రమౌళిరెడ్డి కోసం అక్కడ ఓఎస్డీ పోస్టును సృష్టించి మరీ ఆయనను కొనసాగిస్తున్నారు. విశాఖపట్నంలో ఇద్దరు రిటైర్డ్ అధికారులు డీఈలుగా కొనసాగుతున్నారు. ఇలా వైసీపీ ప్రభుత్వానికి వీరవిధేయులుగా పని చేసిన పలువురు అధికారులను రిటైరైనా అవేస్థానాల్లో కొనసాగిస్తూ ఇంతకాలం పోషిస్తూ రావడం వల్ల అనవసరపు ఆర్థిక భారంతోపాటు.. వారి హయాంలో వేల కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయని, వాటన్నింటిపైనా విచారణ చేయించాలని హౌసింగ్ వర్గాలే డిమాండ్ చేస్తున్నాయి.

మాతృశాఖకు ఈడీ సరెండర్

మాజీ సీఎం జగన్ కార్యాలయంలో అదనపు కార్యదర్శిగా ఉన్న ఐఏఎస్ అధికారి భరత్‌గుప్తా అంతకుముందు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన ఎండీ బాధ్యతలు చేపట్టిన తర్వాత హౌసింగ్ కార్పొరేషన్‌లో లేని జేఎండీ పోస్టును సృష్టించి.. ఆ స్థానంలో ఐఎఫ్ఎస్ అధికారి శివప్రసాద్‌ను డిప్యూటేషన్‌పై తీసుకువచ్చి కూర్చోబెట్టారని హౌసింగ్ వర్గాలు చెబుతున్నాయి. వారిద్దరి కాంబినేషన్‌లో హౌసింగ్ కార్పొరేషన్‌లో భారీఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. భరత్‌గుప్తా సీఎంవోకు బదిలీ అయిన అనతికాలంలోనే హౌసింగ్ జేఎండీ శివప్రసాద్‌రెడ్డి కూడా బదిలీ అయ్యారు. దాంతో ఆ జేఎండీ పోస్టు కూడా రద్దయ్యింది. ఆ తర్వాత భరత్‌గుప్తా దగ్గర ఓఎస్డీగా ఉన్న జైళ్ల శాఖ అడిషనల్ సూపరింటెండెంట్ బి.చంద్రశేఖర్‌ను డిప్యుటేషన్‌పై హౌసింగ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా గత డిసెంబరులో నియమించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో చంద్రశేఖర్ మాతృశాఖకు బదిలీ చేస్తూ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ పి.ఎస్.గిరీషా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోనే సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు)గా పని చేస్తున్న సీనియర్ అధికారి సి.జయరామాచారికి ఈడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

నీలాగ ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికను కూల్చలేదుగా!

- జగన్‌కు బుద్దా వెంకన్న కౌంటర్

విజయవాడ(వన్‌టౌన్), జూన్ 22: అనుమతులు లేకుండా గుంటూరు జిల్లా సీతానగరంలోని ఇరిగేషన్ స్థలంలో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయాన్ని అధికారులు కూల్చేయడంపై ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పందనకు దీటుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న కౌంటర్ ఇచ్చారు. 'ప్రభుత్వ భూములలో అనుమతులు లేకుండా అవినీతి సొమ్ముతో నిర్మిస్తున్న కట్టడాలను సంబంధిత అధికారులే కూలగొట్టారు. అంతేగానీ, నీలాగా ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికను కూల్చలేదుగా!' అని ట్వీట్ చేశారు.

చైనా కంపెనీల వీసా అక్రమాలు

- 2020కి ముందు ఈ-వీసా పథకం దుర్వినియోగం
- గుర్తించిన ఇంటెలిజెన్స్, ఆర్థిక దర్యాప్తు సంస్థలు

న్యూఢిల్లీ, జూన్ 22: భారత్‌లోకి చైనా ఉత్పత్తుల దిగుమతుల్లో అనేక అవకతవకలను జాతీయ భద్రతా ఏజెన్సీలు గుర్తించాయి. వీసాల కోసం చైనా కంపెనీలు సరైన డాక్యుమెంటేషన్ చేయకపోవడం, స్థానిక పన్నుల ఎగవేత, హోంశాఖ పరిశీలను దాటవేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 2020కి ముందు ఈ-వీసా పథకాన్ని పెద్దఎత్తున దుర్వినియోగం చేసినట్లు భారత ఇంటెలిజెన్స్, ఆర్థిక దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. వీసా రెన్యువల్ చేయించకుండానే కొందరు చైనీయులు భారత్‌లో ఎక్కువ కాలం నివాసం ఉండటమే కాకుండా అరుణాచల్‌ప్రదేశ్, జమ్మూ కశ్మీర్ వంటి సరిహద్దు రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం ప్రయాణించారని ఆ వర్గాలు తెలిపాయి. వీసా కేటగిరీలను తప్పుగా ప్రకటించడం ద్వారా ప్రస్తుత వీసా విధానాన్ని కూడా కొన్ని చైనా కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మూడు మంత్రిత్వ శాఖల అధికారులు పేర్కొన్నారు. పారిశ్రామిక యూనిట్ల స్థాపన, ప్రారంభం కోసం ఎంప్లాయిమెంట్ వీసాకు దరఖాస్తు చేయాల్సి ఉండగా, కొన్ని చైనా సంస్థలు బిజినెస్ వీసాల కోసం దరఖాస్తు చేస్తున్నాయని వివరించారు. 2018లో చైనా కంపెనీలకు 48వేల బిజినెస్ వీసాలు జారీ కాగా, అదే సమయంలో ఈ-వీసాల సంఖ్య 1,50,000గా నమోదైంది. ఇక 2019లో చైనీయులకు జారీ చేసిన బిజినెస్ వీసాలు 19వేలు అయితే ఆదే ఏడాది ఈ-వీసాల సంఖ్య 2లక్షలకు పెరిగింది. 2020లో గల్వాన్ ఘర్షణల తర్వాత వీసాల జారీపై కేంద్రం ఉక్కుపాదం మోపింది. 2023-24లో 2,500 వ్యాపార వీసాలు, మరో 3వేల ఈ-వీసాలు మాత్రమే చైనా కంపెనీలు, కార్మికులకు మంజూరయ్యాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యే వరకూ వీటి సంఖ్య పెరిగే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు.

అమర్ అక్రమ నిర్మాణం

- నాడు వైసీపీ మంత్రిగా అధికార దుర్వినియోగం
- జీవీఎంసీ అనుమతి లేకుండానే షాపింగ్‌మాల్ నిర్మాణం
- జాతీయ రహదారిని ఆనుకుని జీ+4 భవనం
- సెట్‌బ్యాక్‌లు విడిచి పెట్టకుండా నిర్మాణం
- నోటీసులు జారీచేసినా బేఖాతర్
- జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి
- మంత్రిగా ఉండడంతో చర్యలకు వెనుకాడిన అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



గాజువాకలో జాతీయ రహదారిని అనుకుని ప్లాన్ లేకుండానే నిర్మించిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ షాపింగ్‌మాల్

వైసీపీ పాలనలో గుడివాడ అమర్‌నాథ్ మంత్రిగా ఒరగబెట్టిందేమీ లేకపోయినా ఆయన ఎక్కడకు వెళ్లినా హడావుడి మాత్రం తక్కువేంలేదు! అధికార పార్టీ మంత్రి కావడంతో అధికారులు సైతం ఆయన ఆదేశాలకు 'జీ హుజూర్' అంటూ సాగిలపడిపోయేవారు. దీన్ని ఆసరాగా తీసుకుని పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందిన గాజువాకలో అమర్ జాతీయ రహదారికి ఆనుకుని అడ్డగోలుగా ఐదంతస్థుల షాపింగ్‌మాల్‌ను నిర్మించేశారు. జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే భవన నిర్మాణం పూర్తిచేసేశారు. దీనికి సమీపంలోనే ప్రస్తుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు చెందిన భవనాన్ని వైసీపీ హయాంలో నిబంధనల పేరిట కూలగొట్టిన అధికారులు.. ఇప్పుడు గుడివాడ అమర్ భవనం విషయంలో ఎందుకు ఉపేక్షిస్తున్నారంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు.

అధికారం అండతో అడ్డగోలుగా నిర్మాణం

గాజువాకలోని చట్టివానిపాలెం వద్ద హైవేను ఆనుకుని అమర్‌నాథ్‌కు సుమారు 400 గజాల స్థలం ఉంది. అందులో వాణిజ్య సముదాయం నిర్మాణం కోసం అనుమతి కోరుతూ జీవీఎంసీకి రెండేళ్ల కిందట ఆన్‌లైన్‌లో ప్లాన్‌కు దరఖాస్తు చేశారు. దరఖాస్తు ఫీజు కింద రూ.పది వేలు చెల్లించారు. అయితే భవన నిర్మాణ కోసం ప్రతిపాదించిన స్థలం జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. ఆ రహదారిని భవిష్యత్తులో 80 మీటర్లకు విస్తరించాలని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు. మాస్టర్‌ప్లాన్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణకు సర్వే నిర్వహించి ఇరువైపుల ఎంతవరకూ భూమి అవసరమవుతోందో గుర్తించి జీవీఎంసీ అధికారులు ఆర్‌డీపీ (రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్) ఇవ్వాలి. ఒకవేళ ప్రైవేటు స్థలం కూడా రహదారి విస్తరణకు అవసరమని తేలితే ఆ మేరకు జీవీఎంసీ స్వాధీనం చేసుకుని, పరిహారంగా యజమానికి టీడీఆర్ ఇస్తుంది. ఆ ప్రక్రియ పూర్తికాకపోవడంతో మాజీ మంత్రి అమర్‌నాథ్ భవన నిర్మాణం కోసం చేసుకున్న దరఖాస్తు ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉండిపోయింది. అయినప్పటికీ అధికారం అండతో మంత్రి భవన నిర్మాణం ప్రారంభించేశారు. పైగా నిర్మాణంలో సెట్‌బ్యాక్‌లు కనీసం విడిచిపెట్టలేదు. జాతీయ రహదారిని మాస్టర్‌ప్లాన్ ప్రకారం విస్తరిస్తే ఇప్పుడున్న రోడ్డుకు ఇరువైపులా కనీసం 15 అడుగులు వరకూ వెడల్పు పెరుగుతుంది. అక్కడి నుంచి రోడ్డు వైపు భవనం ముందుభాగంలో 20 అడుగులు సెట్‌బ్యాక్ కింద విడిచిపెట్టాలి. అయితే కనీసం ఐదు అడుగులు కూడా విడిచిపెట్టలేదు. అదేవిధంగా మూడువైపులా మూడు మీటర్లు చొప్పున సెట్‌బ్యాక్ కింద వదలాలి. ఒక మీటరు కూడా సెట్‌బ్యాక్ విడిచిపెట్టలేదు. పైగా భవనానికి పశ్చిమ వైపు నుంచి చట్టివానిపాలెం గ్రామంలోకి వెళ్లేందుకు ఐదు అడుగుల రోడ్డు ఉంది. దీన్ని కూడా భవిష్యత్తులో 30 అడుగులకు విస్తరించే ప్రతిపాదన ఉండడంతో అటువైపు కూడా పది అడుగులు విడిచిపెట్టి తర్వాత భవనం నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఆ రోడ్డును అంటిపెట్టుకుని భవన నిర్మాణం చేసేశారు. ఆగమేఘాల మీద భవన నిర్మాణం పూర్తిచేసి ఎన్నికలకు ముందు అందులో పార్టీ కార్యాలయం ప్రారంభించేశారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులిచ్చినా బేఖాతరు

ప్లాన్ లేకుండా భవన నిర్మాణం చేయడంతోపాటు సెట్‌బ్యాక్ నిబంధనలు ఉల్లఘించారని, అదనపు అంతస్థులు నిర్మించారంటూ గాజువాక జోన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీచేశారు. దీనిపై మంత్రి హోదాలో ఉన్న అమర్‌నాథ్ నేరుగా జీవీఎంసీ కీలక అధికారికి ఫోన్ చేశారు. దీంతో కీలక అధికారి గాజువాక టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫోన్ చేసి అటువైపు కన్నెత్తి చూడద్దొంటూ హుకుం జారీచేయడంతో వారంతా మిన్నకుండిపోవాల్సి వచ్చింది. తాజాగా వైసీపీ అధికారం కోల్పోవడం, అమర్‌నాథ్ కూడా గాజువాక నుంచి పోటీ చేసి ఓడిపోవడంతో అక్రమ భవన నిర్మాణం అంశం బయటపడింది. ఇదిలావుండగా, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నిరకాల నిబంధనలను పాటిస్తూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తుండగా, జాతీయ రహదారి విస్తరణకు రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం రెండడుగులు ముందుకువచ్చి భవనం నిర్మించారంటూ జీవీఎంసీ అధికారులు వైసీపీ ప్రభుత్వ హయాంలో యంత్రాలతో నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. దానికి కూతవేటు దూరంలోనే మాజీ మంత్రి అమర్‌నాథ్ నిర్మించిన అక్రమ భవనం ఉండడంతో జీవీఎంసీ అధికారులు ఇప్పుడు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

జీవీఎంసీలోనే ప్లాన్ పెండింగ్: గుడివాడ అమర్‌నాథ్

చట్టివానిపాలెంలో మా తాతల ఆస్తిగా వచ్చిన 400 గజాల స్థలంలో భవన నిర్మాణానికి మూడేళ్ల కిందటే జీవీఎంసీకి ప్లాన్ కోసం దరఖాస్తు చేశాం. అన్ని ఫీజులు చెల్లించడంతోపాటు రోడ్డు విస్తరణకు స్థలం కూడా జీవీఎంసీ పేరిట రిజిస్ట్రేషన్ చేశాను. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆర్‌డీపీ జరగలేదనే కారణంతో ప్లాన్‌ను జీవీఎంసీలో ఇంకా పెండింగ్‌లో ఉంచారు. నా వైపు నుంచి ప్రభుత్వానికి కట్టాల్సిన అన్నిరకాల పన్నులు చెల్లించేశాను.

టైమంటే.. టైమే!

- 9 కల్లా ఆఫీసుకు రావాల్సిందే..15 నిమిషాలే గ్రేస్ పిరియడ్
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీవోపీటీ విభాగం హెచ్చరికలు

న్యూఢిల్లీ, జూన్ 22: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆఫీసుకు హాజరయ్యే విషయంలో సమయపాలనను ఖచ్చితంగా పాటించాల్సిందే. టైమంటే టైముకు రావాల్సిందే. ట్రాఫిక్ జామ్ అయింది.. బండి రిపేర్ వచ్చింది.. మార్నింగ్ మెళకువ రాలేదు. వంటి కుంటి సాకులు చెప్పేందుకు వీల్లేదు. ఖచ్చితంగా ఉదయం 9 గంటలకల్లా ఆఫీసుకు వచ్చి పంచ్ వేయాల్సిందే. మహా అయితే.. మరో 15 నిమిషాలు గ్రేస్ పిరియడ్ కింద ఆలస్యం కావొచ్చు. అది కూడా రోజూ కాదు. ఎప్పుడైనా అత్యవసరమైతే. తరచుగా వినియోగించుకుంటే కూడా ఇబ్బందే. ఇక, 9.15 గంటల తర్వాత ఆఫీసుకువచ్చేవారికి క్యాజివల్ లీవ్(సీఎల్)లో ఆఫ్‌డేని సెలవుగా పరిగణించి కోతపెడతారు. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్, ట్రైనింగ్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. ఆఫీసుకు ఆలస్యంగా వచ్చే వారిని కట్టడి చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఈ ఆదేశాలు సీనియర్ ఉద్యోగుల నుంచి జూనియర్ ఉద్యోగుల వరకు అందరికీ వర్తిస్తాయని ఆదేశాల్లో పేర్కొంది. ఉదయం 9.15 గంటలలోపు అందరూ ఆఫీసుకు వచ్చి పంచ్ కొట్టాల్సిందేనని తెలిపింది. అందరూ బయోమెట్రిక్ అటెండెన్స్‌ను వినియోగించుకోవాలని కోరింది. కరోనా తర్వాత నాలుగేళ్లుగా ఉద్యోగులు సమయ పాలన పాటించడంలేదన్న ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపింది. అంతేకాదు.. ఎవరైనా ఉద్యోగి ఏ కారణంతో అయినా.. ఆఫీసుకు రాలేక పోతే.. ముందుగానే సంబంధిత శాఖాధిపతికి సమాచారం అందించాలని స్పష్టం చేసింది. ముందుగా తెలిపిన వారికే సీఎల్ వర్తిస్తుందని పేర్కొంది. అదేవిధంగా ప్రతిశాఖాధిపతి తమ ఉద్యోగులు సమయపాలన పాటిస్తున్నారో లేదో నిత్యం పరిశీలించాలని సూచించింది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉదయం 9గంటల నుంచి పనివేళలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతాయి. అయితే.. జూనియర్ అధికారులు ఈ సమయపాలనను పాటించకుండా ఆఫీసులకు ఆలస్యంగా వస్తున్నారని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులు అందాయి. దీనిపై సీనియర్ అధికారులు స్పందిస్తూ.. జూనియర్లను సమర్థించారు. వారు ఆఫీసు పనివేళలు ముగిసిన తర్వాత కూడా రాత్రి 7 గంటల వరకు ఆఫీసులోనే ఉండి పనిచేస్తున్నారని.. ఖచ్చితమైన సమయం నిర్దేశించనందుకే ఇలా జరుగుతోందని వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్, ట్రైనింగ్ విభాగం తాజా ఆదేశాలు జారీ చేసింది.

ఇంట్లోనే యోగా నేర్పే 'యోగిపై'

- ఏఐ టెక్నాలజీతో యోగా మ్యాట్ రూపకల్పన




న్యూఢిల్లీ, జూన్ 22: యోగాసనాలు వేసేటప్పుడు సూచనలు ఇవ్వడంతో పాటు భంగిమల్లో ఏర్పడే పొరపాట్లను సరిదిద్దేందుకు ఐఐటీ మండీ ఆధ్వర్యంలో ఏఐ ఆధారిత యోగా మ్యాట్‌ను రూపొందించారు. 'యోగిపై' పేరుతో పిలిచే ఈ మ్యాట్‌ను ఐఐటీ మండీలోని టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, డీఎస్‌టీ ఎన్ఎమ్- ఐసీపీఎస్ ప్రోగ్రామ్ సహాయంతో విల్లినెస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్ట్ అప్ సంస్థ అభివృద్ధి పరిచింది. దీనిని శనివారం శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ తరఫున కేంద్రమంత్రులు జైశంకర్, అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్‌కు అందజేశారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ మ్యాట్ అనేక స్మార్ట్ ఫీచర్లను కలిగి ఉందని, యోగా చేసేటప్పుడు అంచెల వారీగా సూచనలు చేయడంతో పాటు రియల్‌టైమ్ ఫీడ్‌బ్యాక్‌ను అందిస్తుందని దీని సృష్టికర్తలు తెలిపారు.


అమరనాథ్ యాత్రకు సర్వం సిద్ధం

- యాత్రికులకు మరింత మెరుగైన సౌకర్యాలు
- యాత్ర పొడవునా పటిష్ఠమైన రక్షణ చర్యలు
- ప్రథమ పూజలో పాల్గొన్న గవర్నర్ మనోజ్ సిన్హా

శ్రీనగర్/జమ్ము, జూన్ 22: వారం రోజుల్లో ప్రారంభం కానున్న అమరనాథ్ యాత్రకు సర్వం సిద్ధమయింది. పటిష్ఠమైన రక్షణ చర్యలు చేపట్టామని, యాత్రికుల కోసం మెరుగైన సౌకర్యాలను కల్పించామని జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తెలిపారు. అమరనాథ్ యాత్ర ప్రారంభానికి సూచికగా శనివారం నిర్వహించిన 'ప్రథమ పూజ'లో రాజ్‌భవన్ నుంచి వర్చువల్‌గా పాల్గొన్న సిన్హా మీడియాతో మాట్లాడారు. 'ఈనెల 29న యాత్ర ప్రారంభం అయిన తరవాత దేశవ్యాప్తంగా భక్తులకు దర్శనం లభిస్తుంది. దేవస్థానం బోర్డు, జేకే పాలనాయంత్రాంగం యాత్రికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. గత రెండేళ్లుగా సౌకర్యాలు చాలా మెరుగయ్యాయి. ఆలయ గుహకు వెళ్లే రహదారులకు మరమ్మతులు నిర్వహించాం. సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్ఓ) కొన్నిచోట్ల రోడ్లను వెడల్పు చేసింది. ఈసారి యాత్ర ప్రశాంతంగా జరుగుతుందని భావిస్తున్నా. యాత్రికులకు ఎప్పటిలాగే సహాయ సహకారాలను అందించాలని యాత్ర కొనసాగే మార్గంలోని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. యాత్ర ప్రశాంతంగా సాగితే అది ప్రపంచవ్యాప్తంగా జమ్ముకశ్మీర్ ఖ్యాతిని ఇనుమడింప చేస్తుంది' అని గవర్నర్ సిన్హా పేర్కొన్నారు. అనంతరం వివిధ స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను ప్రారంభించారు. మరోవైపు జమ్ముకశ్మీర్ ఏడీజీపీ ఆనంద్ జైన్, 270 కి.మీ. శ్రీనగర్ - జమ్ము జాతీయ రహదారి వెంబడి రక్షణ చర్యలను పలువురు పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన పలు కీలకమైన ప్రాంతాల్లో కమ్యూనిటీ కిచెన్‌లను, చెకింగ్ పాయింట్లను తనిఖీ చేశారు. జాతి వ్యతిరేక శక్తులు యాత్ర భగ్నానికి ప్రయత్నం చేసే అవకాశాలను పేర్కొంటూ నిరంతరాయంగా పటిష్ఠ రక్షణ చేపట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. నిఘా వర్గాలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనుమానాస్పద కదలికలపై ఓ కన్నేసి ఉంచాలని చెప్పారు. యాత్రికుల పట్ల స్నేహపూర్వక వ్యవహార శైలిని కలిగి ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాలు ఎలాంటి సహాయక చర్యలు చేపట్టడానికైనా సిద్ధంగా ఉండాలని ఏడీజీపీ జైన్ సూచించారు.

మన హీరోలు మీసం మెలిపెడుతున్నారు
కయ్యానికి సై అంటున్నారు
కదనరంగంలో చురకత్తుల్లా
కదులుతున్నారు. ప్రేక్షకులకు పసందైన
యాక్షన్ విందును అందించేందుకు
శ్రమిస్తున్నారు. ప్రస్తుతం యాక్షన్ చిత్రాల
ట్రెండ్ నడుస్తోంది. జులైలో సెట్స్‌పైన ఉన్న
సినిమాల్లో అగ్రహీరోలంతా పోరాటాల
బాట పట్టారు. స్టంట్ మాస్టర్ల నేతృత్వంలో
సరికొత్త పోరాట ఘట్టాలను వెండితెరపైకి
తెచ్చేందుకు సిద్ధమవుతున్నారు.



యాక్షన్ హంగామా

వర్షంలో దేవర పోరాటం

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. సైఫ్ అలీఖాన్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. చిత్రీకరణ చివరి దశలో ఉంది. ఇటీవలే గోవా షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఎన్టీఆర్, సైఫ్ పై పీటర్ హెయిన్స్ నేతృత్వంలో గోవా అడవుల్లో భారీ పోరాట ఘట్టాలను తెరకెక్కించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సైఫ్, ఎన్టీఆర్ ఈ షెడ్యూల్‌లో పాల్గొన్నారు. తదుపరి షెడ్యూల్ థాయ్‌లాండ్‌లో జరుగుతోంది. ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయిక. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

పతాక సన్నివేశాల్లో పుష్ప 2

'పుష్ప 2: ది రూల్' కోసం అల్లు అర్జున్ బరిలోకి దిగారు. ప్రస్తుతం పతాక సన్నివేశాలతో పాటు పాటలు తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో ప్రత్యేకంగీ తీర్చిదిద్దిన సెట్‌లో టాకీపార్ట్‌తో పాటు పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రం డిసెంబర్ 6న విడుదలవుతోంది.

ప్రత్యేక సెట్‌లో

వరుణ్‌తేజ్ హీరోగా నటిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. వైజాగ్ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. కరుణ కుమార్ దర్శకత్వంలో విజేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఈ నెల 19న చిత్రబృందం తాజా షెడ్యూల్‌ను ప్రారంభించింది. భారీసెట్‌లో వరుణ్‌పై యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కొంత టాకీపార్ట్‌ను తెరకెక్కించనున్నారు.

ప్రేమికుల ఫైట్

అడివిశేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డెకాయిట్'. శ్రుతీహాసన్ కథానాయిక. ఇటీవలే హైదరాబాద్‌లో తాజా షెడ్యూల్ మొదలుపెట్టారు. శ్రుతీహాసన్, శేష్‌పై భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. వరుస దోపిడీల కోసం చేతులు కలిపిన ఇద్దరు మాజీ ప్రేమికుల కథ ఇది. ఈ చిత్రానికి అడివిశేష్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు.

భారీసెట్‌లో పోరాటం

ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కుబేర'. అక్కినేని నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక. ఈ నెల తొలివారంలో హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ సినిమాలో కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ కోసం భారీసెట్ వేశారు. ఇందులో నాగార్జున, ధనుష్ సహా ఇతర తారాగణంపై భారీ యాక్షన్ సీక్వెన్స్ తెరకెక్కించారు. సరికొత్త కథాంశంతో వస్తున్న ఈ చిత్రానికి సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మాతలు.

బరిలోకి బచ్చన్

'మిస్టర్ బచ్చన్' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు రవితేజ. హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలో ఇన్‌కంటాక్స్ ఆఫీసర్‌గా రవితేజ అలరించనున్నారు. ఇటీవలే చిత్రబృందం ప్రత్యేకంగా వేసిన సెట్‌లో కీలకమైన యాక్షన్ ఘట్టాలను తెరకెక్కించారు. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక.

పోరాటం షురూ..







మన హీరోలే కాదు కొందరు పరభాషా హీరోలు సైతం యాక్షన్ మోడ్‌లో ఉన్నారు. తమిళ కథానాయకుడు ఆర్య హీరోగా రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'మిస్టర్ ఎక్స్'. ఇటీవలే భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో చిత్రీకరణ పూర్తి చేశారు. పోరాట ఘట్టాల్లో ఆర్య చూపిన తెగువ ప్రశంసనీయం అని చిత్రబృందం తెలిపింది. మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ 'లూసిఫర్ 2: ఎంపురాన్' చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కిస్తున్నారు. ఈ నెల ఆరంభంలో కొచ్చిలో ఓ షెడ్యూల్ పూర్తయింది. తాజాగా గుజరాత్‌లో కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ సినిమాకు కీలకమైన పోరాట ఘట్టాలను అక్కడ తెరకెక్కిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. వరుసగా యాక్షన్ చిత్రాలు చేస్తూ వస్తున్నారు అజిత్. ప్రస్తుతం ఆయన 'గుడ్ బ్యాడ్ అగ్లీ, విడాముయార్చి' షూటింగ్స్‌తో తీరిక లేకుండా ఉన్నారు. ఈ చిత్రం చివరి షెడ్యూల్ ఈ నెల 24 నుంచి అజర్‌బైజాన్‌లో మొదలవనుంది. అజిత్‌పై భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కించనున్నారు. ఇందులో త్రిష కథానాయిక. తిరుమేని దర్శకుడు. దీపావళికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

- 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత యశ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్'. ఈ చిత్రంలో ఆయన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ఈ సినిమా భారీ షెడ్యూల్‌ను చిత్రబృందం యూకేలో జరపనుంది. అక్కడే యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కించనున్నారు.
- వరుసగా విలన్ పాత్రలతో అలరిస్తూ వస్తున్నారు సైఫ్ అలీఖాన్ హీరోగా 'జ్యువెల్ థీఫ్' పేరుతో ఓ చిత్రం వస్తోంది. రాబీ గ్రేవాల్ దర్శకత్వం వహిస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ నిర్మాత. యాక్షన్ అడ్వెంచర్‌లో సైఫ్ ఒళ్లు గగుర్పొడిచే స్టంట్స్ చేశారు. ఇటీవలే ఆయన ఈ సినిమా చిత్రీకరణ ముగించారు.

కమల్ లుక్ చూసి ఆశ్చర్యపోయా

- ఎస్.ఎస్.రాజమౌళి



దర్శకధీరుడు రాజమౌళి 'కల్కి 2898 ఏ.డీ' సినిమా ట్రైలర్‌పై ప్రశంసల వర్షం కురిపించి.. చిత్ర బృందానికి, అభిమానులకు ఎక్కడలేని జోష్ ఇచ్చారు. "ట్రైలర్ చూశాను. అద్భుతంగా ఉంది. విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్ నాకు విపరీతంగా నచ్చేశాయి. సినిమాను మొదటి రోజు మొదటి ఆట చూడటానికి కావాల్సిన ఆసక్తి, ఉత్సాహం వచ్చింది. సినిమాలో ప్రధాన పాత్రధారులైన ప్రభాస్, అమితాబ్, దీపిక పాత్రలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉన్నాయి. ఇక, కమల్ హాసన్ లుక్ చూసి ఆశ్చర్యపోయా. చాలాసేపటి వరకూ ఆయన లుక్ ఇచ్చిన ట్రాన్స్‌లోనే ఉండిపోయా. అందరిలాగే, డైరెక్టర్ నాగ్‌అశ్విన్ చూపించే కొత్త ప్రపంచాన్ని థియేటర్లలో చూడటం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ప్రభాస్ నటించిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించగా, అశ్వనీ దత్ నిర్మించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, పశుపతి, స్వాస్థ చటర్జీ, దీపికా పదుకొనే, దిశా పటానీ, మాళవిక నాయర్, శోభన, అన్నా బెన్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 27న సినిమాను ఐదు భారతీయ భాషలతో పాటు ప్రపంచవ్యాప్తంగా మరిన్ని భాషల్లో విడుదల చేయనున్నారు.

సోదరుడి కోసం ఎంతకైనా తెగిస్తా..

బాలీవుడ్ నటి అలియా భట్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'జిగ్రా'. వసన్ బాలా దర్శకత్వం వహిస్తున్నారు. 'ఆర్చీస్' ఫేమ్ వేదాంగ్ రైనా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవలే ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడిన అలియా.. ఈ సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలను తెలియజేశారు.

"ఇందులో నా పాత్రే కాదు.. లుక్ కూడా చాలా భిన్నంగా ఉండబోతోంది. ఈ సినిమా సెట్స్‌లో ఉన్నప్పుడు అస్సలు టైమ్ తెలియలేదు. దీని క్కారణం మా చిత్రబృందం. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఎన్నో గుర్తుండిపోయే సంఘటనలు జరిగాయి. డైరెక్టర్ వసన్ బాలాతో పనిచేయడం ఆనందంగా ఉంది. ఆయన చాలా కూల్‌గా ఉంటారు. సెట్స్‌లో ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. ఆయన రచనా శైలి, ఆలోచనలు అబ్బురపరుస్తాయి. ఇక వేదాంగ్ రైనా సినిమాలో నాకు సోదరుడిగా కనిపిస్తారు. సినిమాలో మా ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం ఆకట్టుకుంటుంది. సోదరుడి కోసం ఎంతకైనా తెగించే పాత్ర నాది" అని చెప్పారు. ఈ సినిమా సెప్టెంబరులో విడుదల కావాల్సి ఉన్నా..ఆక్టోబరు 11కు వాయిదా పడింది.





బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్‌ల పెళ్లి సందడి మొదలైంది. ఈ వేడుకల్లో భాగంగా శనివారం ముంబైలో సోనాక్షి ఇంటి వద్ద మెహందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో ఇరు కుటుంబాలకి చెందిన బంధుమిత్రులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ రోజు సాయంత్రం ఎనిమిది గంటలకు సోనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్‌ల పెళ్లి జరుగుతుంది.


మా కుటుంబానికి ఆ సినిమా టైటిల్ సరిపోతుంది



సినిమా సినిమాకి వైవిధ్యమైన పాత్రలతో దూసుకుపోతున్నారు బాలీవుడ్ నటి సారాఅలీ ఖాన్. ఇటీవలే ఆమె 'మర్డర్ ముబారక్', 'యే వతన్ మేరే వతన్' చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇటీవల ఓ ఆంగ్ల మీడియాతో ముచ్చటించిన ఈ బ్యూటీ.. సినిమాలతో పాటు పలు వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు.

"వరుసగా సవాల్ విసిరే పాత్రల్లో నటించడం ఎంతో కొత్త అనుభూతినిస్తుంది. ఒకేసారి రెండు విభిన్న కథలు.. నేపథ్యాలున్న సినిమాల్లో నటిస్తే.. రెండు వేర్వేరు ప్రపంచాల్లో పయనించినట్లు అనిపిస్తుంది. 'మర్డర్ ముబారక్', 'యే వతన్ మేరే వతన్' సినిమాల్లో ఒకేసారి నటించడం ద్వారా నాకు ఈ అనుభవం సొంతమైంది. మాది చాలా పెద్ద కుటుంబం. నానమ్మ షర్మిలా ఠాగూర్, నాన్న సైఫ్ అలీఖాన్, అత్త సోహా అలీఖాన్‌ను ఎప్పుడు కలసినా మా మధ్య ఉండే కామన్ టాపిక్ సినిమా. మా ఫ్యామిలీకి ఒక సినిమా టైటిల్‌ను సూచించవలసి వస్తే.. అది సూపర్ హిట్ మూవీ 'కభీ ఖుషీ కభీ గమ్' అతికినట్లు సరిపోతుంది" అని చెప్పారు.






ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
వరస్ట్ రూమ్మేట్ ఎవర్ 2	వెబ్‌సిరీస్	జూన్ 26
సుపాసెల్	వెబ్‌సిరీస్	జూన్ 27
దట్ నైన్టీస్ షో	వెబ్‌సిరీస్ 2	జూన్ 27
మై లేడీ జానీ	వెబ్‌సిరీస్	జూన్ 27
ఎ ఫ్యామిలీ ఎఫైర్	హాలీవుడ్ మూవీ	జూన్ 28
ఓనింగ్ మాన్‌హట్టన్	వెబ్‌సిరీస్	జూన్ 28
ది వర్ల్‌విండ్	కొరియన్ సిరీస్	జూన్ 28
అమెజాన్ ప్రైమ్		
సివిల్ వార్	తెలుగు డబ్బింగ్	జూన్ 28
శర్మాజీకీ బేటీ	హిందీ చిత్రం	జూన్ 28
జీ 5		
రౌతూ కా రాజ్	హిందీ చిత్రం	జూన్ 28
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ది బేర్	వెబ్‌సిరీస్	జూన్ 27
ఆపిల్ టీవీ ప్లస్		
ల్యాండ్ ఆఫ్ ఉమెన్	హాలీవుడ్ మూవీ	జూన్ 26
ఫ్యాన్సీ డాన్స్	హాలీవుడ్ మూవీ	జూన్ 28

గురుదక్షిణ చెల్లించుకున్న హీరో కృష్ణ

చిత్ర పరిశ్రమలో కృతజ్ఞత అనే పదానికి అర్థం తెలిసిన హీరోలు కొందరే ఉంటారు. వారిలో మొదటి వరుసలో వుండే వ్యక్తి హీరో కృష్ణ. 'తేనెమనసులు' చిత్రంతో తనని హీరోగా పరిచయం చేసి, వృద్ధిలోకి రావడానికి కారణమైన దర్శకుడు ఆదుర్తి సుబ్బారావును ఆదుకొని అవసర కాలంలో 'మాయదారి మల్లిగాడు' చిత్రం చేసి కృష్ణ గురుదక్షిణ చెల్లించుకున్నారని చెప్పాలి. ఎందుకంటే ఈ చిత్ర నిర్మాణ సమయానికి ఆదుర్తి సుబ్బారావుకు తెలుగులో సినిమాలు లేవు. హిందీ ఫీల్డ్‌కి వెళ్లి కొన్ని చిత్రాలు చేసి దెబ్బతిని అక్కడ ఇమడలేక చెన్నై తిరిగి వచ్చారు. మళ్లీ తెలుగులో చిత్ర నిర్మాణం కొనసాగించాలని ఆదుర్తి నిర్ణయించుకున్నారు. 'తేనె మనసులు' తరహాలో అంతా కొత్తవారితో సినిమా తీయడానికి సన్నాహాలు ప్రారంభించి, హీరోగా శరత్ బాబుని ఎంపిక చేశారు. అయితే పరిశ్రమలోని ఆదుర్తి సుబ్బారావు శ్రేయోభిలాషులు ఆయన ప్రయత్నాన్ని వారించారు. 'ఇప్పటికే ఆర్థికంగా దెబ్బ తిన్నావ్. కొత్తవాళ్లతో సినిమా తీసి మళ్లీ రిస్క్ చేయడం ఎందుకు? నువ్వు పరిచయం చేసిన హీరో కృష్ణ ఇప్పుడు మంచి పొజిషన్లో ఉన్నాడు. వెళ్లి అతని డేట్స్ అడుగు' అని సలహా ఇచ్చారు. సరేనని ఒక రోజు వెళ్లి కృష్ణను కలిశారు ఆదుర్తి. ఆయన అడిగిన వెంటనే వివరాలు ఏమీ అడగకుండా సినిమా చేయడానికి అంగీకరించి వెంటనే డేట్స్ ఇచ్చేశారు కృష్ణ ఆ సమయంలో చాలా మంది నిర్మాతలు ఆయన డేట్స్ కోసం క్యూ లో ఉన్నారు. అయితే గురువు తర్వాతే ఎవరైనా అని అనుకోవడం కృష్ణ మంచితనానికి నిదర్శనం.



బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్‌కు

'మాయదారి మల్లిగాడు' చిత్రాన్ని మొదట బ్లాక్ అండ్ వైట్ లో నే నిర్మించాలనుకున్నారు ఆదుర్తి సుబ్బారావు. అన్నపూర్ణ డిస్ట్రిబ్యూటర్స్‌తో మాట్లాడితే వాళ్లు సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయడానికి అంగీకరించారు. అయితే సినిమాలు బ్లాక్ అండ్ వైట్ లోనే తీయాలని, రూ. ఎనిమిది లక్షలు మాత్రమే పెట్టుబడి పెడతామని వాళ్లు షరతు విధించడంతో ఆదుర్తి సరేనన్నారు. ఆ విషయం కృష్ణ కి తెలిసి 'నాలాంటి కొత్త వాడితోనే కలర్ సినిమా తీసిన గ్రేట్ డైరెక్టర్ మీరు. ఇప్పుడు బ్లాక్ అండ్ వైట్ లో తీయడం ఏంటి సార్.. కలర్ లోనే తీద్దాం. ఫిల్మ్ నేను ఏర్పాటు చేస్తాను' అనడంతో ఆదుర్తి కాదనలేకపోయారు. ఆ రోజుల్లో కలర్ ఫిల్మ్ ఓపెన్ మార్కెట్లో లభ్యమయ్యేది కాదు. అయినా తన పరపతిని ఉపయోగించి ఫిల్మ్ సంపాదించారు కృష్ణ.

గళ్ల లుంగీ.. లాల్చీ

సోషల్ క్యారెక్టర్స్‌లో హీరో కృష్ణ ను చాలా విభిన్నంగా చూపించిన చిత్రం 'మాయదారి మల్లిగాడు'. గళ్ళ లుంగీ, పల్చటి లాల్చీ, మెడలో స్కార్ఫ్, నడుముకి లావుపాటి బెల్ట్, చేతిలో కర్ర.. సినిమా అంతా ఇలాంటి గెటప్ లోనే కనిపిస్తారు కృష్ణ. అన్యాయాన్ని, అక్రమాన్ని ఎదిరించే పాత్ర ఆయనది. అందమైన రౌడీ ఇలా ఉంటాడన్న మాట అనిపించే విధంగా హీరో కృష్ణ గెటప్ కుదిరింది. ఆయనతో మంజుల కలసి నటించిన తొలి చిత్రం ఇదే. అంతకుముందు తెలుగులో కొన్ని చిత్రాల్లో ఆమె నటించినప్పటికీ హీరోయిన్ గా చేసిన తొలి సినిమా ఇదే. ఈ చిత్రంలో మంజుల అందచందాలు ఆనాటి యువతరాన్ని పిచ్చెక్కించాయి. కృష్ణ పారితోషికం కాకుండా రూ 11 లక్షలతో మాయదారి మల్లిగాడు చిత్రం పూర్తయింది. గుంటూరు ఏరియా హక్కుల్ని తన పారితోషికంగా తీసుకున్నారు కృష్ణ. మాయదారి మల్లిగాడు చిత్రం ఘన విజయం సాధించింది. 40 రోజులకు 13 లక్షల రూపాయలు వసూలు చేసిన ఈ చిత్రాన్ని కొన్ని కేంద్రాల్లో 49 వ రోజునే పంపిణీ సంస్థ అన్నపూర్ణ పిక్చర్స్ తీసేయడం ఆ రోజుల్లో కృష్ణ అభిమానుల ఆగ్రహానికి గురైంది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 23 జూన్ 2024

ఏఎన్‌యూలో దూరవిద్య కోర్సులు

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) దూరవిద్య విభాగం- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఈ కోర్సులను ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో నిర్వహిస్తారు.



డిగ్రీ: బీఏ, బీకాం, బీబీఏ ప్రోగ్రామ్‌ల వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

బీఏ సబ్జెక్టులు: ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్

బీకాం సబ్జెక్టులు: జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్

- బీబీఏ, బీఎల్ఐఎస్సీ, బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. బీఏ(ఎకనామిక్స్, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం(జనరల్) కోర్సులను తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో చదువుకోవచ్చు. మిగిలిన బీఏ కోర్సులు తెలుగు మాధ్యమంలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ/ఇంటర్ ఒకేషనల్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎల్ఐఎస్సీ కోర్సుకు మాత్రం ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

పీజీ: ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సుల వ్యవధి రెండేళ్లు. మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్.

ఎంకాం స్పెషలైజేషన్‌లు: అకౌంటెన్సీ, బ్యాంకింగ్

- ఎంఏ కోర్సుల్లో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లను ఆ మాధ్యమంలోనే చదవాలి. ఎంఏ(ఎకనామిక్స్/హిస్టరీ/పొలిటికల్ సైన్స్/సోషియాలజీ) కోర్సులు తెలుగు మాధ్యమంలో ఉన్నాయి. మిగిలిన కోర్సులను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి.

అర్హత: ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సులకు ఏదేని డిగ్రీ; ఎంఏ(ఎకనామిక్స్)కు బీఏ(ఎకనామిక్స్); ఎంకాం కోర్సుకు బీకాం/బీబీఏ; ఎంఎల్ఐఎస్సీ కోర్సుకు బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏలో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

డిప్లొమా: ఈ కోర్సులో ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫుడ్ ప్రొడక్షన్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, సైకలాజికల్ గైడెన్స్ కోర్సుకు ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్సులు: హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్, హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్ కోర్సులు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి. హౌస్ కీపింగ్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, ఎయిడ్స్ కౌన్సెలింగ్‌కు ఇంటర్(పారామెడికల్)తోపాటు ఏదేని డిగ్రీ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.anucde.info

విశాఖ ఐఐపీఈలో బీటెక్



విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ తోపాటు డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి క్యాట్ స్కోర్ లేకుండానే ఐఐఎం విశాఖపట్నంలో ఎంబీఏ చదివే వీలుంది.

విభాగాలు-సీట్లు: పెట్రోలియం ఇంజనీరింగ్‌లో 62 సీట్లు, కెమికల్ ఇంజనీరింగ్‌లో 63 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 40 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 65 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 అర్హత తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **ఫస్ట్ అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూలై 6
- **ఫస్ట్ రౌండ్‌లో ఎంపికైనవారు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 10
- **సెకండ్ అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూలై 11
- **సెకండ్ రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 15
- **థర్డ్ అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూలై 19
- **థర్డ్ రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 22
- **మొదటి మూడు రౌండ్ల అభ్యర్థుల ఫిజికల్ రిజిస్ట్రేషన్:** జూలై 25
- **ఫోర్త్ అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూలై 26
- **ఫోర్త్ రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 30
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** ఆగస్టు 5
- **అకడమిక్ సెషన్ ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** iipe.ac.in

ఓయూలో లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. సాయంత్రం సమయాల్లో ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000.

అర్హత: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐ&ఎంఎల్ స్పెషలైజేషన్‌కు ఏ విభాగంవారైనా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఈ/ఏఐ/ఏఐడీ/ఏఐఎం/సీఎంఈ/సీఎస్‌బీ/సీఎస్‌సీ/సీఎస్‌డీ/సీఎస్‌జీ/సీఎస్ఐ/సీఎస్ఎం/సీఎస్ఎన్/సీఎస్ఓ/సీఎస్‌టీ/సీఎస్‌డబ్ల్యూ/సీఐసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం ఏడాది ఫుల్ టైమ్ ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 11
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరో తరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు.
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 18
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 21
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 27
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 3
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in



జాబ్ కార్నర్

ఎండీఎస్ఎల్‌లో అప్రెంటిస్‌లు

ఖాళీలు 518

ముంబయిలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ట్రేడులు: డ్రాఫ్ట్స్‌మన్(మెకానికల్), ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పైప్ ఫిట్టర్, స్ట్రక్చరల్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్, రిగ్గర్, వెల్డర్ ఎలక్ట్రికల్ తదితరాలు

అర్హత: ఖాళీని అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 అక్టోబరు 1 నాటికి గ్రూప్-ఎ 15 నుంచి 19 ఏళ్లు; గ్రూప్-బి 16-21 ఏళ్లు, గ్రూప్ సి 14-18 ఏళ్ల మధ్య ఉండాలి.

స్టయిపెండ్: నెలకు గ్రూప్ ఎ -రూ.6600, గ్రూప్ బి-రూ.8050 - రూ.7700, గ్రూప్ సి-రూ.2500 - రూ.5500 వరకు చెల్లిస్తారు.

దరఖాస్తు రుసుము: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 26

వెబ్‌సైట్: https://www.mazagondock.in/

హెచ్‌ఏఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

ఖాళీలు 51

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)...కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ వర్క్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెటలర్జీ, ఫిట్టర్, గ్రైండర్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, బీఏ/బీఎస్సీ/బీకాం, ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి.

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ(ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, పీడబ్ల్యూ అభ్యర్థులకు పదేళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌కు మూడేళ్లు సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు డిప్లొమా టెక్నీషియన్ పోస్టుకు రూ.48,511. ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీమెన్, దివ్యాంగులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 26

వెబ్‌సైట్: https://halindia.co.in/home

ఎన్ఐఎన్‌లో క్లర్క్‌లు

ఖాళీలు 14

హైదరాబాద్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్)- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్)... డైరెక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. లోయర్ డివిజన్ క్లర్క్: 6 పోస్టులు
2. లైబ్రరీ క్లర్క్: 1 పోస్టు
3. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్: 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్, సంబంధిత విభాగంలో డిగ్రీ, సర్టిఫికెట్ కోర్సు, కంప్యూటర్/టైపింగ్ పరిజ్ఞానం, పని అనుభవం కలిగి ఉండాలి.

వయోపరిమితి: ఎల్‌డీసీ/యూడీసీ పోస్టులకు 27 ఏళ్లు, లైబ్రరీ క్లర్క్‌కు 28, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.1200, ఎస్సీ/ఎస్టీ/మహిళలు/ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు రూ.1000. దివ్యాంగులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా

దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 25

వెబ్‌సైట్: https://www.nin.res.in/

బ్యాంక్ ఆఫ్ బరోడాలో వివిధ ఖాళీలు

ఖాళీలు 168

వడోదర(గుజరాత్)లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రధాన కార్యాలయం... రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా బీఓబీ శాఖల్లో కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ఫారెక్స్ అక్విజిషన్ అండ్ రిలేషన్‌షిప్ మేనేజర్: 15
2. క్రెడిట్ అనలిస్ట్: 80
3. రిలేషన్‌షిప్ మేనేజర్: 66
4. సీనియర్ మేనేజర్ బిజినెస్ ఫైనాన్స్: 4
5. చీఫ్ మేనేజర్ ఇంటర్నల్ కంట్రోల్స్: 3

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, సీఏ/సీఎంఏ/సీఎస్/సీఎఫ్ఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.



ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితరాలు

ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.100.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 2

వెబ్‌సైట్: https://www.bankofbaroda.in/

పీఎంబీఐలో ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ మేనేజర్లు

ఖాళీలు 44

న్యూఢిల్లీలోని ఫార్మాస్యూటికల్స్ అండ్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ మేనేజర్: 10
2. సీనియర్ మార్కెటింగ్ ఆఫీసర్: 12
3. ఎగ్జిక్యూటివ్: 12
4. సీనియర్ ఎగ్జిక్యూటివ్: 10

విభాగాలు: సేల్స్ అండ్ మార్కెటింగ్, ప్రొక్యూర్‌మెంట్, క్వాలిటీ, లాజిస్టిక్స్ అండ్ సప్లయి చైన్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, ఐటీ అండ్ ఎంఐఎస్, హెచ్ఆర్ అండ్ అడ్మిన్, లీగల్.

అర్హత: సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి

ఎంపిక విధానం: దరఖాస్తుల స్క్రీనింగ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను పోస్టు/కొరియర్ ద్వారా సీఈఓ, పీఎంబీఐ, బీ-500, టవర్ బీ, ఐదో అంతస్తు, వరల్డ్‌ట్రేడ్ సెంటర్, నౌరోజీనగర్, న్యూఢిల్లీ చిరునామాకు పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 8 **వెబ్‌సైట్:** https://janaushadhi.gov.in/

విద్యా ధనం


ఒక ఊరిలో రాజు, రాము అనే ఇ మిత్రులు ఉండేవారు వారిలో రాము శ్రద్ధగా చదువుకునే మంచి విద్యార్థి, రాజు కొంచెం బధకస్తుడు, అందరూ రామును మెచ్చుకుంటూ ఉంటే రాజుకు అసూయగా, కోపంగా ఉండేది. ఎలాగైనా రామును అందరూ మెచ్చకుండా చేయాలని, రాజు ఒకసారి పరీక్షకు ముందు రోజు రాము పుస్తకాలన్నిటినీ బావిలో పడవేశాడు. పుస్తకాలు చదవలేనిరాము ఆ మర్నాడు జరిగే పరీక్ష రాయలేక బాధ పడతాడని రాజు అనుకున్నాడు. ఆ మర్నాడు రాము ఎప్పటిలాగే పరీక్ష రాసి, మంచి మార్కులు తెచ్చుకున్నాడు.



తన పుస్తకాలన్నిటినీ పోగొట్టుకున్నానని రాము చెప్పడం గుర్తున్న రాజు రాము దగ్గరకు వెళ్లి, పుస్తకాలు పోయినా పరీక్ష ఎలా రాయగలిగావని అడిగాడు.దానికి రాము నేను ఏ రోజు జరిగిన పాఠం ఆ రోజే చదివి, మననం చేసుకుంటాను. కాబట్టి కేవలం పరీక్ష ముందు రోజే చదివే అవసరం లేకుండా నేను ఏ సమయంలో పరీక్ష పెట్టినా రాయగలను అన్నాడు ఆ మాటలు విన్న రాజు తరగతిలో గురువుగారు ఎవ్వరూ దోచలేని ధనమే విద్యా ధనం అని ఎందుకు చెప్పారో అర్థమైంది.

ఆ రోజునుండి రాజు కూడా ఏ రోజు విన్న పాఠాలు, ఆ రోజే నేర్చుకోవడం మొదలు పెట్టాడు.


దారి కనుక్కోండి



జంతువులు ఎన్ని?



జత ఉన్న బొమ్మ ఏది?



సరైన నీడ ఏది?



				9	5			
	3				7		4	2
5	6							8
4			2		6			
	7						3	
			5		9			4
8							1	7
2	4		7				8	
			6	2				

డైలీ సుడోకు - 340

సుడోకు - 339 సమాధానం

1	4	9	2	7	8	5	3	6
8	7	5	6	3	1	2	4	9
6	2	3	9	5	4	8	1	7
9	6	2	4	8	7	1	5	3
7	1	8	5	2	3	6	9	4
3	5	4	1	6	9	7	8	2
4	8	6	3	1	2	9	7	5
5	9	1	7	4	6	3	2	8
2	3	7	8	9	5	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.